www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

దసరా శుభాకాంక్షలు

MUDA APPROVED
& RERA REGISTERED
@SHADNAGAR
905 905 4445

గురువారం | 2-10-2025 | పేజీలు: 20 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 168 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజమాసం, శుక్లపక్షం; తిథి: దశమి రా.7.11 తదుపరి ఏకాదశి; నక్షత్రం: ఉత్తరాషాఢ ఉ.9.13 తదుపరి శ్రవణం; వర్జ్యం: మ.1.16-2.53; దుర్ముహూర్తం: ఉ.10.06-10.53, మ.2.50-3.37; అమృతఘడియలు: రా.11.00-12.38; రాహుకాలం: మ.1.30-3.00; సూర్యోదయం: 6.09; సూర్యాస్తమయం: 5.59 | హైదరాబాద్ సిటీ*

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

బిజినెస్

టాప్‌గేర్‌లో ఆటో

జీఎస్‌టీ, పండుగ సీజన్‌తో అమ్మకాల్లో వృద్ధి

న్యూఢిల్లీ: దేశీయ ఆటోమొబైల్ రంగంలో అమ్మకాలు జోరందుకున్నాయి. జీఎస్‌టీ 2.0 సంస్కరణలు అమలులోకి రావడం, నవరాత్రి పండుగ సీజన్, వినియోదారుల విశ్వాసం పెరగడం వంటి అంశాలు సెప్టెంబర్ నెలలో డిమాండ్ పెరిగేందుకు దోహదపడ్డాయి. ఫలితంగా వాహన రంగంలో దాదాపు అన్ని ప్రముఖ కంపెనీలు రికార్డు స్థాయిలో అమ్మకాలను నమోదు చేశాయి. దిగ్గజ సంస్థలైన మారుతీ సుజుకీ, టాటా మోటార్స్, మహీంద్రా అండ్ మహీంద్రా ఈ నెలలో బలమైన అమ్మకాలను ప్రకటించాయి. వాహన హోల్‌సేల్ అమ్మకాల్లో హ్యూండయ్ మోటార్ ఇండియాను అధిగమించి టాటా మోటార్స్, మహీంద్రా అండ్ మహీంద్రా వరుసగా రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి. దేశంలోని అతి పెద్ద కార్ల తయారీదారు మారుతి సుజుకీ రిటైల్ విక్రయాలు గత సెప్టెంబర్‌తో పోలిస్తే 27.5 శాతం పెరిగి 1.73 లక్షల యూనిట్లుకు చేరాయి.

- టాటా మోటార్స్ 60,907 కార్లు విక్రయించింది. గత సెప్టెంబరుతో పోల్చితే ఇది 47% అధికం మాత్రమే కాకుండా ఒక నెలలో గరిష్ఠ అమ్మకాల రికార్డు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



2వ తేదీ			
హైదరాబాద్	500	విజయవాడ	525
వరంగల్	502	గోదావరి	530
చిత్తూరు	543	విశాఖపట్నం	520
		దజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	115	విజయవాడ	119
వరంగల్	115	గుంటూరు	125
కరీంనగర్	115	ఒంగోలు	125
మహబూబ్‌నగర్	115	చిత్తూరు	104
కర్నూలు	115	నెల్లూరు	109
విశాఖపట్నం	122	అనంతపురం	109
గోదావరి	119		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,18,640 ▲	1,08,750 ▲	1,60,000 ▼
విజయవాడ	1,21,000 ▲	1,15,000 ▲	1,49,500 ▲
విశాఖపట్నం	1,19,903 ▲	1,08,900 ▲	1,60,000 ▼
రాజమండ్రి	1,19,240 ▲	1,09,300 ▲	1,49,200 ▼
ప్రొద్దుటూరు	1,21,900 ▼	1,12,150 ▼	1,50,000 ▲
ముంబై	1,17,332 ▲	1,07,476 ▲	1,45,120 ▲

'రెపో' రేటు యథాతథం

యూపీఐ చెల్లింపులన్నీ ఉచితమే

జీడీపీ వృద్ధి అంచనా 6.8 శాతానికి పెంపు

ద్రవ్యోల్బణ అంచనా 2.6 శాతానికి కుదింపు

ఎగుమతిదారులకు ఊరట

ప్రాథమిక ఖాతాలపైనా ఉచిత డిజిటల్ సేవలు

ముంబై: కీలక స్వల్ప కాలిక 'రెపో' రేటును ప్రస్తుతం ఉన్న 5.5 శాతం వద్ద యథాతథంగా కొనసాగించాలని ఆర్‌బీఐ ద్రవ్య విధాన కమిటీ (ఎంపీసీ) నిర్ణయించింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గవర్నర్ సంజయ్ మల్హోత్రా అధ్యక్షతన సోమవారం నుంచి మూడు రోజుల పాటు జరిగిన సమావేశంలో ఎంపీసీ ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. ఎంపీసీ రెపోరేటును యథాతథంగా 5.5 శాతం వద్ద కొనసాగించడం వరుసగా ఇది రెండో సారి. ఈ వడ్డీరేటు పైనే బ్యాంకులు, ఆర్‌బీఐ నుంచి స్వల్పకాలిక రుణాలు తీసుకుంటాయి. రిటైల్ ద్రవ్యోల్బణం తగ్గుముఖం పట్టి, జీడీపీ వృద్ధి రేటు ఆశాజనకంగా ఉండడంతో ఎంపీసీ ఈ నిర్ణయం తీసుకుందని భావిస్తున్నారు. సుంకాల పోటు ప్రభావంపై ఇంకా ఒక అంచనాకు రాకపోవడం కూడా ఇందుకు దోహదం చేసిందని తెలుస్తోంది.

ద్రవ్యోల్బణం మరింత కిందికే

అంతర్జాతీయంగా ఆర్థిక అనిశ్చితి ఉన్నా, వచ్చే ఆరు నెలల్లోనూ మన దేశంలో ధరల సెగ పెద్దగా ఉండకపోవచ్చని ఆర్‌బీఐ భావిస్తోంది. ఆహార ఉత్పత్తుల ధరలు బాగా తగ్గడం ఇందుకు దోహదం చేయనుందని మల్హోత్రా చెప్పారు. దీంతో ఈ ఆర్థిక సంవత్సరానికి రిటైల్ ద్రవ్యోల్బణం అంచనాను గతంలో ప్రకటించిన 3.1 శాతం నుంచి 2.6 శాతానికి కుదిస్తున్నట్టు చెప్పారు. ఇదే సమయంలో ఈ ఆర్థిక సంవత్సరానికి జీడీపీ వృద్ధిరేటు అంచనాల్ని ఆర్‌బీఐ 6.5 శాతం నుంచి 6.8 శాతానికి పెంచింది.

షేర్ మార్కెట్‌కు ఊతం

ఎంపీసీ దేశీయ స్టాక్ మార్కెట్‌కు మేలు చేసే కొన్ని నిర్ణయాలు తీసుకుంది. తొలి పబ్లిక్ ఇష్యూల్లో (ఐపీఓ) ఇన్వెస్ట్ చేసే మదుపరులకు బ్యాంకులు ఇచ్చే రుణపరిమితిని ప్రస్తుత రూ.10 లక్షల నుంచి రూ.25 లక్షలకు పెంచింది. ఈ వెసులుబాటు రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్టులు, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్టులకు (ఇన్విట్స్) కూడా వర్తిస్తుందని తెలిపింది. దీనికి తోడు లిస్టెడ్ కంపెనీల షేర్ల హామీపై బ్యాంకులు మదుపరులకు ఇచ్చే రుణ పరిమితిని ప్రస్తుత రూ.20 లక్షల నుంచి రూ.కోటికి పెంచాలని ప్రతిపాదిస్తున్నట్టు గవర్నర్ చెప్పారు. దేశంలో క్యాపిటల్ మార్కెట్ అభివృద్ధికి ఈ చర్య మరింత దోహదం చేస్తుందన్నారు.



యూపీఐ లావాదేవీలపై ఎలాంటి చార్జీ ఉండదు

యూపీఐ చెల్లింపు లావాదేవీలపై చార్జీలు విధిస్తారన్న వార్తలను ఆర్‌బీఐ గవర్నర్ తోసిపుచ్చారు. అసలు అలాంటి ప్రతిపాదనే తమ వద్ద లేదన్నారు. అయితే క్రెడిట్ కార్డులపై కొనుగోలు చేసే మొబైల్ ఫోన్ల ఈఎంఐలు సక్రమంగా చెల్లించకపోతే, బ్యాంకులు ఆ ఫోన్లను రిమోట్ పద్ధతిలో లాక్ చేసే విషయాన్ని మాత్రం పరిశీలిస్తున్నట్టు తెలిపారు. అనుకూల, ప్రతికూల అంశాలు అన్నిటిని కూలంకషంగా చర్చించాకే దీనిపై నిర్ణయం తీసుకుంటామని ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్ ఎం రాజేశ్వరరావు చెప్పారు.

ఎంపీసీ ఇతర ప్రధాన నిర్ణయాలు

- నో ఫ్రిల్స్ బ్యాంకు ఖాతాదారులకూ ఉచితంగా డిజిటల్ లావాదేవీల సేవలు.
- మరింత పటిష్ఠంగా అంబుడ్స్‌మన్ వ్యవస్థ.
- అంబుడ్స్‌మన్ పరిధిలోకి గ్రామీణ సహకార బ్యాంకులు.
- లిస్టెడ్ కంపెనీల విలీనాలు, కొనుగోళ్లకు రుణాలు సమకూర్చేందుకు దేశీయ బ్యాంకులకు అనుమతి.
- కొత్త పట్టణ సహకార బ్యాంకులకు లైసెన్సులపై త్వరలో చర్చా పత్రం.

ఎగుమతిదారులకు ఊరట

అమెరికా సుంకాల పోటును దృష్టిలో ఉంచుకుని ఎగుమతిదారులను ఆదుకునేందుకు ఎంపీసీ ప్రత్యేక చర్యలు చేపట్టింది. విదేశీ బ్యాంకుల్లో ఐఎఫ్‌ఎస్‌సీ ఖాతాల్లో ఉన్న ఎగుమతి నిధులను భారత్‌కు బదిలీ చేసే గడువుని ప్రస్తుత నెల రోజుల నుంచి మూడు నెలలకు పెంచాలని నిర్ణయించింది. వస్తు దిగుమతి చెల్లింపుల లావాదేవీల గడువు కూడా నాలుగు నెలల నుంచి ఆరు నెలలకు పెంచుతున్నట్టు ప్రకటించింది.

రూపాయి అంతర్జాతీయీకరణ

రూపాయి చెల్లింపులను ప్రోత్సహించేందుకు ఆర్‌బీఐ కొన్ని చర్యలు ప్రకటించింది. ఇందులో భాగంగా భూటాన్, శ్రీలంక, నేపాల్ దేశాల కంపెనీలకు అనుమతించిన దేశీయ బ్యాంకులు 'రూపాయి' రుణాలు ఇచ్చేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అలాగే దేశీయ బ్యాంకుల్లో స్పెషల్ రూపీ వోస్ట్రో అకౌంట్ (ఎస్‌ఆర్‌వీఏ) ఖాతాల్లో నిధులున్న విదేశీ బ్యాంకులు, ఆ నిధులను దేశీయ కంపెనీల రుణ పత్రాలు, కమర్షియల్ పేపర్స్‌లో పెట్టుబడి పెట్టేందుకు అనుమతించింది.

> ఎంపీసీ సమావేశం రెపోరేటు కంటే, అనేక ఇతర విధాన నిర్ణయాలకు ప్రాధాన్యత ఇచ్చింది. రిస్క్ ఆధారిత డిపాజిట్ ఇన్సూరెన్స్ ప్రీమియం విధానం ఆర్థికంగా మంచి స్థితిలో ఉన్న బ్యాంకుల లాభాలను మరింత పెంచుతుంది.
>
> - చల్లా శ్రీనివాసులు శెట్టి, చైర్మన్, ఎస్‌బీఐ

> ప్రాథమిక పొదుపు ఖాతాలున్న ఖాతాదారులకు కూడా మొబైల్, ఇంటర్నెట్ సేవలను విస్తరించడం మంచి చర్య. ఇది ఖాతాదారుపై సానుకూల ప్రభావం చూపిస్తుంది.
>
> - అజయ్ కుమార్ శ్రీవాస్తవ, ఎండీ అండ్ సీఈఓ, ఐఓబీ

మార్కెట్‌కు ఆర్‌బీఐ జోష్

ముంబై: ఈక్విటీ మార్కెట్లో ఆర్‌బీఐ పాలసీ ఉత్తేజం నింపింది. వడ్డీరేట్లు యథాతథంగా కొనసాగించడంతో పాటు ఈ ఏడాదికి వృద్ధిరేటు అంచనాను 6.8 శాతానికి పెంచడం సెంటిమెంట్ బలపడేందుకు దోహదపడింది. దీనికి తోడు ప్రపంచ మార్కెట్లలో సానుకూల ధోరణులు, క్రూడాయిల్ ధరల తగ్గుదలతో ఇన్వెస్టర్లు తక్కువ రేట్లకు అందుబాటులో ఉన్న నాణ్యమైన షేర్ల కొనుగోలుకు ఉత్సాహం చూపారు. ప్రధానంగా వడ్డీరేట్ల ప్రభావానికి లోనయ్యే రంగాల షేర్లు లాభాల బాట పట్టాయి. ఎనిమిది రోజుల వరుస నష్టాలకు తెర దించిన సెన్సెక్స్ 715.69 పాయింట్ల లాభంతో 80,893.31 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 225.20 పాయింట్ల లాభంతో 24,836.30 వద్ద ముగిసింది. ప్రధానంగా బ్యాంకింగ్, ఆటో, రియల్టీ కౌంటర్లలో కొనుగోళ్లు జోరుగా సాగాయి. బ్యాంకెక్స్ 1.44% లాభపడి 62,401.58 పాయింట్లకు చేరింది. ఆటో ఇండెక్స్ 0.74%, రియల్టీ ఇండెక్స్ 1.11% వృద్ధిని నమోదు చేశాయి. రంగాల వారీ సూచీలన్నీ కూడా లాభాల్లో ముగిశాయి.

- అమెరికన్ డాలర్ మారకంలో రూపాయి జీవితకాల కనిష్ఠ స్థాయిల నుంచి 9 పైసలు కోలుకుని 88.71 వద్ద ముగిసింది. మంగళవారం విదేశీ ఇన్వెస్టర్లు రూ.2,327 కోట్ల విలువ గల షేర్లను విక్రయించారు.

నేడు సెలవు

దసరా పర్వదినం, గాంధీ జయంతిని పురస్కరించుకుని గురువారం మార్కెట్లకు సెలవు. ఈక్విటీ, బులియన్, ఫారెక్స్ కమోడిటీ మార్కెట్లు పనిచేయవు.

ఎల్‌జీ ఇష్యూ ధర శ్రేణి రూ.1080-1140

ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఈ నెల 7వ తేదీన ప్రారంభించనున్న రూ.11,607 కోట్ల విలువ గల ఐపీఓలో షేరు ధర శ్రేణిని రూ.1080-రూ.1140గా ప్రకటించింది.

పసిడి ధర రూ.1,21,100

న్యూఢిల్లీ: బులియన్ మార్కెట్లో ర్యాలీ కొనసాగుతోంది. బుధవారం ఢిల్లీలో 10 గ్రాములు మేలిమి (24 కేరట్స్) బంగారం ధర రూ.1,100 పెరిగి రికార్డు స్థాయిలో రూ.1,21,100కు చేరింది. కిలో వెండి ధర మాత్రం ఎదుగూ బొదుగు లేకుండా రూ.1,50,500 వద్ద కొనసాగింది. అంతర్జాతీయ మార్కెట్‌లోనూ ఔన్స్ (31.10 గ్రాములు) పసిడి ధర 3,895.33 డాలర్లకు చేరి సరికొత్త రికార్డు నమోదు చేసింది.

టీసీఎస్‌లో 2,500 మంది ఔట్?

న్యూఢిల్లీ: ఐటీ కంపెనీల్లో ఉద్యోగాల కోత కొనసాగుతోంది. టీసీఎస్ కంపెనీ పూణె యూనిట్‌లో 2,500 మందిని తీసివేసినట్టు జాతీయ స్థాయిలో ఐటీ ఉద్యోగులకు ప్రాతినిధ్యం వహించే నాస్కెంట్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఉద్యోగుల సెనెట్ (ఎన్ఐటీఈఎస్) మహారాష్ట్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేసింది. వెంటనే ఈ విషయంలో జోక్యం చేసుకుని ఉద్యోగులను కాపాడాలని ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు హర్‌ప్రీత్ సింగ్ సలూజా మహారాష్ట్ర సీఎం ఫడ్నవిస్‌కు లేఖ రాశారు. వీరిలో ఎక్కువ మంది 40 ఏళ్ల పైబడిన మిడ్, సీనియర్ ఉద్యోగులని తెలిపారు. ఇలా ఉన్నపళంగా వీరిని ఉద్యోగాల నుంచి తీసివేయడంతో వారి కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడిందన్నారు. టీసీఎస్ మాత్రం ఈ వార్తల్లో నిజం లేదని పేర్కొంది. కంపెనీ అవసరాలకు తగ్గ సాంకేతిక నైపుణ్యాలు లేని అతి కొద్ది మంది ఉద్యోగులను మాత్రమే నిబంధనలకు అనుగుణంగా తొలగించామని పేర్కొంది. ఉద్యోగ సంఘాలు మాత్రం టీసీఎస్ ఇటీవల దేశవ్యాప్తంగా దాదాపు 30,000 మది ఉద్యోగులపై వేటువేసిందని చెబుతున్నాయి.

కర్ణాటకలో టీఏఎస్‌ఎల్, ఎయిర్‌బస్ హెలీకాప్టర్ ప్లాంట్

న్యూఢిల్లీ: యూరప్‌నకు చెందిన విమాన తయారీ దిగ్గజం ఎయిర్‌బస్, టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్ (టీఏఎస్‌ఎల్) ఉమ్మడి భాగస్వామ్యంలో హెచ్125 హెలీకాప్టర్ల తుది అసెంబ్లీ లైన్ కర్ణాటకలోని వామగల్‌లో ఏర్పాటు చేయనున్నాయి. పూర్తిగా భారతదేశంలోనే తయారైన తొలి హెలీకాప్టర్ 2027 ప్రారంభంలో ఈ ప్లాంట్ నుంచి విడుదల కానున్నట్టు రెండు కంపెనీలు ఒక సంయుక్త ప్రకటనలో వెల్లడించాయి. గుజరాత్‌లోని వడోదరాలో సి295 హెలీకాప్టర్ల తయారీ తర్వాత వస్తున్న రెండో ప్లాంట్ ఇది. అలాగే దేశంలో పూర్తిగా ప్రైవేట్ రంగంలో ఏర్పాటవుతున్న తొలి హెలీకాప్టర్ అసెంబ్లీ లైన్ ఇది. ఇదే ప్లాంట్ నుంచి ఈ హెలీకాప్టర్ మిలిటరీ వెర్షన్ హెచ్125ఎం కూడా తయారు చేసే యోచన ఉన్నట్టు తెలిపాయి.

ఆర్‌సీ ప్లాస్టో నుంచి అన్‌బ్రేకబుల్ చైర్



నాగపూర్: ప్రముఖ గృహోపకరణాల తయారీ సంస్థ ఆర్‌సీ ప్లాస్టో సరికొత్త కుర్చీని (చైర్) మార్కెట్‌లో విడుదల చేసింది. యూవీ ప్రొటెక్షన్, యాంటీ ఆక్సిడెంట్ టెక్నాలజీతో రూపొందించిన ఈ అన్‌బ్రేకబుల్ కుర్చీ 10 సంవత్సరాల హామీతో లభిస్తుందని కంపెనీ తెలిపింది. సాధారణ కుర్చీలతో పోలిస్తే దీనికి దృఢత్వం, మన్నిక ఎక్కువని పేర్కొంది. ప్రతి ఇంటి అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ స్టైలిష్ కుర్చీని డిజైన్ చేసినట్టు తెలిపింది. ప్రతి నగరంలో కంపెనీ డీలర్లు, అధీకృత పంపిణీదారుల వద్ద ఈ కుర్చీలు లభిస్తాయి.

స్పోర్ట్స్

విదేశీ లీగ్‌లలో పాక్ క్రికెటర్లు ఆడొద్దు

ఎన్‌ఓసీపై పీసీబీ సస్పెన్షన్

దుబాయ్: ఆసియా కప్ ఫైనల్లో బోల్తా పడడం.. అందునా భారత్ చేతిలోనే మూడు మ్యాచుల్లో పరాజయం పాలవడంతో పాకిస్థాన్ జట్టుపై స్వదేశంలో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో పాక్ క్రికెట్ బోర్డు (పీసీబీ) కీలక నిర్ణయం తీసుకుంది. పాక్ ఆటగాళ్లు విదేశీ క్రికెట్ లీగ్‌లలో పాల్గొనకుండా ఉండేలా 'నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ (ఎన్‌ఓసీ)'పై సస్పెన్షన్ విధించింది. అంటే.. ఇకనుంచి తమ క్రికెటర్లకు ఎన్‌ఓసీ జారీ చేయకుండా పీసీబీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ సుమైర్ అహ్మద్ కీలక ఆదేశాలు జారీ చేశారు. ఆస్ట్రేలియా బిగ్‌బాష్ లీగ్‌లో ఆడుతున్న బాబర్ ఆజమ్, షహీన్ షా అఫ్రీది, ఫహీమ్ అష్రాఫ్, రిజ్వాన్‌లాంటి కీలక ఆటగాళ్లపై తాజా నిర్ణయం ప్రభావం చూపనుంది. అంతేకాదు.. యూఏఈలో జరిగే ఇంటర్నేషనల్ లీగ్ టీ20లో ఆడేందుకు ఇప్పటికే రిజిస్ట్రేషన్ చేసుకున్న నసీమ్ షా, సయీమ్ అయూబ్, ఫఖర్ జమాన్‌తో పాటు మరో 16 మంది పాక్ క్రికెటర్లకు పీసీబీ నిర్ణయం శరాఘాతం కానుంది.

కావాలంటే.. వచ్చి తీసుకెళ్లండి!

ట్రోఫీ విషయంలో మారని నక్వీ తీరు

ఆసియా కప్ ట్రోఫీని తనతో తీసుకెళ్లడంపై ఎంతగా విమర్శలు వస్తున్నా.. మొహిసిన్ నక్వీ తీరు మారడం లేదు. ఆసియా క్రికెట్ మండలి చైర్మన్ అయిన నక్వీ.. దుబాయ్ హెడ్ ఆఫీస్‌లోని ట్రోఫీని భారత్ ఎప్పుడైనా తీసుకెళ్లవచ్చని ఎక్స్‌లో తెలిపాడు. అయితే, తన చేతుల మీదుగానే అందుకోవాలనే షరతు విధించాడు. మరోవైపు బీసీసీఐ ఒత్తిడికి భయపడిన నక్వీ.. ట్రోఫీని ఇప్పటికే యూఏఈ బోర్డుకు అందజేసినట్టు వార్తలు వస్తున్నాయి.

ర్యాంకింగ్స్‌లో అభిషేక్ రికార్డు



దుబాయ్: ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌లో అభిషేక్ శర్మ సరికొత్త రికార్డు నెలకొల్పాడు. బుధవారం విడుదల చేసిన తాజా ర్యాంకింగ్స్‌లో అభిషేక్ 931 రేటింగ్ పాయింట్లు సాధించి అగ్రస్థానంలో నిలిచాడు. 2020లో ఇంగ్లండ్ బ్యాటర్ డేవిడ్ మలన్ సాధించిన 919 రేటింగ్ పాయింట్ల రికార్డును 25 ఏళ్ల అభిషేక్ అధిగమించాడు. ఇంగ్లండ్ బ్యాటర్ ఫిల్ సాల్ట్ రెండో ర్యాంక్‌లో, హైదరాబాద్ బ్యాటర్ తిలక్ వర్మ మూడో స్థానంలో కొనసాగుతుండగా, సూర్య కుమార్ యాదవ్ రెండు స్థానాలు దిగజారి ఎనిమిదో స్థానంలో నిలిచాడు. బౌలర్ల జాబితాలో వరుణ్ చక్రవర్తి 803 పాయింట్లతో ప్రథమ స్థానాన్ని మరింత పదిలం చేసుకోగా, కివీస్ బౌలర్ జాకోబ్ డఫీ రెండో స్థానంలో నిలిచాడు. మరో స్పిన్నర్ కుల్‌దీప్ యాదవ్ తొమ్మిది స్థానాలు ఎగబాకి 12వ ర్యాంక్‌కు చేరుకున్నాడు. ఆల్‌రౌండర్ల జాబితాలో హార్దిక్ పాండ్యా అగ్రస్థానాన్ని కోల్పోయి రెండో ర్యాంక్‌లో నిలవగా, పాక్ ఆల్‌రౌండర్ సయీమ్ ప్రథమ స్థానాన్ని దక్కించుకున్నాడు.

ఆసీస్‌దే తొలి టీ20

కివీస్ పరాజయం

మౌంట్ మాంగనుయ్ (న్యూజిలాండ్): చాపెల్-హ్యాడ్లీ ట్రోఫీలో భాగంగా ఆతిథ్య న్యూజిలాండ్‌తో మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను ఆస్ట్రేలియా శుభారంభం చేసింది. బుధవారం జరిగిన తొలి మ్యాచ్‌లో ఆసీస్ 5 వికెట్ల తేడాతో కివీస్‌ను ఓడించింది. మొదట కివీస్ 20 ఓవర్లలో 181/6 స్కోరు చేసింది. టిమ్ రాబిన్సన్ (106 నాటౌట్) అజేయ సెంచరీతో ఆకట్టుకున్నాడు. ఛేదనలో మిచెల్ మార్ష్ (85) అర్ధ సెంచరీతో సత్తా చాటడంతో ఆసీస్ 16.3 ఓవర్లలోనే 185/4 స్కోరు చేసి గెలిచింది.



గార్డ్‌నర్ శతక మోత

కివీస్‌పై ఆసీస్ గెలుపు ● మహిళల వన్డే వరల్డ్‌కప్

ఇండోర్: ఆష్లే గార్డ్‌నర్ (115) శతక పోరాటంతో.. ఐసీసీ మహిళల వన్డే వరల్డ్‌కప్‌లో ఆస్ట్రేలియా బోణీ చేసింది. బుధవారం జరిగిన మ్యాచ్‌లో ఆసీస్ 89 పరుగుల తేడాతో న్యూజిలాండ్‌ను చిత్తు చేసింది. తొలుత ఆస్ట్రేలియా 49.3 ఓవర్లలో 326 రన్స్‌కు ఆలౌటైంది. జెస్ కెర్, తహూహూ చెరో మూడు వికెట్లు పడగొట్టారు. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకొన్న ఆసీస్ ప్రధాన బ్యాటర్లు విఫలం కావడంతో 129/5తో పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ దశలో ఆష్లే అద్భుత భాగస్వామ్యాలతో ఆదుకుంది. లిచ్‌ఫీల్డ్ (45), ఎలీస్ (33) ఫర్వాలేదనిపించారు. ఛేదనలో కివీస్ 43.2 ఓవర్లలో 237 పరుగులకే కుప్పకూలింది. సోఫీ డివైన్ (111) సెంచరీ వృథా అయింది. సదర్లాండ్, మోలినెక్స్ చెరో మూడు వికెట్లు దక్కించుకొన్నారు.

తొలి మ్యాచ్‌కు 23 వేల మంది..

గువహటి: ఐసీసీ మహిళల వన్డే వరల్డ్‌కప్‌లో భారత్, శ్రీలంక మధ్య జరిగిన ఆరంభ మ్యాచ్‌కు రికార్డుస్థాయిలో ప్రేక్షకులు హాజరయ్యారు. మంగళవారం జరిగిన ఈ మ్యాచ్‌కు 22,843 మంది హాజరైనట్టు ఐసీసీ తెలిపింది. మహిళల క్రికెట్‌లో ఓ గ్రూప్ మ్యాచ్‌కు ఇంత మంది రావడం రికార్డని పేర్కొంది. గతేడాది దుబాయ్‌లో భారత్-పాక్ మధ్య జరిగిన మ్యాచ్‌కు అత్యధికంగా 15,935 మంది హాజరయ్యారు. దీన్ని భారత్-లంక మ్యాచ్ అధిగమించింది.



రోస్టన్ చేజ్

విండీస్ పోటీనిచ్చేనా?

ఫేవరెట్ భారత్ | **తొలి టెస్ట్ నేటినుంచే** | నితీశ్‌కు చోటు దక్కేనా?

ఉదయం 9.30 నుంచి స్టార్ నెట్‌వర్క్‌లో

అహ్మదాబాద్: స్వదేశంలో టెస్ట్ సిరీస్ అంటే భారత్ తిరుగుండదు. కానీ, న్యూజిలాండ్ చేతిలో 0-3తో ఘోర పరాజయం తర్వాత అంతా తారుమారైంది. అయితే, సొంతగడ్డపై కొత్త కెప్టెన్ శుభ్‌మన్ ఘనంగా బోణీ చేయాలనుకొంటున్నాడు. వెస్టిండీస్‌తో రెండు టెస్టుల సిరీస్‌లో భాగంగా తొలి మ్యాచ్ గురువారం నుంచి జరగనుంది. ర్యాంకింగ్స్‌లో భారత్ నాలుగు.. విండీస్ ఎనిమిదో స్థానంలో ఉన్నాయి. విండీస్ ఫామ్ దృష్ట్యా ఈ మ్యాచ్‌లో భారత్ ఫేవరెట్ అనడంతో ఎటువంటి సందేహం లేదు. అయితే, కరీబియన్లు ఏమేరకు పోటీ ఇస్తారనేదే ఆసక్తికరం. ఆసియా కప్ ముగిసిన వెంటనే స్వదేశానికి చేరుకొన్న గిల్ టెస్ట్ మోడ్‌లోకి మారిపోయాడు. టీ20ల్లో గిల్ ఆశించిన రీతిలో రాణించలేకపోయినా.. ఇంగ్లండ్ సిరీస్‌లో తరహాలో మరోసారి చెలరేగాలనుకొంటున్నాడు. అంతేకాకుండా డబ్ల్యూటీసీ పాయింట్లు కూడా భారత్‌కు ఎంతో కీలకం. అయితే, మేఘావృతమైన వాతావరణానికి తోడు పిచ్‌పై పచ్చిక ఎక్కువగా ఉండడంతో టీమ్ కూర్పుపై సస్పెన్స్ కొనసాగుతోంది. రోహిత్, కోహ్లీ, అశ్విన్ రిటైర్మెంట్ తర్వాత స్వదేశంలో జరుగుతున్న తొలి సిరీస్ కావడంతో వారి స్థానాలను ఎవరు భర్తీ చేస్తారో చూడాలి. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో సమతుల్యత కనిపిస్తోంది. అయితే, పేస్ ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్, బ్యాటర్ దేవ్‌దత్ పడిక్కల్‌లో ఎవరికి తుదిజట్టులో చోటు దక్కుతుందనేది చూడాలి. జడేజా, కుల్దీప్ స్పిన్ విభాగానికి నేతృత్వం వహించనుండగా.. కౌంటీలు ఆడి వచ్చిన వాషింగ్టన్ సుందర్ తీవ్రంగా ప్రాక్టీస్ చేశాడు. కరుణ్ నాయర్‌పై వేటుపడడంతో.. వన్‌డౌన్‌లో సాయి సుదర్శన్ స్థానానికి ఢోకాలేదు. ఓపెనర్ కేఎల్ రాహుల్ సూపర్ ఫామ్‌లో ఉన్నాడు. జైస్వాల్ కొంత బ్రేక్ తర్వాత బరిలోకి దిగుతున్నాడు. బుమ్రా, సిరాజ్ పేస్ భారాన్ని మోయనున్నారు. ఇటీవలే నేపాల్ చేతిలో ఓడిన విండీస్ పరిస్థితి మరింత దీనంగా ఉంది. గాయాల కారణంగా షామర్ జోసెఫ్, అల్జారీ జోసెఫ్ దూరం కావడంతో జట్టు కష్టాలు మరింత పెరిగాయి. ఈ నేపథ్యంలో రోస్టన్ చేజ్ సేన భారత్‌కు ఏమేరకు పోటీ ఇస్తుందో చూడాలి.



ప్రాక్టీస్‌లో జడేజా, గిల్

> ఏ వికెట్‌పైనైనా సత్తా చాటగలం. గత కొన్నేళ్లుగా భారత్‌లో టెస్టులు వేగంగా ముగుస్తున్నాయి. అయితే, ఇంగ్లండ్‌తో సిరీస్ తరహాలో హోరాహోరీగా మ్యాచ్‌లు జరగాలని కోరుకొంటున్నాం. - గిల్

జట్లు (అంచనా)

భారత్: జైస్వాల్, రాహుల్, సాయి సుదర్శన్, గిల్ (కెప్టెన్), ధ్రువ్ జురెల్ (వికెట్ కీపర్), నితీశ్ కుమార్/పడిక్కల్, జడేజా, సుందర్, కుల్దీప్/ప్రసిద్ధ్ కృష్ణ, బుమ్రా, సిరాజ్.

వెస్టిండీస్: తేజ్‌నరైన్ చందర్‌పాల్, కెవలాన్ అండర్సన్, అలిక్ అథనజె, బ్రండన్ కింగ్, షాయ్ హోప్ (వికెట్ కీపర్), రోస్టన్ చేజ్ (కెప్టెన్), జస్టిన్ గ్రీవ్స్, కరే పియర్రీ, జోమెల్ వారికన్, అండర్సన్ ఫిలిప్/జోహన్నా లేన్. జేడెన్ సీల్స్.

పిచ్/వాతావరణం

భారత్‌లో ఎక్కువగా స్పిన్ వికెట్లు కనిపిస్తుంటాయి. అయితే, ఈ టెస్టుకు గ్రీన్ పిచ్ సిద్ధం చేయడం ప్రత్యేకం. పచ్చని వికెట్ పేసర్లకు అనుకూలించే అవకాశం ఉంది. వర్ష ఛాయలు ఎక్కువగా ఉన్నా.. మ్యాచ్ రద్దయ్యే స్థాయిలో ఉండదు.

ముకేశ్‌కు స్వర్ణం



- తేజస్వినికి రజతం
- జూ. షూటింగ్ వరల్డ్ కప్

న్యూఢిల్లీ: తెలుగు షూటర్ ముకేశ్ నేలవల్లి మరోసారి అంతర్జాతీయ వేదికపై అదరగొట్టాడు. రెండ్రోజుల క్రితం 25 మీటర్ల ర్యాపిడ్ ఫైర్ పిస్టల్‌లో రజతం నెగ్గిన ఈ గుంటూరు కుర్రాడు.. టోర్నీకి ఆఖరిరోజైన బుధవారం 25 మీటర్ల పిస్టల్ ఈవెంట్‌లో ఏకంగా స్వర్ణం సాధించాడు. ఓవరాల్‌గా 585 స్కోరుతో ముకేశ్ విజేతగా నిలిచాడు. అలెగ్జాండర్ కొవలెవ్ (తటస్థ అథ్లెట్) రజతం, భారత్‌కే చెందిన సాహిల్ చౌధురి కాంస్యం నెగ్గారు. మహిళల 25 మీటర్ల పిస్టల్ ఈవెంట్‌లో భారత షూటర్ తేజస్విని రజతం గెలిచింది. ఈ టోర్నీలో భారత్ 6 స్వర్ణాలు, 8 రజతాలు, 5 కాంస్యాలతో మొత్తం 19 పతకాలు నెగ్గి టాప్‌లో నిలిచింది.

నిన్న ఆసుపత్రి బెడ్‌పై.. నేడు పోడియంపై!

ప్రపంచ పారా అథ్లెటిక్స్



రొజా

న్యూఢిల్లీ: వాంతులు, వడదెబ్బ కారణంగా స్పృహ కోల్పోయిన దశలో మంగళవారం ఉదయం ఆసుపత్రిలో చేరిన పోలెండ్ పారా అథ్లెట్ రొజా కొజాకొవోస్కా.. మరుసటిరోజే ప్రపంచ పారా అథ్లెటిక్స్‌లో విజేతగా నిలిచి తన సంకల్ప బలాన్ని చాటింది. పూర్తి ఆరోగ్యంగా లేకున్నా, బుధవారం పోటీలకు వచ్చిన 36 ఏళ్ల రొజా.. మహిళల క్లబ్ త్రో ఎఫ్32 కేటగిరిలో ఏకంగా స్వర్ణం సాధించి సంచలనం సృష్టించింది.

నిరాశపరచిన తెలుగు అథ్లెట్ అకీరా

తెలుగు అథ్లెట్ అకీరా నందన్ బానోతుకు ప్రపంచ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో నిరాశ ఎదురైంది. 400 మీటర్ల టీ38 కేటగిరిలో ఫైనల్ చేరిన ఈ తెలంగాణ కుర్రాడు.. పతకవేటలో విఫలమయ్యాడు. మొత్తం ఎనిమిది మంది పోటీపడ్డ ఫైనల్లో అకీరా ఏడోస్థానానికి పరిమితమయ్యాడు.

హైదరాబాద్‌లో వాలీబాల్ లీగ్ సందడి



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ప్రైమ్ వాలీబాల్ లీగ్ (పీవీఎల్) నాలుగో సీజన్ పోటీలకు ఆతిథ్యం ఇచ్చేందుకు గచ్చిబౌలిలోని బాలయోగి స్టేడియం ముస్తాబైంది. బుధవారం జరిగిన ట్రోఫీ ఆవిష్కరణలో పది జట్ల కెప్టెన్లు పాల్గొన్నారు. గురువారం జరిగే తొలి మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ కాలికట్ హీరోస్‌తో ఆతిథ్య హైదరాబాద్ బ్లాక్ హాక్స్ పోటీ పడనుంది.



www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI



గురువారం | 2-10-2025 | పేజీలు: 20 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 168 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజమాసం, శుక్లపక్షం; తిథి: దశమి రా.7.11 తదుపరి ఏకాదశి; నక్షత్రం: ఉత్తరాషాఢ ఉ.9.13 తదుపరి శ్రవణం; వర్జ్యం: మ.1.16-2.53; దుర్ముహూర్తం: ఉ.10.06-10.53, మ.2.50-3.37; అమృతఘడియలు: రా.11.00-12.38; రాహుకాలం: మ.1.30-3.00; సూర్యోదయం: 6.09; సూర్యాస్తమయం: 5.59 | హైదరాబాద్ సిటీ*

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



జూబ్లీహిల్స్ టికెట్

ఎవరికిద్దాం?

ఉప ఎన్నికకు అభ్యర్థుల పేర్లు సిఫారసు చేయండి



- వారి గెలుపు అవకాశాలపై నివేదిక ఇవ్వండి
- ఇన్‌చార్జి మంత్రులకు సీఎం రేవంత్‌రెడ్డి సూచన
- పొన్నం, తుమ్మల, వివేక్, మహేశ్‌గౌడ్‌తో సీఎం భేటీ
- మూడు పేర్లను అధిష్ఠానానికి పంపనున్న టీపీసీసీ
- రేసులో పలువురు.. తుది నిర్ణయం హైకమాండ్‌దే

హైదరాబాద్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): అధికార కాంగ్రెస్ పార్టీ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు అభ్యర్థి ఎంపిక విషయంలో ఆచితూచి వ్యవహరిస్తోంది. ఇప్పటికే ముగ్గురు మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు, వివేక్ వెంకటస్వామిలను ఉప ఎన్నికకు ఇన్‌చార్జులుగా నియమించింది. బరిలో ఎవరిని దించితే గెలుపు అవకాశాలుంటాయో చెప్పాలని వారిని కోరుతోంది. ఈ మేరకు పోటీకి తగిన వ్యక్తులుగా పరిశీలనకు వచ్చినవారి పేర్లను సిఫారసు చేయాల్సిందిగా ఆ ముగ్గురు మంత్రులకు సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. సిఫారసు చేసే

మిగతా 13వ పేజీలో...

సికింద్రాబాద్‌లో స్టీల్ బ్రిడ్జి

- దేశంలోనే అతిపెద్ద ఉక్కు వంతెన
- ప్యారడైజ్ నుంచి శామీర్‌పేట మార్గంలో 11.65 కి.మీ. పొడవుతో నిర్మాణానికి గ్రీన్‌సిగ్నల్
- మరో 6.52 కిలోమీటర్లు రోడ్డుతో పాటు కొంత టన్నెల్
- 18.17 కిలోమీటర్లకు రూ.2232 కోట్లతో టెండర్

13





పాఠకులు,
ప్రకటనకర్తలు,
ఏజెంట్లు,
శ్రేయోభిలాషులకు
'ఆంధ్రజ్యోతి'
దసరా శుభాకాంక్షలు.

సెలవు

దసరా సందర్భంగా మా కార్యాలయాలకు గురువారం సెలవు. కావున 'ఆంధ్రజ్యోతి' శుక్రవారం (3-10-2025) సంచిక వెలువడదు. పునర్దర్శనం శనివారం.

- మేనేజింగ్ డైరెక్టర్



బకాయిలు అడిగితే..

అవమానిస్తున్నారు

12

- దసరాలోపు రూ.600 కోట్లు ఇస్తామన్నారు.. ఇచ్చింది రూ.200 కోట్లే
- ఈ నెల 12లోగా రూ.1000 కోట్లు ఇవ్వకుంటే.. సమ్మెకు దిగుతాం
- మంత్రులు మాట నిలబెట్టుకోలేదు.. ఇకపై చర్చలు ముఖ్యమంత్రితోనే
- ప్రైవేటు కాలేజీల యాజమాన్యాల సంఘాల సమాఖ్య ప్రతినిధులు



కాంగ్రెస్ సీనియర్ నేత
రాంరెడ్డి దామోదర్‌రెడ్డి

కన్నుమూత

11

అనారోగ్యంతో ఏఐజీలో చికిత్స పొందుతూ మృతి

ఉద్యోగులకు దసరా, దీపావళి కానుక

డీఏ 3% పెంచిన కేంద్రం

- జూలై 1 నుంచి వర్తింపు.. తాజా పెంపుతో 58 శాతానికి చేరిన కరువు భత్యం
- 49 లక్షల మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, 69 లక్షల మంది పింఛనుదారులకు లబ్ధి
- దేశంలో కొత్తగా 57 కేంద్రీయ విద్యాలయాలు.. తెలంగాణకు నాలుగు, ఏపీకి నాలుగు
- గోధుమ సహా 6 పంటలకు ఎమ్మెస్పీ పెంపు.. కేంద్ర మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం

2


DHARMA PRODUCTIONS
Dharma Productions & Mentor Disciple Entertainment presents
a Dharma Productions film
Revenge Never Looked This Festive!
Sunny sanskari ki Tulsi kumari
in cinemas TODAY
directed by Shashank Khaitan
a Dharma Productions Worldwide release


LAXMI LAXMAIAH PRESENTS
దసరా శుభాకాంక్షలు
PUBLIC OFFICER FOR LEGAL INVESTIGATIONS AND CRIMINAL EMERGENCIES
VARUN SANDESH in & as
కానిస్టేబుల్
CONSTABLE
RELEASING ON 10th OCT
DISTRIBUTORS
GLOBAL CINEMAS
NIZAM : GLOBAL CINEMAS
ANDHRA: SREE VEERANJANEYA FILMS
CEEDAD: VARALAKSHMI FILMS
ODISHA : AYUSH MOVIES
TAMIL NADU : JMM MOVIES
KERALA : JMM MOVIES
KARNATAKA: KESARI ENTERPRISES
NORTH INDIA : JAI VIRATRA ENTERTAINMENT LTD
OVERSEAS: NANMA INTERNATIONAL PTY LTD
ARYAN SUBHAN S.K
BALGAM JAGDESH


VADDE JISHNU PRESENTS
VADDE CREATIONS LLP
VADDE NAVEEN
TRANSFER త్రిమూర్తులు
PRODUCER VADDE NAVEEN
DIRECTOR KAMAL TEJA NARLA
దసరా శుభాకాంక్షలు


DINESH VIJAN PRESENTS
MADDOCK FILMS
దసరా శుభాకాంక్షలతో
థామా
DUBBED IN TELUGU
DIRECTED BY ADITYA SARPOTDAR
PRODUCED BY DINESH VIJAN AND AMAR KAUSHIK
Yeh Diwali... THAMAke wali
A MADDOCK FILMS PRODUCTION
దీపావళి విడుదల
IN CINEMAS 21ST OCTOBER


DVV
SMT. D PARVATHI PRESENTS
దసరా శుభాకాంక్షలు
PAWAN KALYAN IN
THEY CALL HIM
OG
WRITTEN & DIRECTED BY SUJEETH
DVV DANAYYA KALYAN DASARI
A THAMAN S MUSICAL
RAVI K CHANDRAN (ISC) MANOJ PARAMAHAMSA (ISC) NAVIN NOOLI A S PRAKASH DARSHAN JALAN & NEELANCHAL KUMAR GHOSH
HARISH PAI SATHYANARAYANA GUGGILLA SOMARAJU PVV ASHWIN MANI MALLESH T RAGHAV TAMMAREDDY MANIKANTA RONGALA
UDAY ALLA ARUN THEVAR LOKESH SRINIVASAN KISHORE SARELLA LAKSHMIVENUGOPAL
NETFLIX
IN CINEMAS NOW
SONY MUSIC

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
దసరా శుభాకాంక్షలు

అప్పుడు హెచ్చరించారు.. ఇప్పుడు దొరికిపోయారు!

12


- పోలీసుల అదుపులో 'ఐబొమ్మ' పైరసీ నిందితులు
- నలుగురిని అరెస్టు చేసిన సైబర్ క్రైమ్ పోలీసులు
- 2023లో 'ఐబొమ్మ' పెట్టిన పోస్ట్ ఇప్పుడు వైరల్



గురువారం | 2-10-2025 | పేజీలు: 20 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 168 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజమాసం, శుక్లపక్షం; తిథి: దశమి రా.7.11 తదుపరి ఏకాదశి; నక్షత్రం: ఉత్తరాషాఢ ఉ.9.13 తదుపరి శ్రవణం; వర్జ్యం: మ.1.16-2.53; దుర్ముహూర్తం: ఉ.10.06-10.53, మ.2.50-3.37; అమృతఘడియలు: రా.11.00-12.38; రాహుకాలం: మ.1.30-3.00; సూర్యోదయం: 6.09; సూర్యాస్తమయం: 5.59 | హైదరాబాద్ సిటీ*
Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

చొరబాటుదారులతో
జర జాగ్రత్త

- 'జనాభా'ను మార్చేయడమే వారి లక్ష్యం
- ఈ దేశానికి సమైక్యత, వైవిధ్యాలే బలం
- చొరబాట్ల వల్ల వాటికి తక్షణ ముప్పు
- వీరి ప్రయత్నాలతో దేశం బలహీనం
- ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది వేడుకల్లో ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్యలు
- రూ.వంద నాణెం, స్టాంప్ ఆవిష్కరణ



రూ.100 నాణెం, స్టాంప్‌ను ఆవిష్కరిస్తున్న ప్రధాని మోదీ

న్యూఢిల్లీ, అక్టోబరు 1: వైవిధ్యం, సమైక్యత...భారతదేశ బలాలని, వాటికి చొరబాటుదారులు ముప్పుగా మారారని ప్రధానమంత్రి నరేంద్రమోదీ హెచ్చరించారు. వీరి ప్రయత్నాలు ఫలిస్తే దేశం బలహీనపడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఢిల్లీలోని బీఆర్ అంబేడ్కర్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో జరుగుతున్న రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) శతాబ్ది వేడుకల్లో బుధవారం మోదీ పాల్గొన్నారు. "జనాభాలో గణనీయమైన మార్పు కోసం చొరబాటుదారులు ప్రయత్నిస్తున్నారు. దీనివల్ల సామాజిక సామరస్యం దెబ్బతిని, అంతర్గత భద్రత ప్రమాదంలో పడుతుంది" అని మోదీ తెలిపారు. యువత ఉపాధి అవకాశాలను చొరబాటుదారులు లాక్కోకుండా ఉండేందుకు, మన ఆడబిడ్డలను వారి నుంచి రక్షించేందుకు తాను ఆగస్టు 15న ప్రకటించిన డెమోగ్రాఫిక్ మిషన్ ఉపయోగపడుతుందని ఆయన చెప్పారు. జాతి నిర్మాణంలో ఆర్‌ఎస్‌ఎస్ గొప్ప భూమికను పోషించిందని మోదీ అన్నారు. సంస్థ తన చరిత్రలో పలు దాడులకు గురయినప్పటికీ, దేశానికి ఎన్నడూ అపకారం తలపెట్టలేదని తెలిపారు. దేశమే ప్రథమం అనే భావనతో ఆర్‌ఎస్‌ఎస్ పని చేస్తోందని, పేదల జీవితాలను మార్చేందుకు కృషిచేసిందని కొనియాడారు. "దేశ ప్రజల్లో సామరస్య భావనను వ్యాప్తిచేయడం లక్ష్యంగా దేశమంతా ఆర్‌ఎస్‌ఎస్ విస్తరించి పనిచేస్తోంది. సమాజంలోని కుల, మత, జాతి బేధాలను నిర్మూలించడం ద్వారా ఈ లక్ష్యాన్ని చేరుకునేందుకు కార్యక్రమాలను చేపడుతోంది. సమ్మిళిత సమాజ సాధన ఈ సంస్థ ఆశయం" అని మోదీ వివరించారు. దేశం పట్ల అపార ప్రేమను కలిగిన ఆర్‌ఎస్‌ఎస్ బ్రిటిషర్ల అకృత్యాలకు వ్యతిరేకంగా పోరాడిందని తెలిపారు. "జాతీయోద్యమ కార్యకర్తలకు సంఘ్ వలంటీర్లు ఆశ్రయమిచ్చారు. స్వయంగా ఆ సంస్థ నాయకులు కూడా జైలుపాలయ్యారు. సంస్థ స్ఫూర్తిని అణచివేయడానికి పలు ప్రయత్నాలు జరిగాయి. అబాండాలు వేస్తూ తప్పుడు కేసులు నమోదయ్యాయి. అయినా, ఆర్‌ఎస్‌ఎస్ ఈ దేశానికి అపకారం తలపెట్టలేదు. మంచి, చెడు.. రెండూ ఉండే సమాజంలో తననుతాను భాగం చేసుకుని పనిచేస్తోంది" అని మోదీ వివరించారు. మహాత్మాగాంధీ హత్య అనంతరం

మిగతా 2వ పేజీలో...



కేంద్రానికి హుషారు..
రాష్ట్రం ఉసూరు

- జీఎస్టీ వసూళ్లు రూ.1.89 లక్షల కోట్లు
- గత ఏడాదితో పోలిస్తే 9.1% పెరుగుదల
- 5% మేర తగ్గిన రాష్ట్ర జీఎస్టీ వసూళ్లు

హైదరాబాద్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ రేట్ల తగ్గింపుతో సెప్టెంబరు నెల ద్వితీయార్థంలో పన్ను వసూళ్లు జోరందుకున్నాయి. గత ఏడాది సెప్టెంబరులో దేశవ్యాప్తంగా జీఎస్టీ వసూళ్లు రూ.1.73 లక్షల కోట్లు కాగా.. ఈ సారి రూ.1.89 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. అంటే 9.1 శాతం పెరిగాయి. ఆగస్టుతో పోలిస్తే సెప్టెంబరు వసూళ్లు 1.5% అధికంగా ఉన్నాయి. దేశంలో జీఎస్టీ 2.0 సంస్కరణలు గత నెల 22 నుంచి అమలులోకి రావడంతో 375 నిత్యావసర వస్తువుల ధరలు తగ్గిన సంగతి తెలిసిందే. దీంతో వస్తు సేవలు, ఆటోమొబైల్స్, గృహోపకరణాలకు డిమాండు పెరిగిందని విశ్లేషకులు చెబుతున్నారు. గత నెలలో స్థూల జాతీయాదాయం 6.8% పెరిగి రూ.1.36 లక్షల కోట్లకు చేరగా దిగుమతుల ద్వారా పన్ను రాబడి 15.6% వృద్ధితో రూ.52,492 కోట్లకు చేరింది. జీఎస్టీ రిఫండ్లు కూడా భారీగా 40.1% పెరిగి రూ.28,657 కోట్లుగా నమోదయ్యాయి. నికరంగా జీఎస్టీ వసూలు రూ.1.60 లక్షల కోట్లుంది. గత ఏడాది సెప్టెంబరుతో పోలిస్తే ఇది 5% అధికం. జీఎస్టీ రేట్లు తగ్గుతాయన్న అంచనాతో ఆర్థిక కార్యకలాపాలు మందగించలేదనడానికి ఈ వసూళ్లు నిదర్శనమని డెలాయిట్ పార్టనర్ ఎంఎస్ మణి అన్నారు. సెప్టెంబరు వసూళ్లతో ఈ ఏడాది ఇప్పటివరకు సగటు వసూళ్లు రూ.2 లక్షల కోట్లకు చేరువలో ఉన్నట్టు చెప్పారు. రాష్ట్రాల వారీగా చూసినట్టయితే తెలంగాణలో జీఎస్టీ వసూళ్లు గత ఏడాది సెప్టెంబరుతో పోలిస్తే.. 5% తగ్గగా ఏపీలో 4% పెరిగాయి. సెప్టెంబరులో తెలంగాణలో రూ.4,998 కోట్ల జీఎస్టీ వసూలవగా.. గత ఏడాది ఇదే నెలలో రూ.5,267 కోట్లు వచ్చాయి.

అమెరికా ప్రభుత్వం
షట్‌డౌన్



2018 తర్వాత ఇదే మొదటిసారి

వాషింగ్టన్, అక్టోబరు 1: అమెరికా కాంగ్రెస్‌లో అధికార పక్షం ప్రవేశపెట్టిన తాత్కాలిక బడ్జెట్‌కు.. తాము ప్రతిపాదించిన మార్పులు చేయకపోవడంతో డెమొక్రాట్లు ఆ బిల్లును బ్లాక్ చేశారు. దీనివల్ల నిధులు నిలిచిపోవడంతో అమెరికాలో అత్యవసర సేవలు మినహా మిగతా ప్రభుత్వ కార్యకలాపాలన్నీ భారత కాలమానం ప్రకారం బుధవారం ఉదయం 9.30 గంటల నుంచి (షట్‌డౌన్) స్తంభించిపోయాయి. 2018 తర్వాత ఇలా జరగడం ఇదే మొదటిసారి. అప్పుడూ ట్రంపే అధికారంలో ఉన్నారు. మెక్సికో సరిహద్దుల్లో గోడ కట్టడానికి ట్రంప్ సర్కారు అడిగిన నిధులివ్వడానికి డెమొక్రాట్లు ఒప్పుకోకపోవడంతో 2018 డిసెంబరు 22న షట్‌డౌన్ మొదలైంది. చివరకు అది 2019 జనవరి 25న ముగిసింది. ఇప్పుడు కూడా ట్రంప్ సర్కారు ప్రవేశపెట్టిన తాత్కాలిక బడ్జెట్‌కు ఆమోదం లభించేదాకా ఈ షట్‌డౌన్ కొనసాగుతుంది. అప్పటిదాకా సైన్యం, పోలీసు, వైద్యం, విమాన రవాణా తదితర అత్యవసర సేవలు మాత్రమే కొనసాగుతాయి. అత్యవసరం కాని.. జాతీయ పార్కులు, మ్యూజియాలు, కొన్ని ప్రభుత్వ కార్యాలయాలను మూసేస్తారు. షట్‌డౌన్ సాగినన్నాళ్లూ వాటిలోని ఉద్యోగులు కార్యాలయానికి రానక్కర్లేదు. ఈ సమయంలో పనిచేసినవారికి సైతం బడ్జెట్‌కు ఆమోదం లేకపోవడంతో వెంటనే జీతాలు ఇవ్వరు. బడ్జెట్‌కు ఆమోదం లభించిన తర్వాత మాత్రమే ఆ కాలానికి జీతం ఇస్తారు.

దేశంలో అత్యంత సంపన్న మహిళగా
రోష్నీ నాడార్



- 2.84 లక్షల కోట్ల సంపదతో రికార్డు సృష్టించిన హెచ్‌సీఎల్ చైర్‌పర్సన్
- రూ.9.55 లక్షల కోట్లతో ప్రథమ స్థానంలో ముకేశ్ అంబానీ
- రూ.8.14 లక్షల కోట్లతో రెండో స్థానంలో గౌతమ్ అదానీ

2

ఫిలిప్పీన్స్‌లో భారీ భూకంపం



- 69 మంది మృతి
- రిక్టర్ స్కేల్‌పై 6.9గా తీవ్రత

2

రూ.40 కోట్ల డ్రగ్స్‌తో దొరికిపోయాడు!

బాలీవుడ్ నటుడు విశాల్ బ్రహ్మ అరెస్టు

- సింగపూర్ నుంచి వస్తుండగా చెన్నై విమానాశ్రయంలో అదుపులోకి తీసుకున్న డీఆర్ఐ
- ఆర్థిక కష్టాలతో నైజీరియా ముఠాను ఆశ్రయించిన బ్రహ్మ
- వారి సూచనలతో డ్రగ్స్ బ్యాగు తీసుకొచ్చి పట్టుబడ్డ వైనం

13

రెడ్ బుక్, పింక్ బుక్‌లు ఉండవు

మాకు ఉన్నది ఒక్కటే బుక్.. అదే ఖాకీ బుక్



- సోషల్ మీడియాపై నిఘా పెడతాం
- మహిళలను కించపరిస్తే కఠిన చర్యలు
- రౌడీ షీట్లు తెరిచేందుకూ వెనుకాడం
- స్థానిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చూడడమే మా ముందున్న సవాల్
- డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపుతాం
- మావోయిస్టులు లొంగిపోవాలి: శివధర్‌రెడ్డి
- రాష్ట్ర నూతన డీజీపీగా బాధ్యతల స్వీకరణ

12

ఉద్యోగులకు దసరా, దీపావళి కానుక

డీఏ 3 శాతం పెంచిన కేంద్రం.. దేశంలో కొత్తగా 57 కేంద్రీయ విద్యాలయాలు.. కేంద్ర మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం

న్యూఢిల్లీ, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు మోదీ సర్కారు దసరా, దీపావళి పండగలకు కానుక ఇచ్చింది. కరవు భత్యం (డీఏ)ను 3 శాతం పెంచింది. ఈ పెంపు జూలై 1 నుంచి వర్తిస్తుందని తెలిపింది. ఈ మేరకు బుధవారం ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఆమోదముద్ర వేశారు. అలాగే మరికొన్ని కీలక నిర్ణయాలు కూడా తీసుకున్నారు. మంత్రివర్గ సమావేశం వివరాలను కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ విలేకరులకు వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం ఉద్యోగులకు ఏటా రెండుసార్లు డీఏను సవరిస్తూ ఉంటుంది. పెరుగుతున్న నిత్యావసర ధరలకు పరిహారంగా ఉద్యోగులు, పింఛనుదారులకు ఈ కరవు భత్యాన్ని అందజేస్తారు. ఈ ఏడాది మార్చిలో డీఏను 2 శాతం పెంచారు. తాజాగా 3 శాతం పెంచడంతో 55 శాతంగా ఉన్న డీఏ 58 శాతానికి చేరనుంది. ఈ పెంపుతో 49 లక్షల మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, 69 లక్షల మంది పింఛనుదారులు లబ్ధి పొందనున్నారు. జూలై, ఆగస్టు, సెప్టెంబరు నెలలకు సంబంధించిన డీఏ బకాయిలను అక్టోబరు నెల జీతంతో కలిపి దీపావళి కంటే ముందే అందిస్తామని వివరించారు. తాజా డీఏ పెంపు వల్ల కేంద్రంపై ఏటా అదనంగా రూ.10,083 కోట్ల భారం పడుతుందని తెలిపారు. కాగా, దేశంలో కొత్తగా 57 కేంద్రీయ విద్యాలయా(కేవీ)లను ప్రారంభించేందుకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ కేవీలతో 86 వేల మంది విద్యార్థులకు లబ్ధి చేకూరనుందని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ చెప్పారు. 57లో ఏడింటి ఖర్చును కేంద్ర హోం శాఖ భరిస్తుందని, మిగిలిన వాటికి రాష్ట్ర ప్రభుత్వాలే భరిస్తాయని వివరించారు. కేవీల ఏర్పాటుకు రూ.5862.55 కోట్ల వ్యయం అవుతుందన్నారు. ఇప్పటి వరకు కేవీలు లేని జిల్లాలు, మావోయిస్టు ప్రభావిత జిల్లాలు, కొండ పాలిత రాష్ట్రాల్లో వీటిని ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. కొత్త కేవీల్లో తెలంగాణ, ఏపీలకు నాలుగు చొప్పున కేటాయించారు. బయోమెడికల్ రిసెర్చ్ కెరీర్ ప్రోగ్రామ్ మూడో దశకు కూడా మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ పథకం కింద రూ.1500 కోట్లతో 2000 మంది విద్యార్థులకు శిక్షణ ఇవ్వనున్నారు. గోధుమలకు కనీస మద్దతు ధరను క్వింటాకు రూ.160 పెంచుతూ నిర్ణయం తీసుకుంది. గత ఏడాది గోధుమలకు ఎమ్మెస్పీ క్వింటాకు రూ.2425 ఉండగా.. 2026-27 సీజన్‌కు దాన్ని రూ.2585కు పెంచుతున్నట్లు కేంద్ర మంత్రి వైష్ణవ్ వెల్లడించారు. 2026-27 రబీ సీజన్‌కు సంబంధించి కుసుమలకు ఎమ్మెస్పీ క్వింటాకు రూ.600, ఎర్ర కంది పప్పుకురూ.300, ఆవాలురూ.250, శనగలు 225, బార్లీకిరూ.170 చొప్పున పెంచినట్లు తెలిపారు. జాతీయ గేయం 'వందేమాతరం' 150ఏళ్ల ఉత్సవాలను ఘనంగా జరుపుకోవాలని నిర్ణయించినట్లు వైష్ణవ్ చెప్పారు.

లోకం తీరు



ఇద్దరు చిన్నారులను బలిగొన్న దగ్గు మందు!

- మరో 10 మంది పిల్లలకు అనారోగ్యం
- ఆ మందు సురక్షితమేనంటూ తాగిన ఓ వైద్యుడికి అస్వస్థత.. రాజస్థాన్‌లో ఘటన
- ఆ సిరప్ 22 బ్యాచ్‌లపై సర్కారు నిషేధం

జైపూర్, అక్టోబరు 1: దగ్గు మందు సిరప్ తాగి ఇద్దరు చిన్నారులు మృతి చెందగా.. మరో 10 మంది పిల్లలు అనారోగ్యం బారిన పడ్డారు. ఆ సిరప్ సురక్షితమేనని నిరూపించేందుకు తాగిన ఓ వైద్యుడూ అస్వస్థతకు గురై కొద్ది సేపు స్పృహ కోల్పోయారు. రాజస్థాన్‌లో గత రెండు వారాల్లో చోటు చేసుకున్న ఘటనలు ఆలస్యంగా వెలుగులోకి వచ్చాయి. సికార్ జిల్లాకు చెందిన 5 ఏళ్ల నితీశ్ దగ్గుతో బాధపడుతుండగా సెప్టెంబరు 28న చిరానాలోని ప్రభుత్వాస్పత్రికి తల్లిదండ్రులు తీసుకెళ్లారు. అక్కడి వైద్యుడు అతడికి సిరప్‌ను ఇచ్చారు. రాత్రి అది తాగి పడుకున్న నితీశ్ ఉదయం లేవలేదు. దీంతో కంగారు పడిన తల్లిదండ్రులు అతడిని ఆస్పత్రికి తరలించగా అప్పటికే మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. సెప్టెంబరు 22న మల్హాలో జ్యోతి అనే మహిళ తన ముగ్గురు పిల్లలకు ప్రభుత్వాస్పత్రి నుంచి తెచ్చిన అదే దగ్గు సిరప్‌ను తాగించింది. కాసేపటికే ఆ ముగ్గురూ స్పృహ కోల్పోగా.. ఇద్దరు వాంతులు చేసుకుని ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. 2 ఏళ్ల సామ్రాట్ జాతవ్ పరిస్థితి విషమించడంతో మరణించాడు. అదే నెల 24న బయానాలోని ప్రభుత్వాస్పత్రిలో ఓ మూడేళ్ల చిన్నారికి డాక్టర్ తారాచంద్ యోగి ఆ సిరప్ ఎను ఇచ్చారు. అది తాగిన బాలుడు అస్వస్థతకు గురవ్వడంతో తల్లిదండ్రులు డాక్టర్‌ను నిలదీశారు. ఈ క్రమంలోనే ఆ సిరప్ సురక్షితమేనని నిరూపించేందుకు యోగి తాను తాగారు. ఆ తర్వాత కారులో బయలుదేరిన యోగి.. అందులోనే స్పృహ కోల్పోయారు. ఈ నేపథ్యంలో కేసన్ సంస్థ సరఫరా చేసిన 22 బ్యాచ్‌ల దగ్గు మందు సిరప్‌లను నిషేధించి.. వాటి పంపిణీని నిలిపేస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

మల్లికార్జున ఖర్గేకు పేస్‌మేకర్

- హార్ట్ బీట్‌లో వ్యత్యాసం ఉండడంతో అమర్చిన వైద్యులు

బెంగళూరు, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే స్వల్ప అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చేరారు. మంగళవారం సదాశివనగర్‌లోని నివాసంలో ఉండగా ఆయనకు శ్వాసకోశ సమస్య తలెత్తడంతో కుటుంబ సభ్యులు వెంటనే బెంగళూరులోని ఎంఎస్ రామయ్య ఆస్పత్రికి తరలించారు. హార్ట్ బీట్‌లో వ్యత్యాసం ఉండడంతో వైద్యులు బుధవారం ఆయనకు పేస్‌మేకర్ అమర్చినట్టు ఖర్గే కుమారుడు, కర్ణాటక మంత్రి ప్రియాంక్ ఖర్గే వెల్లడించారు. 'వయో సంబంధిత సమస్యలు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది కారణంగా ఖర్గే ఆస్పత్రిలో చేరారు. హృదయ స్పందనలో తేడా ఉండడంతో దాన్ని సరిచేసేందుకు వైద్యులు ఆయన గుండెకు పేస్‌మేకర్ అమర్చారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉంది. ఒకరోజు విశ్రాంతి అవసరమని డాక్టర్లు సూచించారు' అని పేర్కొంటూ ప్రియాంక్ ఎక్స్‌లో ట్వీట్ చేశారు. సీఎం సిద్దరామయ్య బుధవారం ఆస్పత్రికి వెళ్లి ఖర్గేను పరామర్శించారు. అనంతరం సీఎం మీడియాతో మాట్లాడుతూ.. ఖర్గే ఆరోగ్యంగా ఉన్నారని, గురువారం డిశ్చార్జ్ అవుతారని చెప్పారు.

ఫిలిప్పీన్స్‌లో భారీ భూకంపం.. 69మంది మృతి

సెబు(ఫిలిప్పీన్స్), అక్టోబర్ 1: సెంట్రల్ ఫిలిప్పీన్స్‌లో మంగళవారం రాత్రి భారీ భూకంపం సంభవించింది. ఈ ఘటనలో 69మంది ప్రాణాలు కోల్పోగా, అనేక మంది గాయపడ్డారు. రిక్టర్ స్కేల్‌పై భూకంప తీవ్రత 6.9గా నమోదైంది. సెబు ప్రావిన్స్‌లోని బోగో నగరానికి 19 కిలోమీటర్ల దూరంలో భూకంప కేంద్రం ఉందని అధికారులు తెలిపారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ప్రధానంగా బోగో నగరంలో దాదాపు 90వేల మంది భూకంపం కారణంగా ప్రభావితమయ్యారు. మృతుల్లో దాదాపు సగం మంది ఈ నగరానికి చెందినవారేనని తెలుస్తోంది. భూకంపం ధాటికి అనేక ఇళ్లు, బహుళ అంతస్తుల భవనాలు ధ్వంసమయ్యాయి. విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. రహదారులు దెబ్బతిన్నాయి. పర్వత ప్రాంతాల్లో ఉన్న గ్రామాలపై కొండచరియలు విరిగిపడటంతో అక్కడికి చేరుకోవడానికి సహాయక బృందాలు శ్రమిస్తున్నాయి. శిథిలాల కింద చిక్కుకుపోయిన వారిని బయటకు తీసేందుకు ప్రయత్నాలు జరుగుతుండగా.. బుధవారం ఉదయం వర్షం కురవడంతో సహాయక చర్యలకు ఆటంకం ఏర్పడింది. తొలుత సునామీ హెచ్చరికలు జారీ చేసిన ఫిలిప్పీన్స్ జియోలాజికల్ విభాగం ఆ తర్వాత వాటిని ఉపసంహరించుకుంది. ఇటీవల తుఫాను సృష్టించిన బీభత్సం నుంచి ఫిలిప్పీన్స్ ఇంకా కోలుకోక ముందే, భూకంపం రూపంలో మరోసారి ప్రకృతి విరుచుకుపడింది.

దేశంలోనే తొలి త్రీడీ ప్రింటెడ్ గ్రామీణ గృహం

- రూర్కీలో ప్రారంభించిన కేంద్ర మంత్రి పెమ్మసాని



రూర్కీలో త్రీడీ ప్రింటెడ్ గ్రామీణ గృహాన్ని ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి పెమ్మసాని

న్యూఢిల్లీ, అక్టోబరు 1: దేశంలోనే మొట్టమొదటి త్రీడీ కాంక్రీట్ ప్రింటెడ్ గ్రామీణ గృహాన్ని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ బుధవారం ప్రారంభించారు. ఉత్తరాఖండ్‌లోని రూర్కీలో ఉన్న సెంట్రల్ బిల్డింగ్ రిసెర్చ్ ఇనిస్టిట్యూట్ (సీఎస్ఐఆర్-సీబీఆర్ఐ)లో ఆయన దీన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో అర్హులైన వారందరికీ ఇళ్లు నిర్మించాలన్న కేంద్ర ప్రభుత్వ లక్ష్యం దిశగా ఇదొక కీలక ముందడుగని అన్నారు. టెక్నాలజీ సాయంతో గ్రామీణ ప్రాంతాల్లో తక్కువ సమయంలో, తక్కువ ఖర్చుతో నిర్మిస్తున్న ఈ త్రీడీ ప్రింటెడ్ ఇళ్లు.. పర్యావరణ అనుకూలంగా ఉంటాయని చెప్పారు. ప్రధాన మంత్రి గ్రామీణ ఆవాస్ యోజన (పీఎంఏవై-జీ) పథకం కింద దేశవ్యాప్తంగా 3.85 కోట్ల ఇళ్లు మంజూరు చేశామని, వాటిలో 2.87 కోట్ల ఇళ్లు పూర్తయ్యాయని వెల్లడించారు. ఈ ప్రయాణంలో సీబీఆర్ఐ సహకారం మరువలేనిదన్నారు. ఈ సందర్భంగా 'ఉత్తరాఖండ్‌లో గ్రామీణ గృహనిర్మాణం' పేరుతో రూపొందించిన పుస్తకాన్ని కూడా మంత్రి విడుదల చేశారు. 'అభివృద్ధి అంటే కేవలం ఇళ్లు నిర్మించడమే కాదు. అవి గౌరవం, స్వావలంబనతో వారి జీవితాల్లో వెలుగులు నింపేలా ఉండాలి' అని పెమ్మసాని పేర్కొన్నారు.

దేశంలో అత్యంత సంపన్న మహిళగా రోష్ని నాడార్ మల్హోత్రా

- రూ.2.84 లక్షల కోట్ల సంపదతో రికార్డు
- రూ.9.55 లక్షల కోట్లతో ప్రథమ స్థానంలో ముకేశ్ అంబానీ

న్యూఢిల్లీ, అక్టోబరు 1: హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ చైర్‌పర్సన్ రోష్ని నాడార్ మల్హోత్రా దేశంలోనే అత్యంత సంపన్న మహిళగా నిలిచారు. ఈమేరకు బుధవారం ప్రకటించిన ఎంఓఎం హురున్ ఇండియా రిచ్-2025 జాబితాలో వెల్లడించారు. 2.84 లక్షల కోట్ల సంపదతో దేశంలో అత్యంత సంపన్నుల జాబితాలో రోష్ని, ఆమె కుటుంబం మూడో స్థానంలో నిలిచారు. ఈ జాబితాలో ఓ మహిళ మూడో స్థానంలో నిలవడం ఇదే తొలిసారి. అంతేగాక తొలి పది మందిలో నిలిచిన పిన్న వయస్కురాలి(44)గానూ ఆమె రికార్డు సృష్టించారు. కెలాగ్ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో గ్రాడ్యుయేషన్ చేసిన రోష్ని హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ సంస్థను ప్రపంచ వ్యాప్తంగా విస్తరించడమే కాకుండా బలమైన ఐటీ సేవల సంస్థగానూ తీర్చిదిద్దారు. రోష్ని కేవలం తమ సంస్థ కార్యకలాపాలు చూడడమే కాకుండా శివ్ నాడార్ ఫౌండేషన్ ద్వారా దాతృత్వ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రధానంగా విద్య, సామాజిక సేవకు భారీగా నిధులు వెచ్చిస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా వ్యాపార రంగంలో కీలక పాత్ర వహిస్తోన్న మహిళల జాబితాలో వరుసగా నిలవడం ద్వారానూ రోష్ని ప్రత్యేకత చాటారని హురున్ జాబితాలో పేర్కొన్నారు. 'టెక్నోక్రాటిక్ లీడర్‌షిప్' మాత్రమే కాకుండా సామాజిక సేవలో ముందుండడం ద్వారా ఆమె భారతీయ పారిశ్రామికవేత్తల్లో తన ప్రత్యేకతను చాటుకున్నారని పేర్కొన్నారు. కాగా ఈ జాబితాలో 100 మంది మహిళలు ఉండడం విశేషం. నైకా సంస్థకు చెందిన ఫల్గుణి నాయర్, బయోకాన్ కిరణ్ మజుందార్ షా కూడా ఇందులో నిలిచారు. భారత్‌లో సంపదను సృష్టించడంలో మహిళలది కూడా కీలక పాత్రేనని చాటారు. కాగా తన సంపద విలువ 6 శాతం తగ్గినా రూ.9.55 లక్షల కోట్లతో ముకేశ్ అంబానీ భారత సంపన్నుల జాబితాలో తొలి స్థానంలో నిలిచారు. రూ.8.15 లక్షల కోట్లతో గౌతమ్ అదానీ, ఆయన కుటుంబం రెండో స్థానంలో ఉంది. సీరం ఇన్‌స్టిట్యూట్ సైరస్ పూనావాలా, ఆదిత్య బిర్లా గ్రూప్ అధిపతి కుమార మంగళం బిర్లా, నీరజ్ బజాజ్ ఆయన కుటుంబం, దిలీప్ సంఘ్వీ, అజీం ప్రేమ్‌జీ ఆయన కుటుంబం, గోపీచంద్ హిందూజా, రాధాకిషన్ దమానీ కుటుంబం హురున్ తొలి పదిమంది భారత సంపన్నుల జాబితాలో ఉన్నారు. దేశంలో సంపన్నుల మొత్తం సంపద విలువ రూ.167 లక్షల కోట్లుగా హురున్ పేర్కొంది. ఇది దేశ జీడీపీలో దాదాపు సగానికి సమానం. కాగా దేశంలో రూ.1000 కోట్లు లేదా అంతకు పైగా సంపద ఉన్నవారు 1,687 మంది. గత రెండేళ్లుగా దేశం ప్రతి వారానికి ఒక బిలియనీర్‌ని సృష్టిస్తోంది. చెన్నైకి చెందిన పెర్‌ప్లెక్సిటీ స్థాపకుడు అరవింద్ శ్రీనివాస్(31) రూ.21,190 కోట్ల సంపదతో ఈ జాబితాలో చోటు సంపాదించిన యువకుడిగా నిలిచారు.

చొరబాటుదారులతో జాగ్రత్త



ఆర్‌ఎస్ఎస్ శతాబ్ది వేడుకల సందర్భంగా స్టాంపును విడుదల చేస్తున్న ప్రధాని మోదీ

(మొదటిపేజీ తరువాయి)

ఆర్ఎస్ఎస్ నిషేధానికి గురికావడం, కేసులను ఎదుర్కోవడాన్ని పరోక్షంగా ప్రస్తావిస్తూ.. "ఆర్ఎస్ఎస్ చీఫ్ మాధవ్ గోల్వాల్కర్‌పై తప్పుడు కేసు పెట్టి జైలుకు పంపారు. జైలు నుంచి బయటకు వచ్చిన ఆయన ప్రశాంత చిత్తంతో ఒక మాట అన్నారు. 'కొన్నిసార్లు మన నాలుక పంటి కింద పడి బాధిస్తుంది. అందుకని పళ్లను మనం పీకేసుకోం' అని సెలవిచ్చారు" అని తెలిపారు.

నిజాం పాలనలోనూ ఆర్ఎస్ఎస్ ఇబ్బందులు

స్వాతంత్ర్యం తర్వాత అప్పటి హైదరాబాద్ రాష్ట్రంలో నిజాం పాలనలోనూ ఆర్ఎస్ఎస్ ఇబ్బందులు ఎదుర్కొందని మోదీ పేర్కొన్నారు. అలాగే, ఎమర్జెన్సీ రోజులను మోదీ గుర్తుచేసుకుంటూ.. ప్రజాస్వామ్యం, రాజ్యాంగ వ్యవస్థల పట్ల తిరుగులేని విశ్వాసమే ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా ఆర్ఎస్ఎస్‌ను పోరాడేలా చేసిందని తెలిపారు. కాగా, సంఘ్ శతాబ్ది వేడుకల సందర్భంగా రూ.వంద నాణెం, స్టాంప్‌ను ప్రధాని ఆవిష్కరించారు. నాణెం ఒకవైపు జాతీయ చిహ్నం, రెండో వైపు భరతమాత చిత్రం ఉన్నాయి. నాణెంపై భరతమాత చిత్రం ముద్రించడం ఇదే తొలి సారని మోదీ పేర్కొన్నారు.

'పంద్రాగస్టు' ప్రసంగాన్ని గుర్తు తెస్తూ

ప్రధాని వ్యాఖ్యలు 'ఆగస్టు 15' ప్రసంగాన్ని గుర్తుకు తెచ్చాయి. ఈ సందర్భంగా 'డెమోగ్రాఫికల్ మిషన్'ను ప్రకటించారు. ఇప్పుడు ఆర్ఎస్ఎస్ వేదికపైనా అదే చెప్పారు. బెంగాల్ అసెంబ్లీకి వచ్చే ఏడాది ఎన్నికలు జరగనున్నాయి. తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి, సీఎం మమతాబెనర్జీ ఓటు రాజకీయాలు చేస్తున్నారని అప్పట్లో మోదీ దుయ్యబట్టారు. ఇందులోభాగంగానే ముస్లిం ప్రాబల్యం కలిగిన బంగ్లాదేశ్‌కు చెందిన చొరబాటుదారులను బలపరుస్తున్నారని ఆయన మండిపడ్డారు.

ఆర్ఎస్ఎస్ సభకు హాజరుకావడం లేదు: సీజేఐ తల్లి కమల్‌తాయ్ గవాయ్

- వివాదం, విమర్శల నేపథ్యంలో హాజరుకారాదని నిర్ణయం
- సభకు హాజరైతే అంబేడ్కర్ వాదాన్ని వినిపించే అవకాశం లభించేదన్న గవాయ్

నాగ్‌పూర్, అమరావతి, అక్టోబరు1: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ విజయదశమి సందర్భంగా నిర్వహించే సభకు తాను హాజరుకావడం లేదని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్ మాతృమూర్తి డాక్టర్ కమల్‌తాయ్ గవాయ్ స్పష్టం చేశారు. మహారాష్ట్ర అమరావతిలో అక్టోబరు 5న జరిగే కార్యక్రమానికి హాజరౌతున్నట్లు వార్తలు వెలువడగానే విమర్శలు చెలరేగి వివాదంగా మారడంతో హాజరు కారాదని తాను నిర్ణయించుకున్నట్లు చెప్పారు. తమ కుటుంబం అంబేడ్కర్ సిద్ధాంతాన్ని అనుసరిస్తుందని, అంబేడ్కర్ వాదాన్ని వినిపించేందుకు తన భర్త దాదా సాహెబ్ కావాలనే వేరే సంస్థలు నిర్వహించే సభలకు హాజరయ్యేవారని గుర్తు చేశారు. ఈ నెల 5న జరిగే కార్యక్రమానికి హాజరైతే అదే వేదికపైనుంచి అంబేడ్కర్ వాదాన్ని వినిపించేందుకు అవకాశం లభించి ఉండేదన్నారు. ప్రస్తుతం అనారోగ్య కారణాలతో తాను చికిత్స తీసుకుంటున్నట్లు గవాయ్ చెప్పారు. అంతకు ముందు ఈ నెల 28న కమల్‌తాయ్ చేతిరాత అంటూ ఓ లేఖ సోషల్ మీడియాలో వైరల్ అయింది. తాను ఆర్ఎస్ఎస్ సభకు హాజరవుతున్నట్లుగా తప్పుడు ప్రచారం జరుగుతోందని, ఇదంతా ఆర్ఎస్ఎస్ చేస్తున్న కుట్ర అని రాసినట్లుగా ఆ లేఖలో ఉంది. అయితే ఇది నకిలీ లేఖ అని, అది తన తల్లి రాసినది కాదని ఆమె చిన్న కుమారుడు రాజేంద్ర గవాయ్ స్పష్టం చేశారు. దాదాసాహెబ్ గవాయ్ చారిటబుల్ ట్రస్ట్‌కు వ్యవస్థాపక చైర్‌పర్సన్‌గా ఉంటూ సేవా కార్యక్రమాలు చేస్తుండటంతో తన తల్లికి ఆర్ఎస్ఎస్ నేతల నుంచి ఆహ్వానం అందిందని, ముఖ్య అతిథిగా వెళ్లేందుకు ఆమె అంగీకరించారని ఆయన వెల్లడించారు.

నాకు నోబెల్ ఇవ్వకపోతే.. దేశానికే అవమానం!

- నాకివ్వమని అడగట్లేదు
- అమెరికాకు ఇవ్వమంటున్నా
- ఏడు యుద్ధాలను ఆపాం.. ట్రంప్ వ్యాఖ్య

వాషింగ్టన్, అక్టోబరు 1: నోబెల్ శాంతి బహుమతి కోసం కలవరిస్తున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. తాజాగా సంచలన వ్యాఖ్యలు చేశారు. "నాకు నోబెల్ ఇవ్వకపోతే.. అది అమెరికాకే అవమానం." అని అన్నారు. అంతేకాదు.. ప్రపంచ దేశాల్లో తలెత్తిన ఏడు యుద్ధాలను తాను ఆపిన తర్వాత కూడా.. నోబెల్ ఇవ్వకపోతే.. అగ్రరాజ్యాన్ని అవమానించినట్టేనని చెప్పారు. తాజాగా గాజా యుద్ధానికి కూడా ముగింపు పలికేలా తాను తీసుకుంటున్న చర్యలను ఆయన ఉటంకించారు. మంగళవారం క్వాంటికోలో సైనిక అధికారులతో ఆయన మాట్లాడుతూ ఈ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఎవరో ఒక పుస్తకం రాసిన వ్యక్తికి ఇస్తారని, కానీ, ఈసారి అలా జరగదని భావిస్తున్నట్టు తెలిపారు. ఒకవేళ తనను కాదని ఏ రచయితకైనా ఇస్తే అది అమెరికాకు తీరని అవమానమేనని తేల్చి చెప్పారు. అంతేకాదు.. "నోబెల్‌ను నాకు ఇవ్వమని అడుగుతున్నట్టు భావిస్తున్నారు. నిజానికి నాకు ఇవ్వాలని కాదు. ఈ దేశానికి ఇవ్వాలని కోరుతున్నా. ఎందుకంటే.. గతంలో ఎప్పుడు జరగని పనులు ఇప్పుడు జరిగాయి. దీనిపై ఆలోచన చేయాలని చెబుతున్నా. ఇప్పుడు గాజా విషయాన్నే తీసుకుంటే.. ఇదేమంత తేలికకాదు. చాలా సంక్లిష్టం. అయినా.. సాధిస్తున్నాం. మధ్యవర్తిత్వం, ఒప్పందాల వంటి విషయాలు నాకన్నా ఎవరికీ ఎక్కువగా తెలియవు. నా జీవితమంతా వాటిపైనే ఆధారపడింది. ఇప్పటికే ఏడు సాధించాం. ఇప్పుడు ఎనిమిదోది కూడా సాధించబోతున్నాం. ఇదేమంత తేలికకాదని చెబుతున్నా. అందుకే నోబెల్ మనకే ఇవ్వాలని కోరుతున్నా." అని ట్రంప్ వ్యాఖ్యానించారు.

ఫర్నిచర్‌పై ట్రంప్ సుంకాలతో భారత్‌కు మేలే!

- ఎగుమతులపై ప్రస్తుతం 50% సుంకం
- తాజా నిర్ణయంతో 10-25శాతానికి..

న్యూఢిల్లీ, అక్టోబరు 1: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధిస్తున్న సుంకాల పరంపరలో ఫర్నిచర్ కూడా చేరినా.. ఇది మాత్రం భారత్‌కు లాభమే చేకూర్చనుంది. ఫర్నిచర్‌పై 10 శాతం, కిచెన్ క్యాబినెట్‌లు, అప్‌హోల్‌స్టర్డ్‌పై 25 శాతం చొప్పున సుంకాలు విధిస్తున్నట్లు పేర్కొంటూ సెక్షన్ 232ను ట్రంప్ తాజాగా జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ నెల 14 నుంచి ఈ సుంకాలు అమల్లోకి రానున్నాయి. అయితే ఈ నిర్ణయం భారత ఎగుమతులకు మేలు చేస్తుందని గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనిషియేటివ్ (జీటీఆర్ఐ) పేర్కొంది. ప్రస్తుతం భారత ఫర్నీచర్‌పై 50 శాతం సుంకం అమల్లో ఉందని, ఇది 10-25 శాతానికి తగ్గుతుండడం గొప్ప ఊరట అని జీటీఆర్ఐకి చెందిన అజయ్ శ్రీవాస్తవ అన్నారు. ఫర్నిచర్, కిచెన్ క్యాబినెట్‌లపై సుంకాలు తగ్గుతున్న కారణంగా అమెరికన్ కొనుగోలుదారులకు భారత దిగుమతులే ప్రత్యామ్నాయంగా మారే అవకాశం ఉంటుందని అభిప్రాయపడ్డారు. 2025 ఆర్థిక సంవత్సరంలో భారత్ నుంచి 654.8 మిలియన్ డాలర్ల విలువైన ఫర్నిచర్ ఎగుమతులు జరగనున్నాయి.

ఖతార్‌కు నెతన్యాహు క్షమాపణ

- ఫోన్ పట్టుకుని మాట్లాడించిన ట్రంప్?
- చర్చనీయాంశంగా బ్లాక్‌అండ్‌వైట్ ఫొటో
- దోహాపై దాడులకు ఇజ్రాయెల్ విచారం
- మళ్లీ దాడులు చేయబోమని హామీ
- అమెరికా స్క్రిప్ట్‌ను చదివిన నెతన్యాహు



న్యూఢిల్లీ, అక్టోబరు 1: ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుతో ఖతార్‌కు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ బలవంతంగా క్షమాపణ చెప్పించారా? ట్రంప్ స్క్రిప్ట్‌ను యథాతథంగా ఫోన్‌లో చదివి ఖతార్ ప్రధానికి వినిపించారా? అనే ప్రశ్నలు ప్రపంచవ్యాప్తంగా చక్కర్లు కొడుతున్నాయి. వైట్ హౌస్ విడుదల చేసిన ఫొటో ఒకటి ఆ ప్రశ్నలకు కారణమైంది. ఆ బ్లాక్ అండ్ వైట్ ఫొటోలో ట్రంప్ ల్యాండ్ లైన్ ఫోన్‌ను తన ఒళ్లో పెట్టుకుని ఉండగా, ఓ పేపర్‌లో రాసి ఉన్న స్క్రిప్టును నెతన్యాహు చదువుతూ ఆ ఫోన్‌లో అవతలివారికి వినిపిస్తున్నట్లు తెలుస్తోంది. వైట్ హౌస్ ఓవల్ ఆఫీస్‌లో సోమవారం ఆ ఫొటో తీసి బయటకు విడుదల చేశారు. ఖతార్ ప్రధానమంత్రి షేక్ మహమ్మద్ బిన్ అబ్దుల్‌రహ్మాన్ అల్-తానీతో నెతన్యాహు మాట్లాడుతున్నపుడు ఉద్దేశపూర్వకంగానే ఆ ఫొటోను తీసినట్లు చెబుతున్నారు. నెతన్యాహుతో భేటీ సందర్భంగా ఆ ఫోన్ కాల్‌ను ట్రంప్ చేయించారని, దోహాలో హమాస్ నేతలపై దాడి చేసినందుకు క్షమాపణ చెప్పించారని అధికార వర్గాలు చెప్పాయి. దోహాపై ఇజ్రాయెల్ దాడిలో ఐదుగురు చనిపోయిన విషయం తెలిసిందే. వారిలో సీనియర్ హమాస్ నేత ఖలీల్ అల్ హయ్యా కుమారుడు కూడా ఉన్నాడు. ముందస్తు సమాచారం లేకుండా ఇజ్రాయెల్ దాడి చేయడంపై అప్పట్లో ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బాంబులతో దాడి చేయడం పిరికి చర్య అని, అంతర్జాతీయ చట్టాలను గుడ్డిగా ఉల్లంఘించిందని ఇజ్రాయెల్‌పై ఖతార్ కూడా విమర్శలు చేసింది. దాడులు చేయడం తప్ప ప్రత్యామ్నాయం లేదంటూ అప్పట్లో నెతన్యాహు కూడా తమ చర్యలను సమర్థించుకున్నారు. కాగా, గాజాపై కాల్పుల విరమణ చర్చల్లో ఈజిప్టుతో పాటు ఖతార్ కూడా కీలక మధ్యవర్తిగా వ్యవహరిస్తోంది. ఈ నేపథ్యంలో వాషింగ్టన్‌కు చర్చలకు వచ్చిన నెతన్యాహుతో ఉద్రిక్తతలు తగ్గించే ఉద్దేశంతో ఖతార్‌కు ట్రంప్ ఫోన్ కాల్ చేయించారు. ఈ సందర్భంగా పరిపరి విధాలుగా నెతన్యాహు విచారం వ్యక్తం చేశారని, ఖతార్ సార్వభౌమాధికారాన్ని గౌరవిస్తామని, అలాంటి దాడులు మళ్లీ చేయబోమని హామీ ఇచ్చారని తెలుస్తోంది. అయితే ఈ మాటలు ఆయన సొంతంగా చెప్పినవా? లేక వైట్‌హౌస్ వర్గాలు బలవంతంగా చెప్పించాయా? అనేది చర్చనీయాంశమైంది.

ఖతార్‌పై దాడి జరిగితే అమెరికాపై చేసినట్టే

- ఉత్తర్వులు జారీ చేసిన ట్రంప్

వాషింగ్టన్, అక్టోబరు 1: ఖతార్ రక్షణకు పూర్తి బాధ్యతలు తీసుకుంటున్నట్టు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. ఖతార్‌పై ఎవరైనా దాడి చేస్తే దాన్ని అమెరికాపై జరిగినట్టుగా భావిస్తామని తెలిపారు. ఈ విషయాన్ని స్పష్టం చేస్తూ సోమవారం ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ జారీ చేశారు. హమాస్ నాయకులు ఉన్నారన్న కారణంతో ఖతర్ రాజధాని దోహాపై ఇటీవల ఇజ్రాయెల్ క్షిపణి దాడులు చేసిన నేపథ్యంలో ట్రంప్ ఈ ఆదేశాలు ఇచ్చారు. దాడులు చేయించినందుకు ఇజ్రాయెల్ అధ్యక్షుడు నెతన్యాహూతో క్షమాపణలు చెప్పించారు కూడా. ఖతర్‌పై దాడికి దిగిన దేశంపై దౌత్య, ఆర్థికపర చర్యలతోపాటు అవసరమైతే మిలటరీ చర్యలకు దిగుతామని హెచ్చరించారు.

ట్రంప్ ప్లాన్‌కు తల ఊపం

- సవరణలు ఉండాలి
- హమాస్‌లో అంతర్గతంగా చర్చలు

దోహా, అక్టోబరు 1: గాజాలో శాంతి నెలకొల్పేందుకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించిన 20 సూత్రాల ప్రణాళికను హమాస్ యథాతథంగా ఆమోదించే పరిస్థితి కనిపించడం లేదు. ప్రత్యేక పాలస్తీనా దేశం ఏర్పాటుపై స్పష్టమైన హామీ లేకపోవడం, ఇతరత్రా అభ్యంతరాలు ఉండడంతో ప్రణాళికలో సవరణలు అవసరం ఉంటుందని భావిస్తోంది. మూడు నాలుగు రోజుల్లో తన ప్రణాళికను ఆమోదించాలని, ఒకవేళ తిరస్కరిస్తే 'విషాదకర ముగింపు' ఉంటుందని మంగళవారం ట్రంప్ తుది హెచ్చరిక జారీ చేశారు. ఈ నేపథ్యంలో అదే రోజు హమాస్ నేతలు ఖతార్, తుర్కియే, ఈజిప్టు అధికారులతో సమాలోచనలు జరిపారు. 'ఆయుధాలను విడిచిపెట్టడంతో పాటు హమాస్, ఇతర చీలిక వర్గాలను పూర్తిగా బహిష్కరించాలి' అన్న ప్రతిపాదనపై అభ్యంతరం చెప్పారు. గాజా స్ట్రిప్ నుంచి ఇజ్రాయెల్ పూర్తిగా తొలగిపోయేలా అంతర్జాతీయ హామీలు ఉండాలని కోరారు. ఈ ప్రతిపాదనలపై మరింతగా చర్చలు జరపాల్సిన అవసరం ఉందని మధ్యవర్తిగా వ్యవహరిస్తున్న ఖతార్ అభిప్రాయపడింది. ఇజ్రాయెల్ బుధవారం కూడా గాజాపై దాడులు చేసింది. దాడుల్లో 16 మంది ప్రాణాలు కోల్పోయినట్టు తెలిసింది.

పాక్ ప్రధానికి సెగ!

షెహబాజ్‌కు వ్యతిరేకంగా ఆక్రమిత కశ్మీర్‌లో నిరసనలు

- బలగాల కాల్పుల్లో పది మంది ఆందోళనకారుల దుర్మరణం

న్యూఢిల్లీ, అక్టోబరు 1: పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌లోని ప్రజలు ప్రధాని షెహబాజ్ షరీఫ్‌పై నిప్పులు చెరుగుతూ రోడ్డెక్కారు. తమ ప్రాథమిక హక్కులను కాలరాస్తున్నారంటూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలతో హోరెత్తించారు. గత మూడు రోజులుగా ఈ నిరసనలు ఉవ్వెత్తున సాగుతున్నాయి. ఈ క్రమంలో ఆందోళనకారులపై భద్రతా బలగాలు మంగళ, బుధవారాల్లో జరిపిన కాల్పుల్లో 10 మంది పౌరులు ప్రాణాలు కోల్పోయారు. పౌరుల ప్రాథమిక హక్కులను అణచివేస్తున్నారన్న కారణంగా పాక్ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ సంయుక్త అవామీ కార్యాచరణ కమిటీ(జేఏఏసీ) నిరసన చేపట్టింది. తాము ప్రతిపాదించిన 38 డిమాండ్లను అంగీకరించాలని కోరుతూ.. 3 రోజుల బంద్‌కు పిలుపునిచ్చింది. దీంతో మార్కెట్లు, దుకాణాలు, స్థానిక వ్యాపారాలు మూతబడ్డాయి. అదేసమయంలో నిరసనకారులు రోడ్లపైకి వచ్చి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ర్యాలీలు చేపట్టారు. అయితే, వీరిని అడ్డుకునేందుకు భద్రతా దళాలు కూడా అదేస్థాయిలో ప్రయత్నించాయి. ఈ క్రమంలో పాక్ రేంజర్లు కాల్పులకు దిగారు. ఈ ఘటనలో బుధవారం 8 మంది ప్రాణాలు కోల్పోయారు. "70 ఏళ్లుగా అమలుకు నోచుకోని ప్రాథమిక హక్కుల కోసమే మేం నిరసన చేపట్టాం. మా హక్కులను మాకు కల్పించాలి. లేకపోతే ఊరుకునేది లేదు.." అని జేఏఏసీ నేత షౌకత్ నవాజ్ మిర్ తేల్చి చెప్పారు. ప్రస్తుతం తమ నిరసనకు సంబంధించి ప్లాన్-ఏ అమలు చేస్తున్నామని.. ప్రధాని షెహబాజ్ షరీఫ్ దిగిరాకపోతే ప్లాన్-డీ అమలు చేస్తామని, అది చాలా తీవ్రంగా ఉంటుందని హెచ్చరించారు.

బలోచిస్థాన్‌లో పాక్ డ్రోన్ దాడులు

బలోచ్ లిబరేషన్ ఆర్మీ, బలోచ్ లిబరేషన్ ఫ్రంట్ సంస్థలే లక్ష్యమంటూ పాకిస్థాన్ సొంత ప్రజలపైనే సైనిక చర్యలు ముమ్మరం చేసింది. ఖుజ్‌దార్ జిల్లాలోని జెహ్రీ ప్రాంతాన్ని ఈ సంస్థల ఆధీనం నుంచి తప్పించేందుకు భారీగా డ్రోన్లతో దాడులు చేస్తోంది. ఈ దాడులతో కొచావ్ ప్రాంతంలోని పంట పొలాలు ముఖ్యంగా పత్తి పొలాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. దీంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. వరుసగా 4 రోజులుగా ఈ దాడులు జరుగుతుండటంతో ఈ ప్రాంతంలోని ప్రజలకు ఆహారం, నీరు, ఇంధనం అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జెహ్రీ ప్రాంతమంతా లాక్‌డౌన్‌లోకి వెళ్లిపోయిందని బలోచిస్థాన్ పోస్ట్ తెలిపింది.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

అష్టపదుల ఐరాస

'మానవాళి చరిత్రలో మున్నెన్నడు లేని రీతిలో మనం ఒక ఉమ్మడి భవితవ్యం ముంగిట ఉన్నాం. మనం కలిసికట్టుగా ఉంటేనే దాన్ని శ్రేయోదాయకంగా చేసుకోగలుగుతాం. ఇందుకు తోడ్పడేందుకే మనకు ఐక్యరాజ్యసమితి ఉన్నది' అని కోఫీ అన్నన్ పాతిక సంవత్సరాల క్రితం ఉద్ఘాటించారు. ఐరాస 80వ వార్షికోత్సవాన్ని జరుపుకోనున్న తరుణంలో ఆ ప్రపంచ సంస్థ ఏడవ ప్రధాన కార్యదర్శి మాటలు విశేష ప్రాసంగికత సంతరించుకున్నాయి. అతి భీకరమైన, అత్యంత వినాశనకరమైన ద్వితీయ ప్రపంచ యుద్ధం (1939–45)తో కుదేలయిపోయిన దేశాలు శాంతి, శ్రేయస్సులకై అలమటిస్తున్న సమయంలో అమెరికా నేతృత్వంలో విజ్ఞులు, విద్వత్‌పరులు, రాజనీతిజ్ఞుల దార్శనికతతో ఐక్యరాజ్యసమితి ఉనికిలోకి వచ్చింది. ఎనిమిది దశాబ్దాల ప్రస్థానంలో ప్రపంచ శాంతికి ఇతోధికంగా తోడ్పడడంతో పాటు, యుద్ధ బీభత్సాలు, ప్రాకృతిక విపత్తుల బాధితులకు మానవతాపూర్వక సహాయచర్యలు చేపట్టడంలోను మానవ ఆరోగ్యాన్ని హరించివేస్తున్న అంటువ్యాధులు, ప్రాణాంతక రోగాల నిరోధానికి, పర్యావరణ సమతుల్యత, మానవహక్కుల పరిరక్షణకు, సాంకేతికతల ఆదాన ప్రదానాలకు ఐరాస సార్థకమైన కృషి చేసింది. ప్రత్యేక లక్ష్యాలతో ఏర్పాటైన దాని అనుబంధ సంస్థలు ప్రపంచ వ్యాప్తంగా వందలాది కోట్ల ప్రజలకు ప్రాణరక్షకాలుగా ఉన్నాయి. మానవాళి భవిష్యత్తుకు ఒక ఆశాజ్యోతిగాప్రభవించిన ఈ సంస్థ ఇప్పుడు కాలం పదఘట్టనల కింద నలిగిపోతోంది.

21 వ శతాబ్ది ప్రపంచ పరిస్థితులకు ఐరాస వ్యవస్థ ముఖ్యంగా భద్రతా మండలి అనుగుణంగా లేకపోవడం, గాజా, ఉక్రెయిన్ యుద్ధాలు, సంస్థ వ్యవస్థాపక లక్ష్యాలను అగ్రరాజ్యాలు పూర్తిగా ఉపేక్షించడం మొదలైన ధోరణులతో అంతర్జాతీయ వ్యవహారాలలో ఐరాస ప్రభావశీలత, విశ్వసనీయత కోల్పోతోంది. ఐక్యరాజ్యసమితి ఆవిర్భావంలో కీలక పాత్ర వహించి, దశాబ్దాల పాటు దాని ప్రభావశీలతకు ప్రధాన ఆలంబనగా ఉన్న అమెరికాయే ఇప్పుడు ఈ ప్రపంచ సంస్థ మనుగడ ఇక్కట్లకు కారణమవుతోంది. ఇరవవయో శతాబ్దిలో వివిధ దేశాలలో తలయెత్తిన ఉద్యమాలు సమస్త మానవాళి సంక్షేమాన్ని కాంక్షించాయి. ప్రస్తుతం అమెరికా అధ్యక్షుడుగా ఉన్న డోనాల్డ్ ట్రంప్ వైఖరి అందుకు విరుద్ధంగా ఉన్నది. ప్రపంచ శ్రేయస్సుకు దోహదం చేసే దృక్పథాన్ని అమెరికా ఎందుకు అనుసరించాలని ఆయన ప్రశ్నిస్తున్నారు. 2017లో తొలిసారి, 2025లో మలిసారి ఆయన అధికారంలోకి వచ్చిన వెంటనే ఐరాసకు అమెరికా అందించే ఆర్థిక సహాయాన్ని గణనీయంగా తగ్గించివేశారు. కీలక మైన ఐరాస ఏజెన్సీల నుంచి అమెరికాను ఉపసంహరించారు. ఒక్కమాటలో చెప్పాలంటే అమెరికా విధానాలు ఐరాస మనుగడనే దెబ్బ తీస్తున్నాయి.

ఈ విపత్కర పరిస్థితిని నివారించేందుకు ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెర్రెస్ ఈ ఏడాది మార్చిలో 'యుఎన్ 80 ఇనీషియేటివ్'ను ప్రారంభించారు. ఐరాసను ఆధునికీకరించి దాని ప్రభావశీలత, కార్యాచరణ సామర్థ్యాన్ని ఇతోధికంగా పెంపొందించేందుకు ఉద్దేశించిన సమగ్ర సంస్కరణ ప్రయత్నమది. ఈ సంస్కరణ సంకల్పాలలో ప్రధానమైనది భద్రతా మండలి విస్తరణ. అభివృద్ధి చెందుతున్న దేశాల ఆకాంక్షలకు అనుగుణంగా మండలి విస్తరణ జరగని పక్షంలో ఐరాస తన ఉపయుక్తతను కోల్పోయే ప్రమాదమున్నది. ఇటువంటి సంభావ్యతను సైతం అమెరికా లక్ష్య పెట్టడం లేదు. భారత్ ఈ పరిస్థితుల్లో మండలిలో శాశ్వత సభ్యత్వాన్ని కోరుకోవడం మాత్రమే కాకుండా ఐరాసలో తన ప్రభావ ప్రాబల్యాలను పెంపొందించుకోవడం యుక్తంగా ఉంటుంది. సంపద్వంతమవుతున్న భారత్ తన ఆర్థిక వనరులను ఉదారంగా ఐరాసకు వినియోగించి ఆ ప్రపంచ సంస్థను నిలబెట్టడం ద్వారా భారతీయ నాగరికతా ఆదర్శం వసుధైవ కుటుంబకంను అనుష్ఠానించడం ద్వారా మానవాళి శ్రేయస్సుకు తోడ్పడాలి.

ఐరాసను ఉనికిలోకి తీసుకురావడంలో నాటి అమెరికా అధ్యక్షుడు హ్యారీ ట్రుమన్ బ్రిటిష్ కవి టెన్నిసన్ అభిలషించిన 'పార్లమెంట్ ఆఫ్ మ్యాన్' ఆదర్శం నుంచి స్ఫూర్తి పొందారని ప్రతీతి. ప్రస్తుత ఐరాస ఆ ఆదర్శానికి ప్రతిరూపంగా లేదు. తదుపరి ప్రధాన కార్యదర్శి నియామకంలో ఒక మహిళను, మరీ ముఖ్యంగా ఆఫ్రికన్ విదుషీమణి లేదా రాజనీతిజ్ఞురాలును ఎంపిక చేయడం 'మానవుని పార్లమెంటు' దిశగా మొదటి అడుగు కాగలదు.

సద్భావన నిర్మాణశక్తి


అది 1961వ సంవత్సరం. కబడ్డీ బాగా ఆడేవారు సంఘ్ శాఖలో ఉన్నారని, శరీర దారుఢ్యం కోసం వారు నిత్యం ఆటలు ఆడుతుంటారని తెలిసి అక్కడకు వెళ్లాను. ఆ సమయంలో నాకు స్ఫూర్తిప్రదాత అయిన భోగాది దుర్గాప్రసాద్ అక్కడే ఉన్నారు. నన్ను కూడా ఆడమని ప్రోత్సహించారు. అయితే అది బయటవారికి కాదేమో అనుకున్న నాకు, 'ఇక్కడ అలాంటి భేదభావాలేం ఉండవు, ఎవరైనా ఆడొచ్చు' అని తెలిపారు. ఆ స్ఫూర్తి నన్ను ఆకట్టుకుంది. తర్వాత సంఘ్ సభ్యునిగా మారి, మార్గదర్శనం పొందాను. ఈ అడుగు నన్ను విశాలమైన ఆలోచనల దిశగా ముందుకు నడిపింది. ఒక్క మాటలో చెప్పాలంటే జీవితంలో నా ఉన్నతికి సంఘం ఇచ్చిన సంస్కారం, సంఘం నేర్పిన జాతీయ భావం, సామాజిక ఐకమత్యం, వ్యక్తిగత సౌశీల్యం పెంచుకోవడమే కారణమని సగర్వంగా చెప్పగలను. నేనే కాదు ప్రధాని నరేంద్ర భాయ్ మోదీ మొదలుకుని ఎందరో కేంద్రమంత్రుల ఎదుగుదలకు సంఘ్ ఇచ్చిన సౌశీల్యం, ప్రేరణే ప్రధాన కారణం.



శ్రేయో హి జ్ఞానమభ్యాసాత్ జ్ఞానాద్ధ్యానం విశిష్యతే
ధ్యానాత్ కర్మఫలత్యాగః త్యాగాచ్ఛాంతిరనంతరమ్

భగవద్గీతలో 12వ అధ్యాయంలోని ఈ శ్లోకంలో త్యాగం గొప్పతనాన్ని గురించి పరమాత్ముడు వివరించారు. 'అవివేకంతో కూడిన అభ్యాసం కంటే జ్ఞానం మేలు. జ్ఞానం కంటే ధ్యానం ఉత్తమం. ధ్యానం కంటే కర్మఫల త్యాగం మంచిది. ఆ త్యాగం వల్ల మనశ్శాంతి కలుగుతుంది.' అని ఈ శ్లోకం భావం.

ప్రపంచవ్యాప్తంగా వివిధ ఆశయాలతో కూడిన అనేక సంస్థలు ఉన్నాయి. అయితే వందేళ్ల ప్రయాణం పూర్తి చేసుకున్న రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆరెస్సెస్) త్యాగాలకు సాటిరాగల మరో సంస్థ మనకు కనిపించదు. వేల సంవత్సరాల భారతీయ సామాజిక విలువలే ఆలంబనగా, సామాజిక జీవనంలో ఏర్పడిన లోటుపాట్లను అధిగమిస్తూ, జీవన విధానంలో దృఢత్వం, సమాజం కోసం అంకితమైన వ్యక్తిత్వంతో ఓ విలక్షణమైన కార్యదీక్ష కలిగిన క్రమశిక్షణాయుత సమూహం ఆరెస్సెస్ సొంతం. అందుకే, కాలగమనంలో అవరోధాలను, అణచివేతలను అధిగమిస్తూ... ప్రతికూల పరిస్థితుల్లో సైతం తన ప్రాబల్యాన్ని విస్తరిస్తూ, భారతీయ సంస్కృతిలోని సనాతన మూలాల నుంచి జాతీయవాద భావనతో ఆవిర్భవించి, మానవతా వాదాన్ని ఆవిష్కరిస్తోంది.



భారతీయ మూలాల్లో బలంగా విస్తరించిన సంస్కృతి విలువలను తెలియజేస్తూనే జాతీయ సమైక్యత, నైతిక విలువలు, సామాజిక సామరస్యం వంటి అంశాల పట్ల ప్రజల్లో అవగాహన కల్పిస్తూ ఆరెస్సెస్ ఓ శతాబ్దాన్ని పూర్తి చేసుకుంది. ఆరెస్సెస్ కృషి కారణంగా దేశభక్తి ఒక ప్రాథమిక విలువగా అభివృద్ధి చెందిందని చెప్పడానికి గర్విస్తున్నాను.

భారతీయ మూలాల్లో బలంగా విస్తరించిన సంస్కృతి విలువలను తెలియజేస్తూనే జాతీయ సమైక్యత, నైతిక విలువలు, సామాజిక సామరస్యం వంటి అంశాల పట్ల ప్రజల్లో అవగాహన కల్పిస్తూ ఆరెస్సెస్ ఓ శతాబ్దాన్ని పూర్తి చేసుకుంది. సంఘ్ కృషి కారణంగా దేశభక్తి ఒక ప్రాథమిక విలువగా అభివృద్ధి చెందిందని చెప్పడానికి గర్విస్తున్నాను. 'సహనావవతు' అనే సూత్రాన్ని అనుసరించి లక్షలాది మంది కలిసి పనిచేసే స్ఫూర్తి మనసుల్లో విస్తరింపజేసింది. దేశభక్తి అంటే జెండా ఎగరేయడం, దేశభక్తి గీతాలు పాడడం, ఐక్యత ప్రతిజ్ఞ చేయడం కాదని, ఈ స్ఫూర్తి మన ప్రవర్తనలో ప్రతిబింబించి, సమాజంలో పరివర్తనకు బీజాలు వేయాలన్నది ఆరెస్సెస్ లక్ష్యం.

స్వాతంత్ర్యం ముందు కాలం నుంచి ఆరెస్సెస్ వ్యవస్థాపకులు డా.హెడ్గేవార్, ఆ తర్వాతి సంఘచాలక్ గురు గోల్వాల్కర్ దేశ సమగ్రతను కాపాడేందుకు విశేషంగా కృషి చేశారు. ఆరెస్సెస్ శాఖల్లో వ్యక్తిగత నైతిక విలువలకు, క్రమశిక్షణకు అత్యున్నత ప్రాధాన్యం ఇచ్చారు. సాధారణ జీవనం గడుపుతూ, సమాజంలో అన్ని వర్గాల ప్రజలతో అరమరికలు లేకుండా కలిసి పనిచేసే అలవాట్లను ప్రేరేపించారు. ఈ స్ఫూర్తి కారణంగానే వందలాది సంఘ్ ప్రేరేపిత సంస్థలు భారతదేశమంతటా పనిచేస్తున్నా ఎక్కడా అవినీతి, బంధుప్రీతి ఆరోపణలు చెలరేగడం కనిపించదు. పైగా, వాటి పనితీరులో పారదర్శకత, జవాబుదారీతనం స్పష్టంగా కనిపిస్తుంది. కులం, వర్గం, మతం, ప్రాంతాలకు అతీతంగా ప్రజలు సమైక్యంగా ఉండాలని మాటలు చెప్పడం కాకుండా, ఆచరణలో ఆ విధంగా జీవించే వాతావరణం ఏర్పాటు చేయడంలో ఆరెస్సెస్‌ను మించిన మరో సంస్థ లేదని చెప్పవచ్చు.

యాభై ఏళ్ల క్రితం దేశంలో ప్రజాస్వామ్య హక్కులను హరిస్తూ విధించిన ఎమర్జెన్సీ భారత ప్రజాస్వామ్య చరిత్రలో ఓ చీకటి అధ్యాయం. లక్షమందికి పైగా ప్రతిపక్ష శ్రేణులు, స్వేచ్ఛ కోసం నినదించిన విద్యార్థులు, యువత, ఆరెస్సెస్ వంటి సంస్థల కార్యకర్తలతో జైళ్లను నింపేశారు. వారిలో విద్యార్థి నాయకుడినైన నేనూ ఉన్నాను. హద్దుల్లేని ప్రభుత్వ నిర్బంధాలు కొనసాగాయి. 'ప్రాథమిక హక్కులు అమల్లో లేనందున ప్రభుత్వం ఎవరినైనా కాల్చి చంపినా కోర్టులు ప్రశ్నించలేవ'ని అంటూ ఢిల్లీ ఉన్నత న్యాయస్థానంలో ప్రభుత్వ అటార్నీ జనరల్ వాదించారంటే ఎటువంటి నిరంకుశ వ్యవస్థ కొనసాగిందో అర్థం చేసుకోవచ్చు.

దేశంలో ఎమర్జెన్సీ ప్రకటించాక ఇందిరాగాంధీ నిషేధించిన తొలి ప్రజాసంస్థ ఆరెస్సెస్. 1975 జూన్ 30న నాటి ఆరెస్సెస్ సర్ సంఘచాలక్ బాలాసాహెబ్ దేవ్‌రస్‌ను పోలీసులు అరెస్టు చేశారు. అదే ఏడాది జూలై 4న ఆరెస్సెస్‌ను నిషేధించారు. దీంతో ఆరెస్సెస్ స్వయం సేవకుల ఇళ్లే ఎమర్జెన్సీ వ్యతిరేక ఉద్యమానికి కేంద్రాలుగా మారాయి. దేశంలోని ప్రధాన రాజకీయ పక్షాల నేతలు జైళ్లకు, ఇళ్లకు పరిమితమైనప్పుడు ఆరెస్సెస్ ప్రపంచంలోనే అతిపెద్ద నిరసన ఉద్యమం నిర్వహించింది. జైళ్లలో ఉన్నవారిలో అత్యధికులు ఆరెస్సెస్, సంబంధిత సంస్థలకు సంబంధించినవారే. నవంబర్, 1975లో జరిపిన సత్యాగ్రహ ఉద్యమంలో 45వేల మంది (ప్రభుత్వ లెక్కల ప్రకారం, ఇంకా ఎక్కువే ఉంటుంది) అరెస్ట్ అయితే, ఇతర సంస్థలకు చెందినవారు నాలుగోవంతు ఉన్నారు.

రాజకీయాల పరిధిని మించి చూడలేని వారికి ఆరెస్సెస్ కార్యపద్ధతి అర్థం కాదు. దేశ ప్రజల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని చూస్తేనే ఈ సంస్థ సిద్ధాంతం అవగతమవుతుంది. ఆవిర్భావం నుంచి రాజకీయ అధికారం కోసం కాకుండా 'వ్యక్తి నిర్మాణం' కేంద్రంగా, ప్రజలందరి శ్రేయస్సు కోసం ఆరెస్సెస్ పనిచేస్తోంది. ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రజలకు సహాయం చేయడానికి, సహాయ కార్యక్రమాలను నిర్వహించడానికి, పేద పిల్లలకు విద్య, వైద్య సదుపాయాలు అందించడానికి, వృద్ధులకు సేవ చేయడానికి స్వయం సేవక్‌లు అందించే సేవలలో వివక్ష మచ్చుకైనా కనిపించదు. 'దృఢమైన భారతదేశ నిర్మాణం అంటే అన్ని మతాల ప్రజలు' అని సంఘ్ విశ్వసిస్తోంది. ఈ విషయం ప్రస్తుత సర్ సంఘచాలక్ డా. మోహన్ భగవత్ మాటల్లో చెప్పాలంటే 'మనకు సమాజంలో సద్భావన అవసరం'.

సర్వే భవంతు సుఖినః సర్వే సంతు నిరామయాః
సర్వే భద్రాణి పశ్యంతు మా కశ్చిద్దుఃఖ భాగ్భవేత్
ఓం శాంతిః శాంతిః శాంతిః

అన్న శాంతి మంత్రం స్ఫూర్తితో... ప్రజలందరి సుఖసంతోషాలు, ఆరోగ్యం, శుభాలు, ఆనందం కోసం ఆరెస్సెస్ భవిష్యత్ భారత నిర్మాణంలో, తిరిగి విశ్వగురువుగా దేశాన్ని తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషించాలని ఆశిస్తున్నాను. ప్రత్యేకించి యువతరం సంఘ్ నుంచి స్ఫూర్తి పొంది, సంఘ్ శాఖలకు వెళ్లి, శరీర దారుఢ్యాన్ని, మానసిక వికాసాన్ని, సామాజిక చైతన్యాన్ని పొంది... వికసిత భారత నిర్మాణానికి చోదకశక్తులుగా ఎదగాలని ఆకాంక్షిస్తున్నాను.

■ ముప్పవరపు వెంకయ్య నాయుడు
మాజీ ఉపరాష్ట్రపతి

(నేడు ఆరెస్సెస్ శతవార్షికోత్సవం)

విహార భూమిలో వలసల రగడ!

బిహార్ అంటే విహార భూమి. బుద్ధుడు విహరించిన నేల. రోజూ కిలోమీటర్ల కొద్దీ నడుస్తూ కుల, మతాలకు అతీతంగా మనిషికి గుర్తింపు ఇవ్వాలని బుద్ధుడు అవిశ్రాంతంగా బోధించిన జ్ఞానభూమి. మోక్షమైనా, నిర్వాణమైనా వ్యక్తి కృషి ద్వారానే లభిస్తుంది తప్ప గుడ్డి ఆరాధనతోనూ, యజ్ఞయాగాదులతోనూ రాదని బుద్ధుడు చెప్పింది బిహార్‌లోనే. మానవ విహారానికి ఎటువంటి ఆటంకాలు ఉండకూడదని రెండున్నర వేల ఏళ్ల క్రితం బుద్ధుడు చెప్పిన చోటే ఇప్పుడు వలసలు, విహారాలపై రాజకీయాలు చెలరేగుతున్నాయి. రెండు నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు జరిగే బిహార్‌లో వలసల సక్రమాలు.. అక్రమాల చుట్టూనే ప్రచారం కేంద్రీకృతం అవుతోంది. సాక్షాత్తూ ప్రధాన మంత్రి, హోంమంత్రి ఈ తరహా ప్రచారానికి శ్రీకారం చుట్టారు. గతంలో బెంగాల్, అస్సాం అసెంబ్లీ ఎన్నికల్లో బంగ్లాదేశ్ అక్రమ వలసలను ప్రధాన సమస్యగా చేసుకుని ప్రచారం హోరెత్తింది. ఇప్పుడు బిహార్ వంతు వచ్చింది.



కార్మిక వలసల్లేకుండా, వారి శ్రమలేకుండా ఈనాటి ఆర్థిక వ్యవస్థ రథచక్రాలు కదలవు. వనరులనూ, ఉద్యోగాలనూ కొల్లగొడుతున్నారంటూ వలస కార్మికులకు మతం రంగు పూయటం, విదేశీముద్ర వేయటం వైమనస్యాలను పెంచటానికి మాత్రమే పనికివస్తుంది. ఎన్ని ముద్రలు వేసినా వలసకార్మికులు చిందించిన చెమటచుక్కల ప్రవాహాల నుంచే మన సంపదలు పెరుగుతున్నాయి. మన నగరాలు కళకళలాడుతున్నాయి. మన భవనాల్లో సొగసులు కుదురుకుంటున్నాయి.

వలసలు సక్రమం అయినవైనా, అక్రమం అయినవైనా బిహార్ వాటికి ప్రధాన గమ్యస్థానం కాదు. బిహార్ లోపలికి వచ్చే వారి కంటే పొట్ట చేతపట్టుకుని బయటకి వెళ్లే వారే ఎక్కువ. 1830 నుంచి ఇప్పటి వరకూ అదే కొనసాగుతోంది. నితీశ్‌కుమార్ 2005లో బిహార్ ముఖ్యమంత్రి అయిన నాటి నుంచి అభివృద్ధి పరంగా అద్భుతం జరుగుతోందంటూ ప్రచారం సాగుతున్నప్పటికీ వలసలు పోయే ప్రజల శాతంలో ఆ రాష్ట్రమే అగ్రస్థానంలో ఉంది. ఎక్కడైనా ఉపాధి అవకాశాలు, మంచి జీతాలు ఉన్నచోటకే ప్రజలు వలసలు కడతారు. అవి అంతంత మాత్రం ఉన్న చోటుకు వెళ్లటం సాధ్యంకాదు. బంగ్లా అక్రమ వలసదారులు బిహార్‌ను ముంచెత్తుతున్నారని చెప్పటానికి అంకెలు, ఆధారాల కంటే.. ఒక వర్గం ప్రజల వల్లే సమస్యలన్నీ వస్తున్నాయని చెప్పటంలో రాజకీయ కోణమే కనిపిస్తోంది. ఆ వర్గాన్ని సంతృప్తిపరచే ధోరణితో రాజకీయాలు భ్రష్టుపట్టిపోతున్నాయని ఆరోపించటమూ కష్టం కాదు. కానీ అందుకు హేతుబద్ధమైన సమాచారాన్ని ఇవ్వటమే కష్టం! వలసల గురించి ప్రధానంగా మనకు లభ్యమయ్యే సమాచారం పదేళ్లకొకసారి జరిగే జనాభా లెక్కల వల్లే వస్తుంది. వీటికి తోడు జాతీయ నమూనా సర్వే సంస్థ (నేషనల్ శాంపుల్ సర్వే ఆర్గనైజేషన్– ఎన్ఎస్ఎస్ఓ) అందించే గణాంకాల వల్ల కూడా వలసల సమాచారం దొరుకుతుంది. ఈ రెండు మూలాల నుంచి వచ్చే సమాచారంలో చాలా పరిమితులు ఉన్నాయని బిహార్ వలసలపై పరిశోధించిన అమితాదత్తా (హైదరాబాద్–ఐఐటీ) ఆధారాలతో వివరించారు.

2001 జనాభా లెక్కల ప్రకారం 79 లక్షల మంది పనుల కోసం బిహార్ నుంచి వెలుపలకు వెళ్లారు. 2011 నాటికి ఆ సంఖ్య కొంత తగ్గి 74.5 లక్షలకు చేరుకుంది. ఇలా తగ్గటానికి 2008లో ప్రపంచ వ్యాప్తంగా తలెత్తిన ఆర్థిక సంక్షోభమే ప్రధాన కారణం. అసంఘటిత రంగంపై దీని ప్రభావం అధికంగా పడింది. కార్మికుల్లో అసంఘటిత రంగంలో ఉన్న వారే (85–90%) ఎక్కువ. బిహార్ వలస కార్మికులు అధికంగా ఉపాధి పొందేది ఈ రంగంలోనే. ఆనాటి ఆర్థిక సంక్షోభాన్ని అర్థం చేసుకోవాలంటే మన జీడీపీని పరిశీలిస్తే సరిపోతుంది. 2007–08లో మన జాతీయ స్థూల ఉత్పత్తి (జీడీపీ) 9.3 శాతం ఉంటే ఆర్థిక సంక్షోభం వల్ల అది 6.7 శాతానికి పడిపోయింది. రెండున్నర శాతం జీడీపీ తగ్గిపోవటం మామూలు విషయం కాదు. ఒడిదుడుకులు ఎన్ని ఉన్నా బిహార్‌కు వలసలు కీలకంగా మారిపోయాయి. గ్రామీణ బిహార్‌లో ప్రతి అయిదుగురిలో ఒకరు వలస కార్మికుడిగా పనిచేసే వారే కనపడతారు. కొన్ని గ్రామాల్లో చేసిన సర్వేల్లో వలస కార్మికులు ఉన్న కుటుంబాలు 64.9 శాతం ఉన్నట్లు లెక్కలు తేలాయి.

బంగ్లాదేశ్ నుంచి అక్రమంగా ప్రజలు వస్తున్నారు. దీన్ని కాదనలేం. సుదీర్ఘ సరిహద్దు ఉండటంతో పాటు వందల ఏళ్ల పాటు ఇరుదేశాల ప్రజల మధ్య సంబంధ, బాంధవ్యాలు వలసలను ప్రభావితం చేస్తున్నాయి. అక్రమంగా వలసలు వచ్చిన వాళ్లు ఎంతమంది అనటానికి ప్రభుత్వం దగ్గర లెక్కలు పక్కాగా లేవు. బిహార్‌కు సంబంధించి అదింకా నిజం. బిహార్‌లోని ఉద్యోగాలు, వనరులను బంగ్లా ముస్లింలు కొల్లగొడుతున్నారనటానికి అక్కడి ఆర్థిక పరిస్థితులు సహకరించవు. స్వంత ప్రజలు ఎక్కువగా వలసలు పోయే పరిస్థితులు ఉన్నచోట అది సాధ్యమయ్యే పని కాదు. రాజకీయ ప్రచారానికి వాస్తవాలతో పని ఉండదు కాబట్టి ఏదైనా చెల్లిపోతుంది. దీనికి ఏ పార్టీ మినహాయింపు కాదు. ఓట్ల చోరీవల్లే అధికారాన్ని అందుకోలేక పోయామని రాహుల్‌గాంధీ చేస్తున్న ప్రచారం కూడా ఒకరకంగా అలాంటిదే. ప్రచారాలకూ వాస్తవాలకూ ఎంతో దూరం ఉంటుందనటానికి అస్సాంలో పౌరుల జాతీయ పట్టిక (నేషనల్ రిజిష్టర్ ఆఫ్ సిటిజెన్స్–ఎన్ఆర్‌సీ) వ్యవహారాన్ని చూస్తే అర్థం అవుతుంది. 1971 ముందు నుంచీ అస్సాంలో నివసిస్తున్నట్లుగా సాక్ష్యాధారాలు సమర్పించిన వారినే ఎన్ఆర్‌సీలో చేరుస్తామని ప్రకటించి ఆ మేరకు కసరత్తును అక్కడ పూర్తిచేశారు. 19.06 లక్షల మంది సాక్ష్యాధారాలను సమర్పించలేక పోయారు. అంటే అస్సాం జనాభాలోని 3.3 కోట్ల మందిలో 6 శాతం మంది దగ్గర అవసరమైన పత్రాల్లేవు. అట్లా లేని వారందరూ ముస్లింలే అయివుంటే అక్రమ వలసదారులందరూ ఆ వర్గం వారేనని చెప్పటానికి ఆస్కారం ఉండేది. పత్రాలను సమర్పించలేని వారి సమాచారాన్ని మతాలవారీగా ప్రకటిస్తే అసలు విషయం బయట పడేది. కానీ ప్రభుత్వం ఆ పని చేయలేదు. వివిధ అనధికార అంచనాల ప్రకారం 12 లక్షల మంది హిందువులు (63%) సాక్ష్యాధారాలను సమర్పించలేక పోయారు. ఈ 12 లక్షల మందికీ పౌరసత్వాన్ని కల్పించటానికే పౌరసత్వ చట్టానికి 2019 డిసెంబర్‌లో సవరణను తీసుకువచ్చారు. ఇది తీవ్ర వివాదానికి కారణమైంది. మతాన్ని బట్టి పౌరసత్వాన్ని కల్పించటం రాజ్యాంగానికి విరుద్ధమైందని పేర్కొంటూ పెద్ద ఆందోళనలూ తలెత్తాయి. ముస్లింలు మినహా మిగతా భారతీయ మతాలకు ఆశ్రయమిచ్చే దేశమేదీ ప్రపంచంలో లేకపోవటంతో ఆ సవరణను చేపట్టామని ప్రభుత్వం సమర్థించుకున్నా, అది రాజ్యాంగబద్ధంగా లేదని చెప్పటానికే ఆస్కారం ఎక్కువగా ఉంటుంది. దేశవిదేశాల్లో ఇదే అభిప్రాయం వ్యక్తమైంది. పత్రాల్లేని అస్సాం ముస్లింలకు పౌరసత్వం కల్పించటానికి ఇతర ముస్లిం దేశాలు ముందుకు రాకపోతే పరిష్కారం ఏమిటి అన్న దానికి ప్రభుత్వం నుంచి సమాధానం లేదు. ఏడు లక్షల మంది ముస్లింలను బంగ్లాదేశ్ అక్కున చేర్చుకుంటుదని కోరుకోవటం అత్యాశే అవుతుంది.



■ రాహుల్ కుమార్

అస్సాంలోనే ఈ పరిస్థితి ఉంటే బెంగాల్‌లో ఎన్ఆర్‌సీని రూపొందిస్తే పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించలేం! బంగ్లా నుంచి తరలి వచ్చిన హిందువులందరూ అనుమతులన్నీ తీసుకుని భారత్‌లోకి అడుగుపెట్టారని చెప్పలేం. పత్రాల్లేని హిందువుల సంఖ్య అక్కడ చాలా ఎక్కువగా ఉండొచ్చు. బంగ్లాదేశ్‌లో 1951 నాటికి హిందువులు 92,39,603 మంది ఉంటే, 2022 నాటికి ఆ సంఖ్య 1,31,30,109కి పెరిగింది. 1947 నుంచి దాదాపు కోటిమందికి పైగా హిందువులు భారత్‌కు దఫదఫాలుగా తరలివచ్చిన తర్వాత కూడా ఈ పరిస్థితి ఉంది. బంగ్లాదేశ్‌లో రాజకీయ సంక్షోభం తలెత్తినప్పుడూ, మతాల మధ్య వైషమ్యాలు పెరిగినప్పుడూ హిందువులు ఏదోరకంగా సరిహద్దులు దాటటానికే ప్రయత్నించారు. అందులో సఫలమైన వారి సంఖ్య గణనీయంగానే ఉంటుంది. పక్షపాతం లేకుండా లెక్కలు తీస్తే పశ్చిమబెంగాల్, అస్సాం, త్రిపురల్లో చాలామంది పత్రాల్లేని వారు తేలతారు.

బిహార్‌లోకి అక్రమంగా వస్తున్న విదేశీ వలస కార్మికుల సంఖ్య ఎంతైనప్పటికీ ఆ సమస్యను రాజకీయంగా పెద్దది చేసే అవకాశం ఉండొచ్చు. కాదనలేం. కానీ అక్కడ నుంచి దేశవిదేశాల్లోని పలు ప్రాంతాలకు వలస కార్మికులుగా బిహార్ ప్రజలు ఎందుకు తరలివెళ్లాల్సిన పరిస్థితి వచ్చిందన్న ప్రశ్నే కీలకమైంది. రబ్బరు, చెరకు తోటల్లో పనిచేయటానికి కరేబియన్, గుయానా, సొరినామ్, ట్రినిడాడ్ అండ్ టొబాగో, ఫిజీ, మారిషస్‌లకు ఒప్పందపు కూలీలుగా బిహారీలను 1830ల్లో తీసుకువెళ్లారు. ఆ తర్వాత కొన్నేళ్లకు అస్సాం టీతోటల్లో పనిచేయటానికీ తరలించారు. కలకత్తా కార్మిక అవసరాలకు బిహారీలు కావాల్సి వచ్చారు. వందేళ్లపాటు అస్సాం, బెంగాల్‌కు బిహారీ కార్మికుల యాత్ర కొనసాగింది. కలకత్తా కేంద్రంగా నడిచిన పారిశ్రామిక అభివృద్ధి 1930ల్లో మందగించింది. అదే సమయంలో అస్సాం టీతోటల్లో పనికి గిరాకీ తగ్గింది. దాంతో తూర్పు దిక్కుకు బిహారీల వలసలు సన్నగిల్లాయి. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాతా బిహార్‌లో పారిశ్రామికాభివృద్ధి పెద్దగా జరగలేదు. ఉమ్మడి బిహార్‌లోని ఖనిజ సంపద దండిగా ఉన్నా దాన్ని సబ్సిడీ రేట్లకు ఇతర ప్రాంతాలకు తరలించాల్సి రావటంతో స్థానిక అవసరాలకు ఉపయోగించుకోలేక పోయారు. 1960,

బిహార్‌లోకి అక్రమంగా వస్తున్న విదేశీ వలస కార్మికుల సంఖ్య ఎంతైనప్పటికీ ఆ సమస్యను రాజకీయంగా పెద్దది చేసే అవకాశం ఉండొచ్చు, కాదనలేం. కానీ అక్కడ నుంచి దేశవిదేశాల్లోని పలు ప్రాంతాలకు వలసకార్మికులుగా బిహార్ ప్రజలు ఎందుకు తరలివెళ్లాల్సిన పరిస్థితి వచ్చిందన్న ప్రశ్నే కీలకమైంది.

1970ల నాటి సస్యవిప్లవమూ బిహార్‌లో ప్రభావమూ చూపలేదు. ఆ విప్లవం పుంజుకున్న పంజాబ్, హర్యానా ప్రాంతాలకు బిహారీలు వలస కార్మికులుగా తరలివెళ్లారు. విస్తరిస్తున్న దేశ రాజధాని ఢిల్లీ అవసరాలకు బిహారీలు పెద్దఎత్తున అవసరమయ్యారు. ముంబాయికీ వెళ్లారు. ఆ వలస కార్మికులను వ్యతిరేకిస్తూ, అడపాదడపా వారిపై దాడులు చేస్తూ, విద్వేషాన్ని చిమ్ముతూ శివసేన బలం పుంజుకుంది. ఆర్థిక సంస్కరణలు మొదలైన తర్వాత దక్షిణాదికీ బిహారీ వలసలు విస్తరించాయి. వలసలు గ్రామాల్లో చాలా మార్పులను తెచ్చాయి. 50శాతం పైగా ఆదాయాన్ని వలస కార్మికులు గ్రామాల్లోని కుటుంబ అవసరాలకు పంపుతున్నారు. కుటుంబాల్లో ఆర్థిక పరిస్థితి సాపేక్షికంగా మెరుగుపడింది. గ్రామాలతో పోల్చితే కుల ఆధిక్యతల అహంకారం లేని నగరాల్లో తమకు గౌరవప్రద జీవితం లభిస్తోందని బిహార్ వలస కార్మికులు భావిస్తున్నా చిట్టచివరికి సొంత చోటుకు చేరుకోవాలన్న తపన మాత్రం తగ్గటం లేదు. కుటుంబాలకు దూరంగా ఉండటం, అధికశ్రమతో ఆరోగ్యం దెబ్బతినటం, పని ప్రాంతంలో పరాయివారిగానే చూడటం వాళ్ల మనస్సులను సొంతూళ్ల వైపు లాగేలా చేస్తోంది. కరోనా సమయంలో కాలిబాట పట్టిన లక్షలాది వలసకార్మికులే దీనికి నిదర్శనం.

కార్మిక వలసల్లేకుండా, వారి శ్రమలేకుండా ఈనాటి ఆర్థిక వ్యవస్థ రథచక్రాలు కదలవు. వనరులనూ, ఉద్యోగాలనూ కొల్లగొడుతున్నారంటూ వలస కార్మికులకు మతం రంగు పూయటం, విదేశీముద్ర వేయటం వైమనస్యాలను పెంచటానికి మాత్రమే పనికివస్తుంది. ఎన్ని ముద్రలు వేసినా వలసకార్మికులు చిందించిన చెమటచుక్కల ప్రవాహాల నుంచే మన సంపదలు పెరుగుతున్నాయి. మన నగరాలు కళకళలాడుతున్నాయి. మన భవనాల్లో సొగసులు కుదురుకుంటున్నాయి.

(ఆంధ్రజ్యోతి ఎడిటర్)

సత్యోదయ సంతకం..!



సామాన్యుడు సత్య ప్రవాహమై మారి
విశ్వశాంతి కాంతి కిరణాలను ప్రసరించాడు

విద్వేష యుద్ధ మేఘాలను చీల్చుతూ
అనంత అహింసా ప్రేమ వర్షాన్ని కురిపిస్తూ
అవనిపై మానవత్వ పసిడి పంటలు పండించాడు

సత్యాగ్రహాన్ని భారత స్వాతంత్ర్య శబ్దంగా చేసి
గుప్పెడు ఉప్పును ఆలోచనల ఉప్పెనగా మార్చి
ఉద్యమాలకు కొత్త రహదారులు వేశాడు

క్విట్ ఇండియా నినాదాల హోరు కనుసైగల్లో..
రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యానికి
ఓటమి చిరునామా లిఖించాడు

వందేమాతర స్ఫూర్తి శిఖరాన
మతసామరస్య జెండాను ఎగరేసి
మనందరికీ మహాత్ముడయ్యాడు

హి ఈజ్ నాట్ ఓన్లీ
ఎ మ్యాన్ ఆఫ్ ఇండియా..!
ఈ శతాబ్ద కాల నడవడికకు
చేతికర్ర అయ్యాడు
భవిష్యత్ తరాల బతుకు రాతకు
భగవద్గీతగా నిలిచాడు

– ఫిజిక్స్ అరుణ్‌కుమార్

(నేడు గాంధీ జయంతి)

ఆర్థిక నేరాలపై నివేదికలు సరే, చర్యలేవి?

అవినీతి అధికారులను యాంటీ కరప్షన్ బ్యూరో వలపన్ని పట్టుకోవడం, ఆదాయానికి మించిన సంపదను కూడబెట్టారని జైల్లో బంధించడం బాగానే ఉంది. కానీ వలనూ, మనిషినీ సైతం ఎత్తుకుపోయిన బడా ఆర్థిక నేరస్తుల అవినీతి అక్రమాల పైన చర్యలు తీసుకోవడంలో మాత్రం ప్రభుత్వం అలసత్వం ప్రదర్శిస్తున్నది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి త్వరలో రెండేళ్ళు పూర్తి కాబోతున్నా గత ప్రభుత్వ అవినీతిపై ప్రజలు ఆశించిన విధంగా ఇంకా చర్యలు తీసుకోకపోవడం పట్ల సమాధానం చెప్పాల్సిన అవసరం ఉన్నది. లేదంటే అందరూ ఒకే తాను ముక్కలు అని ప్రజలు నిర్ధారణకు వచ్చేసే అవకాశం ఉన్నది.

2023లో బీఆర్ఎస్ అధికారం కోల్పోవడానికి ఆ కుటుంబ సభ్యుల క్విడ్ ప్రో కో ఆర్థిక అవినీతే కారణమని ఆ పార్టీ నాయకులు తప్ప అంతా అర్థం చేసుకున్నారు. ఆ ఏడాది ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నాటి రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ఈ అంశాన్ని ప్రజల దాకా సమర్థంగా తీసుకెళ్ళారు. తెలంగాణ రాష్ట్రం సిద్ధించిన తర్వాత తొమ్మిదిన్నర ఏళ్ల కేసీఆర్ ప్రభుత్వం పాలనలో జరిగిన అవినీతి అక్రమాల గురించి రేవంత్ రెడ్డి తన వాక్పటిమ ద్వారా ప్రజలను చైతన్యపరిచారు. తత్ఫలితంగానే తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారం లోకి వచ్చింది. తన ఎన్నికల ప్రచారంలో రేవంత్ రెడ్డి వివిధ డిక్లరేషన్ల ద్వారా ప్రజలకు అనేక హామీలను ఇచ్చారు. ఒక దశలో కల్వకుంట్ల కుటుంబానికి చర్లపల్లి జైల్లో డబుల్ బెడ్‌రూమ్ కట్టించి ఇస్తానని కూడా దూకుడుగా ప్రకటించారు. ప్రజలు ఈ మాటలను విశ్వసించారు. బీఆర్ఎస్ నేతల అవినీతికి తగిన శాస్తి జరుగుతుందని ఆశించారు. కానీ తీరా కాంగ్రెస్ పార్టీ అధికారం లోకి వచ్చాక అవేమీ జరగలేదు.



ఏసీబీ, సిట్, సీబీఐ, ఈడీ ఇవన్నీ స్వతంత్ర దర్యాప్తు సంస్థలే అయినప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధీనంలో పని చేస్తుంటాయి. ఈ సంస్థలు జుడీషియల్ ఎంక్వయిరీలు జరిపి ఆయా ప్రభుత్వాలకు విచారణ నివేదికలను అందజేస్తాయి. అట్టి నివేదికలను రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించి సంబంధిత నిందితుల పైన చర్యలు తీసుకోవాలి. కానీ ప్రస్తుత ప్రభుత్వ పాలనలో ఈ నివేదికలన్నీ ఎలాంటి చర్యలకు దారి తీయకుండా ప్రభుత్వ అల్మారాలలో నిద్రపోతున్నాయి. విచారణ నివేదికల కోసం ఖర్చు చేసిన కోట్లాది రూపాయల ప్రజాధనం వృథాగా మిగులుతున్నది.

ఉదాహరణకు, విద్యుత్ కమిషన్ వేసిన జుడిషియల్ కమిషన్ గత ప్రభుత్వ పాలనలో విద్యుత్ కొనుగోళ్లలో రూ.1300కోట్ల అక్రమాలు జరిగాయని తేల్చి నివేదికను సమర్పించింది. ఈ నివేదికను రాష్ట్ర క్యాబినెట్ ఆమోదించింది. కానీ ఇప్పటివరకు తీసుకున్న చర్యలు శూన్యం. గత ప్రభుత్వంలో టీజీపీఎస్సీ నియామకాలు, ఈ–కార్ల రేసులు, కాళేశ్వరంలో అక్రమాలపై ప్రభుత్వం వేసిన సిట్, ఏసీబీ దర్యాప్తులు కొనసాగుతూనే ఉన్నాయి. ఇలా సంవత్సరాలకు సంవత్సరాలు విచారణలకు, నివేదికలకు వెచ్చించి, తీరా ఆ సమర్పించిన నివేదికలపైన చర్యలు ఏమీ తీసుకోకపోవడం వల్ల ప్రజలకు ప్రస్తుత ప్రభుత్వంపై విశ్వసనీయత సన్నగిల్లుతున్నది.

– జూకంటి జగన్నాథం

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన ఈ–మెయిల్ editpage@andhrajyothy.com
వ్యాసాలు యూనికోడ్‌లో ఉండాలి, 800 పదాలకు మించకూడదు.



అమ్మ దీవెన

తప్పొప్పులను క్షమాగుణంతో మన్నించి
నిత్య శోభితమైన ఆనంద వీచికలు
నిరంతరం వెలుగై ప్రసరించే అమ్మ దీవెన
అమ్మ దీవెన కోటి వరాల కానుక


ఒడిదుడుకుల జీవన ప్రయాణం దారుల్లో
అలజడులు లేని గమ్యాన్ని చేరువ చేసి
కష్టాల కడలి సునాయాసంగా దాటే శక్తిని
నొసంగు దుర్గమ్మను కొలిచిన తరుణాన

ఈతి బాధలతో జీవితాన్ని ఈడుస్తూ
సంకటాల కుంపటి నెత్తిన మోసే తీరులో
దోషాలను సంహరించే మహాకాళిగా
వెన్నంటి నడిపించును తలచినంతనే

గ్రహ బాధల దీనావస్థల చీకటి తెరలలో
రుణ బాధల కడగండ్ల కన్నీటితో
అలమటించే మనిషి మననంలో దుర్గమ్మ
కొలువైన తక్షణం శాంతి చేకూరు జీవితాన

సమభావమే జీవన పరమార్థమై
మానవతే మనిషి నిరంతర బ్రతుకై
కొలమానం లేని భక్తి తత్పరతతో కీర్తించి
నమ్మిన భక్తులెల్లరకు అమ్మవారే ప్రతినిత్యం
దీవించి కరుణించి వరమిచ్చే శరణ్యం

– నరెద్దుల రాజారెడ్డి





నగరంలో బుధవారం మధ్యాహ్నం పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది. ఒక్కసారిగా వర్షం కురవడంతో వాహనదారులు ఫ్లైఓవర్ల కింద తలదాచుకున్నారు.
- హైదరాబాద్ సిటీ, ఆంధ్రజ్యోతి

సత్యమేవ జయతే

ఒకే రోజు రెండు పర్వదినాలు.. వాటి సారం ఒక్కటే



హైదరాబాద్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) :చెడుపై మంచి గెలిచిన రోజు(దసరా పండుగ).. అంతర్జాతీయ అహింసా దినం(మహాత్ముడి జయంతి).. రెండూ ఈ ఏడాది ఒకేరోజు రావడం కాకతాళీయమే. అయితే ఆ పర్వదినాల పరమార్థం ఒక్కటే. అదే 'సత్యమేవ జయతే'. ప్రశ్నించే తత్వాన్ని వారసత్వంగా మనకు అందించారు బాపూజీ. దుష్ట శిక్షణ శిష్ట రక్షణ కోసం తొమ్మిది రూపాలు దాల్చింది దుర్గమ్మ. న్యాయాన్ని ధర్మబద్ధంగా సాధించేందుకు సత్యాగ్రహ మార్గాన్ని గాంధీజీ చూపించారు. అమ్మలా ప్రేమ పంచడమేకాదు అవసరమైతే అపరకాళిగానూ మారాలన్నది ఆదిశక్తి అవతారాల సందేశం.

దుర్గమ్మ సందేశం - మహాత్ముడి బోధన

లోక కంటకులైన అసురులను మట్టుపెట్టేందుకు అమ్మ తొమ్మిది రూపాలు దాల్చింది. రాక్షసులంటే కొమ్ములు, కోరలతో వికారమైన రూపంలో దర్శనమిస్తారనుకుంటే పొరపాటే. మనిషిలోని పశుప్రవృత్తి, అహంకారం, అసూయ, ఈర్ష్య, ద్వేషం, మూర్ఖత్వం, కుసంస్కారం వంటి అవలక్షణాలే రాక్షసత్వానికి ప్రతిరూపం. రాక్షసత్వానికి పాల్పడితే శిక్షతప్పదని ఆదిశక్తి అవతారాలు హెచ్చరిస్తాయి. కామ, క్రోద, లోభ, మోహ, మదమాత్సర్యాలైన అంతర్గత శత్రువులపై ఆధిపత్యం సాధించడానికి సత్యనిష్ఠ ఒక్కటే ఏకైక మార్గమని మహాత్ముడు బోధించాడు.

ఎదురెదురుగా రెండు బైకులు ఢీ..
ముగ్గురు యువకులు దుర్మరణం

- అతివేగమే ప్రమాదానికి కారణం


ఇస్లావత్ మోహన్, కేతావత్ సిద్ధూ,(ఫైల్)


తుక్కుగా మారిన ద్విచక్ర వాహనాలు

పహాడిషరీఫ్ అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): వేగంగా వెళ్తున్న రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొనడంతో ముగ్గురు మృత్యువాత పడ్డారు. మరో యువకుడు ప్రాణాపాయ స్థితిలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. పహాడిషరీఫ్ పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హర్షగూడకు చెందిన ఇస్లావత్ మోహన్ (20), కేతావత్ సిద్ధూ, (17), సింహాద్రి ముగ్గురూ బైక్‌పై తుక్కుగూడ సర్వీస్ రోడ్ గుండా హర్షగూడ వైపునకు వెళ్తున్నారు. ఇదే సమయంలో షాద్‌నగర్ బాలానగర్‌కు చెందిన కొండా అరుణ్ (24) మరో బైక్‌పై అదే సర్వీస్ రోడ్‌లో ఎదురుగా వచ్చాడు. రెండు బైకులు ఒకదానికొకటి ఢీకొనడంతో తీవ్ర గాయాలతో మోహన్, సిద్ధూ, అరుణ్ అక్కడికక్కడే చనిపోయారు. సింహాద్రికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు పహాడిషరీఫ్ పోలీసులకు సమాచారమందించారు. పోలీసులు మృతదేహాలను ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. గాయపడిన యువకుడిని స్థానిక ఆస్పత్రికి తరలించారు. అతివేగమే ప్రమాదానికి కారణమని పోలీసులు భావిస్తున్నారు. ప్రమాదంలో బైకులు ధ్వంసమయ్యాయి.

'ఫ్లైఓవర్ పేరులో మార్పు లేదు'

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ తల్లి ఫ్లైఓవర్ పేరులో మార్పు లేదని జీహెచ్ఎంసీ ప్రాజెక్ట్స్ వింగ్ తెలిపింది. తెలంగాణ తల్లి బోర్డుపై మంగళవారం స్టిక్కర్ అంటించి ఉండడంతో మళ్లీ పేరు మారిందని ప్రచారం జరిగిన నేపథ్యంలో క్లారిటీ ఇచ్చింది. తెలంగాణ తల్లి ఫ్లైఓవర్‌గా నామకరణం చేయడానికి స్టాండింగ్ కమిటీ ఆమోదించిందని, ఈమేరకు త్వరలోనే కొత్త బోర్డులు ఏర్పాటు చేస్తామని జీహెచ్ఎంసీ పేర్కొంది.

14 కేసుల్లో 22 మంది అరెస్టు



హైదరాబాద్ సిటీ, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలకు పాల్పడిన 22 మందిని అరెస్టు చేసినట్లు సైబరాబాద్ సైబర్ క్రైం ఇన్‌చార్జి డీసీపీ సృజన కరణం తెలిపారు. సెప్టెంబరు 24 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించిన ప్రత్యేక ఆపరేషన్‌లో 14 కేసుల్లో 22 మంది నిందితులను అరెస్టు చేశామని తెలిపారు. 22 మందిలో 17 మంది ట్రేడింగ్ పేరుతోనే మోసాలకు పాల్పడినట్లు వివరించారు. ఒక కేసులో రూ.1.16 కోట్ల ఆన్‌లైన్ ట్రేడింగ్ మోసాన్ని ఛేదించి, మహారాష్ట్రలో ఐదుగురిని అరెస్టు చేశామన్నారు. ఈ కేసులో బాధితురాలు నకిలీ స్టాక్ ట్రేడింగ్ అప్లికేషన్ ద్వారా మోసపోయిందని వెల్లడించారు.

దసరా వ్యాపారం 4000 కోట్లు!



నగరంలో జరిగిన కొనుగోళ్లపై ఓ అంచనా

- ఒక్క వస్త్ర వ్యాపారంలోనే రూ.1500 కోట్లు
- ఆటోమొబైల్ రంగంలో రూ.1000 కోట్లు
- ఎలక్ట్రానిక్స్, హోమ్ అప్లయెన్సస్‌లోనూ సందడి
- వన్నె కోల్పోయిన ఆభరణం
- చిరువ్యాపారుల్లో కనిపించని సంతోషం


కూకట్‌పల్లిలోని ఓ షోరూంలో కొనుగోలుదారుల సందడి

హైదరాబాద్ సిటీ నెట్‌వర్క్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : బతుకమ్మ పండుగతో ప్రారంభమైన షాపింగ్ సందడి, దసరా పండుగ ముందు రోజు వరకూ కొనసాగుతూనే ఉంది. పండుగ వేళ నూతన వస్త్రాలను కొనడం సాధారణమే అయినప్పటికీ, ఈసారి జీఎస్టీ రేట్ల తగ్గింపుతో ఆటోమొబైల్ రంగంలోనూ జోష్ కనిపించింది. అలాగే, ఎలక్ట్రానిక్స్ హోమ్ అప్లయెన్సస్ అమ్మకాల్లో జోరు కనిపించినప్పటికీ ఆన్‌లైన్‌తో పోలిస్తే, ఆఫ్‌లైన్‌లో ధరలు కాస్త ఎక్కువగానే ఉండటం, బ్యాంక్ ఆఫర్లు కలిసి రావడంతో సూపర్‌మార్కెట్లలో అమ్మకాల జోరు పెద్దగా కనిపించలేదని వ్యాపారులు చెబుతున్నారు. బంగారం అయితే వన్నె కోల్పోయింది. మొత్తంగా దసరా, బతుకమ్మ సీజన్‌లో నగరంలో సుమారు 4వేల కోట్ల రూపాయల వ్యాపారం జరిగి ఉంటుందని వ్యాపారులు అంచనా వేస్తున్నారు.

10వేల కార్లు, 30 వేల బైక్‌లు..

గత సీజన్‌తో పోలిస్తే ఈ దసరాకు అమ్మకాలు భారీగానే జరిగాయని ఎక్కువ మంది చెబుతున్నారు. పండుగకు ముందు ప్రభుత్వం తీసుకువచ్చిన జీఎస్టీ సంస్కరణలతో ఆటోమొబైల్ రంగం లాభపడిందని అంటున్నారు. పండుగకు ముందు సరిగ్గా నాలుగు రోజుల్లో నగరంలో 5వేలకు పైగా కార్లు అమ్ముడుపోయినట్లు ఆటోమొబైల్ రంగ నిపుణులు మంచికంటి సంతోష్ తెలిపారు. ఈ అమ్మకాలలో 50% మారుతీవే అన్నారు. పలు సంస్థలు, డీలర్లు ప్రకటించిన ఆఫర్లతో భారీగా లబ్ధి కలుగుతుండటంతో ఎక్కువ మంది కార్ల కొనుగోలుకు మొగ్గు చూపారంటున్నారు. మొత్తంమీద ఈ 10 రోజుల పండుగ కాలంలో నగరంలో 10వేలకు పైగా కార్లు, 30 వేలకు పైగా బైక్‌లు అమ్ముడయ్యాయని ఈ రంగాల్లోని ప్రముఖులు వెల్లడిస్తున్నారు. గత సంవత్సరంతో పోలిస్తే తమ అమ్మకాలు 40%కు పైగానే పెరిగాయని ఎంజీ రోడ్‌లోని హోండా షో రూమ్ ఇన్‌చార్జ్ సైమన్ తెలిపారు. దసరా పండుగ పది రోజుల్లోనే దాదాపు 1000 కోట్ల రూపాయలు అమ్మకాలు నగరంలో జరిగి ఉంటాయని అంచనాగా పేర్కొంటున్నారు.

ఆటో మొబైల్ విక్రయాలు బాగున్నాయి



ఈ దసరా నగరంలోని ఆటో డీలర్లకు అసలైన సంతోషం తీసుకువచ్చింది. జీఎస్టీ తగ్గడంతో కార్లను గతంలో ఎన్నడూ లేనంతగా కొన్నారు. నాలుగు రోజుల్లోనే 5 వేల కార్లను కొన్నారు.
- మంచికంటి సంతోష్, ఆటోమొబైల్ నిపుణుడు

అమ్మకాలు లేవు



గత సంవత్సరం బంగారం విక్రయాలు బాగానే జరిగాయి. ఇప్పుడు ఎవరూ రావడం లేదు. బంగారం ధర పెరగడమే దీనికి కారణం.
- చేలారం చౌదరి, హేమ జ్యువెలర్స్, రాజేంద్ర నగర్

మాల్స్‌లో సందడి

ఆటోమొబైల్ రంగం తర్వాత మాల్స్‌లో సందడి కనిపించింది. మాదాపూర్, గచ్చిబౌలి, కూకట్‌పల్లి లాంటి చోట్ల ఉన్న మాల్స్‌లో రద్దీ అధికంగా ఉంది. పలు ఎలక్ట్రానిక్ షోరూమ్‌లలో కూడా ఈ సందడి కనిపించిందని పంజాగుట్టలోని ఓ ఎలక్ట్రానిక్స్ షోరూమ్ ప్రతినిధి ముజీబ్ తెలిపారు. ఆఫర్లకు తోడు జీఎస్టీ తగ్గింపు ధరలు, ఆన్‌లైన్‌లో పోటీగా ధరలు అందించడం వల్ల గతంతో పోలిస్తే ఎక్కువ మంది కొనుగోళ్లు చేశారని వెల్లడించారు. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది ఎలక్ట్రానిక్స్, హోమ్ అప్లయెన్సస్ రంగంలో 25-30% వరకూ వృద్ధి చూశామని వెల్లడించారు.

చిన్నబోయిన చిరు వ్యాపారం

దసరా సీజన్‌లో ఒక్క వస్త్ర వ్యాపారం పైనే నగరంలో 1500 కోట్ల రూపాయల అమ్మకాలు

మిగతా 6వ పేజీలో..

మార్కెట్లోకి నకిలీ మెహందీ

- నిర్వాహకుడి అరెస్ట్


స్వాధీనం చేసుకున్న సామగ్రితో నిందితుడు

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): కరాచీ పేరుతో నకిలీ మెహందీ విక్రయిస్తున్న వ్యక్తిని సౌత్‌ఈస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్, బండ్లగూడ పోలీసులు అరెస్ట్ చేశారు. పట్టేపల్లికి చెందిన మహ్మద్ అబ్దుల్ వసీం (54) మెహందీ ప్రొడక్ట్ తయారీ లైసెన్స్ తీసుకొని గౌసనగర్‌లో మశ్రత్ మెహందీ పేరుతో కోన్‌లు తయారు చేసి విక్రయిస్తున్నాడు. అతడు తయారు చేసిన మెహందీ అమ్ముడు కాకపోవడంతో మార్కెట్లో డిమాండ్ ఉన్న కరాచీ మెహందీ పేరుతో మార్కెట్‌లోకి సరఫరా చేస్తున్నాడు. పోలీసులు అతడి కార్ఖానాపై దాడి చేశారు. రూ.5లక్షల విలువైన ముడిసరుకు, కోన్లు స్వాధీనం చేసుకున్నారు.

బతుకమ్మకుంట బాధ్యత హైడ్రాదే

● హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు వీహెచ్ వినతి

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): అంబర్ పేట బతుకమ్మ కుంటను బాగా అభివృద్ధి చేసి, సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. దీంతో ఈ ప్రాంత రూపురేఖలు మారిపోయాయి. దాని నిర్వహణ బాధ్యతను కూడా హైడ్రానే తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ ఎంపీ వి.హనుమంతరావు కోరారు. బుధవారం హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌కు వినతిపత్రం అందజేశారు. కబ్జాచెర నుంచి బతుకమ్మ కుంటను కాపాడడం, చెరువుగా అభివృద్ధి చేయడం, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించడం ఇలా అన్ని కార్యక్రమాలు ఎంతో వైభవంగా జరిగాయని, ఈ విషయంలో హైడ్రా చేసిన కృషి అభినందనీయమని వీహెచ్ అన్నారు. బతుకమ్మకుంటను అభివృద్ధి చేసి వదిలేశారు అనే అపవాదు రాకుండా దీని పరిరక్షణ బాధ్యతను హైడ్రా తీసుకోవాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

బోటు షికారు కొనసాగించండి

బతుకమ్మకుంటలో ఉన్న బోటు షికారును కొనసాగించాలని హైడ్రా కమిషనర్‌కు వీహెచ్ విజ్ఞప్తి చేశారు. హైడ్రా కమిషనర్‌ను కలిసిన వారిలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నారాయణస్వామి ఉన్నారు.


హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు వినతిపత్రం అందజేస్తున్న వి.హనుమంతరావు

దుర్గామాత ప్రతిమల నిమజ్జనం.. నేడు, రేపు ట్రాఫిక్ మళ్లింపు

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): దుర్గామాత ప్రతిమల నిమజ్జనం దృష్ట్యా నగరంలో ట్రాఫిక్ మళ్లింపు చర్యలు చేపట్టామని హైదరాబాద్ సిటీ పోలీస్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ ఒక ప్రకటనలో తెలిపారు. హుస్సేన్‌సాగర్ చుట్టూ ఉన్న పీపుల్స్ ప్లాజా, గార్డెన్ పాయింట్, జలవిహార్ వద్ద ఉన్న బేబీ పాండ్, సంజీవయ్య పార్కు ప్రాంతాల్లో నిమజ్జన ఏర్పాట్లు చేశామన్నారు. గురు, శుక్రవారాల్లో నిమజ్జనం పూర్తయ్యే వరకు ట్రాఫిక్ మళ్లింపు నిబంధనలు అమల్లో ఉంటాయని ట్రాఫిక్ జాయింట్ సీపీ తెలిపారు.

ట్రాఫిక్ మళ్లింపు ఇలా..

- పంజాగుట్ట, రాజ్‌భవన్ నుంచి కాకుండా వీవీ విగ్రహం నుంచి నిరంకారి జంక్షన్ వైపుగా..
- నిరంకారి జంక్షన్ నుంచి వచ్చే వాహనాలను ఓల్డ్ సైఫాబాద్ పోలీస్ స్టేషన్, రవీంద్రభారతి, మాసబ్‌ట్యాంక్ వైపునకు..
- ఖైరతాబాద్ బడా గణేశ్ లేన్ నుంచి వచ్చే వాహనాలు ప్రింటింగ్ ప్రెస్ జంక్షన్ నుంచి రాజీవ్‌గాంధీ విగ్రహం వైపు తరలింపు..
- అప్పర్ ట్యాంక్‌బండ్ నుంచి వచ్చే వాహనాలు ఓల్డ్ అంబేడ్కర్ విగ్రహం, లిబర్టీ వెళ్లేలా చర్యలు.
- హిమాయత్‌నగర్ వై జంక్షన్ నుంచి వచ్చే వాహనాలను లిబర్టీ జంక్షన్ వద్ద మళ్లింపు. అలాగే ఓల్డ్ అంబేడ్కర్ విగ్రహం, తెలుగు తల్లి ఫ్లై ఓవర్, ఎన్‌టీఆర్ మార్ట్, నెక్లెస్ రోడ్డు వైపుగా..
- రాణిగంజ్ నుంచి వచ్చే వాహనాలను నల్లగుట్ట ఎక్స్ రోడ్డు వద్ద మళ్లింపు.
- మినిస్టర్ రోడ్డు మీదుగా నెక్లెస్ రోడ్డు వైపు వచ్చే వాహనాలను నల్లగుట్ట ఎక్స్‌రోడ్డు వద్ద మళ్లించి రాణిగంజ్ మీదుగా..

చుక్కా రామయ్యకు పద్మ విభూషణ్ ఇవ్వాలి

● జూలూరు గౌరీశంకర్

హైదరాబాద్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమర యోధుడు చుక్కా రామయ్యకు కేంద్ర ప్రభుత్వం పద్మ విభూషణ్ ఇచ్చి సత్కరించాలని తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్ కోరారు. వేలాదిమంది ఐఐటీలను తయారుచేసి దేశానికి, ప్రపంచానికి అందించిన చుక్కారామయ్య రెండు తెలుగు రాష్ట్రాలు గర్వించదగ్గ వ్యక్తి అని పేర్కొన్నారు. గాంధీ 156వ జయంతి సందర్భంగా గాంధేయవాది, రచయిత డాక్టర్ నాగసూరి వేణుగోపాల్ రచించిన "గ్లోబల్ రోల్ మోడల్ మహాత్మా గాంధీ" పుస్తకాన్ని చుక్కా రామయ్య బుధవారం తన నివాసంలో ఆవిష్కరించారు. జూలూరు మాట్లాడుతూ అమెరికాలోని సిలికాన్ వాలీ తెలుగు విద్యార్థులతో నిండిపోవడానికి కారకుడు రామయ్యే అన్నారు. పుస్తక రచయిత డాక్టర్ నాగసూరి వేణుగోపాల్ మాట్లాడుతూ గాంధీ వ్యక్తిత్వం, ఆయన ఆలోచనలు, ఆచరణ, తాత్వికత నేటి కాలానికి ఎంత అవసరమో గ్లోబల్ రోల్ మోడల్ గాంధీ పుస్తకంలో వివరించినట్లు తెలిపారు. తెలంగాణ పబ్లికేషన్స్ వ్యవస్థాపకుడు కోయ చంద్రమోహన్, రామానంద తీర్థ గ్రామీణ విద్యా సంస్థ చైర్మన్ నారా కిషోర్ రెడ్డి, రామయ్య తనయుడు సైంటిస్ట్ చుక్కా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


"గ్లోబల్ రోల్ మోడల్ మహాత్మా గాంధీ" పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న చుక్కారామయ్య, జూలూరు గౌరీశంకర్ తదితరులు

సాస్ ఇన్‌ఫ్రా తరగతి గదుల నిర్మాణం

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): ఫ్రీడమ్ త్రూ ఎడ్యుకేషన్ అంటూ దేశవ్యాప్తంగా మూడు వేలకు పైగా పాఠశాలల్లో ఏడు వేలకు పైగా తరగతి గదులను నిర్మించిన రౌండ్ టేబుల్ ఇండియాతో సాస్ ఇన్‌ఫ్రా చేతులు కలిపింది. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను కల్పించడం ద్వారా వెనుకబడిన వర్గాల పిల్లల భవిష్యత్‌కు భరోసా అందించాలన్నది తమ ప్రయత్నమని సాస్ ఇండియా సంస్థ ప్రతినిధి వెల్లడించారు. ఈ కార్యక్రమం ద్వారా మౌలిక సదుపాయాలు, అవకాశాల మధ్య ఉన్న అంతరాన్ని ఫ్రీడమ్ త్రూ ఎడ్యుకేషన్ కార్యక్రమం పూరించనుందన్నారు.

నేటినుంచి ఆర్మీ ఇంజనీరింగ్ సైనిక్ స్కూల్

పూర్వ విద్యార్థుల గోల్ఫ్ టోర్నమెంట్

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆర్మీ ఇంజనీరింగ్ సైనిక్ స్కూల్ అలుమ్ని గోల్ఫ్ టోర్నమెంట్‌ను ఈనెల 2 నుంచి 4వ తేదీ వరకు నిర్వహిస్తున్నామని స్వాల్వర్‌గోల్ఫ్ డైరెక్టర్ రిటైర్డ్ బ్రిగేడియర్ డీవీ సింగ్ తెలిపారు. టోర్నమెంట్‌లో దేశవ్యాప్తంగా సైనిక స్కూళ్ల పూర్వ విద్యార్థులు పాల్గొంటారన్నారు. బౌల్డర్‌హిల్ గోల్ఫ్ అండ్ కంట్రీక్లబ్‌లో నిర్వహించే ఈ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు.

రీఫర్ కంటెయినర్ స్పెషల్

● ప్రారంభించిన దక్షిణ మధ్య రైల్వే

హైదరాబాద్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే రీఫర్ కంటెయినర్ స్పెషల్ ఆపరేషన్‌ను ప్రారంభించింది. రైల్వే గతి శక్తి కార్గో టెర్మినల్, మెసర్స్ డీపీ వరల్డ్ మల్టీమోడల్ లాజిస్టిక్స్ తిమ్మాపూర్ నుంచి ముంబై జవహర్‌లాల్ నెహ్రూ పోర్ట్ ట్రస్ట్‌కు రీఫర్ కంటెయినర్‌ను రవాణా చేసింది. ప్రతీ బుధవారం తిమ్మాపూర్ నుంచి రీఫర్ కంటెయినర్‌ను రవాణా చేయడానికి ఏర్పాట్లు చేసినట్టు దక్షిణ మధ్యరైల్వే అధికారులు తెలియజేశారు. రీఫర్ కంటెయినర్ స్పెషల్ ఆపరేషన్‌తో హైదరాబాద్‌లోని ఔషధ పరిశ్రమకు గణనీయమైన ప్రోత్సాహం లభిస్తుందని తెలిపారు.

హైదరాబాద్ కెప్టెన్‌గా మమత



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడా ప్రతినిధి): బీసీసీఐ సీనియర్ మహిళల టీ20 టోర్నమెంట్‌లో పాల్గొనే హైదరాబాద్ జట్టుకు కెప్టెన్‌గా వికెట్‌కీపర్ మమత నియమితురాలైంది. బుధవారం హెచ్‌సీఏ సెలెక్టర్లు హైదరాబాద్ జట్టును ప్రకటించారు. ఈనెల 8వ తేదీ నుంచి గ్వాలియర్‌లో ఈ పోటీలు జరగనున్నాయి. మడివాల మమతతో పాటు త్రిషా రెడ్డి, కావ్య, యషశ్రి, క్రాంతి, ధ్రుతి, పూజ, నిధి, సాక్షి రావు, సృజన, నితీషా, శ్రీవల్లి, వైష్ణవి, ప్రతీక్ష, ప్రాంజల్‌కు జట్టులో చోటు లభించింది. స్టాండ్ బైలుగా తేజశ్విని, త్రిషా పూజిత, పార్వతి, జాస్మిన్ గిల్, చందన ఎంపికయ్యారు.

దసరా వ్యాపారం రూ. 4 వేల కోట్లు!

(5వ పేజీ తరువాయి)

ఉండొచ్చని ఓ బ్రాండెడ్ వస్త్ర కంపెనీ మేనేజర్ దర్యానీ అంచనా వేశారు. అయితే కొనుగోళ్లు అంతగా లేవని చిన్న వ్యాపారులు పేర్కొంటున్నారు. మాల్స్, పెద్ద షోరూమ్‌లలో భారీగా ఆఫర్లను ప్రకటించడంతో ఎక్కువ మంది అటువైపే చూశారు కానీ చిరు వ్యాపారులను పట్టించుకోలేదంటున్నారు. తమ వద్ద దాదాపు 70-80% అమ్మకాలు పడిపోయాయని స్వప్నలోక్ వద్ద షాప్ అండ్ గో నిర్వాహకుడు శ్రీకాంత్ వాపోయారు. బంగారం వ్యాపారమైతే భారీగా పడిపోయిందన్నారు. గత సంవత్సరంతో పోలిస్తే 50%కు పైగా అమ్మకాలు పడిపోయాయని ఓ జ్యువెలర్ షాప్ నిర్వాహకుడు ఆకుల ప్రతాప్ తెలిపారు. నిత్యావసరాల పరంగా హైపర్, డిస్కౌంట్ స్టోర్లలో కనిపించిన సందడి తమ వద్ద కనిపించలేదని కిరాణా వ్యాపారులు చెబుతున్నారు.

కెడెట్స్‌కు కమోడోర్ అభినందనలు

అల్వాల్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): కెడెట్స్‌ను ఎన్‌సీసీ డైరెక్టరేట్ సికింద్రాబాద్ ప్రధాన కార్యాలయంలో కమోడోర్ నర్సింగ్ సైలాని బుధవారం ప్రత్యేకంగా అభినందించారు. బెంగళూరు ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ జలహళ్లిలో సెప్టెంబరు 18 నుంచి 29 వరకు నిర్వహించిన ఆలిండియా వాయు సైనిక్ క్యాంప్(ఏఐవీఎస్‌సీ)-2025లో ఎన్‌సీసీ డైరెక్టరేట్ (ఏపీ-తెలంగాణ)కు చెందిన ఎన్‌సీసీ కెడెట్స్ బృందం ప్రాతినిధ్యం వహించింది. ఈ బృందం వివిధ విభాగాల్లో ప్రతిభను ప్రదర్శించింది. విశాఖపట్నం 6(ఏ) ఎయిర్ స్క్వాడ్రన్ ఎన్‌సీసీ నుంచి సీపీఎల్. కె. ఉదయ ఆరోగ్యం పరిశుభ్రత పోటీల్లో కాంస్య పతకాన్ని సాధించారు.

జూబ్లీహిల్స్‌లో దసరా దమ్కీ

● మద్యం.. లేకుంటే మామూళ్లు ఇవ్వాల్సిందే
● ఆశావహుల ఇళ్లకు చోటా, మోటా నేతల క్యూ

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో కాంగ్రెస్, బీజేపీ నుంచి టికెట్ ఆశిస్తున్న నేతలకు దసరా పండగ ఖర్చు భారీగానే అవుతోంది. మద్యం, మామూళ్లు ఇవ్వాలంటూ చోట, మోటా నేతలు ఆశావహుల ఇళ్ల వద్ద క్యూ కట్టారు. కొందరూ ఆశావహులు రెండు రోజులుగా పంపకాలను ప్రారంభించారు. మద్యం, మామూళ్లు ఇచ్చి పంపుతున్నట్లు తెలిసింది. కాంగ్రెస్ నుంచి టికెట్ ఆశిస్తున్న ఓ నేత.. పండుగ రోజే ఇంటికి రావాలని.. మాంసం, మందుతో విందు ఉంటుందని ఫోన్ చేసి చెబుతున్నట్లు సమాచారం. దసరా మామూళ్లు ఇవ్వాలంటూ కాలనీలు, బస్తీలకు చెందిన నేతలు బారులు తీరారు. కొందరైతే ఏకంగా ఫోన్లు చేసి మరీ మన వెంట తిరిగేవారికి మందు పంచుదామని టికెట్ ఆశిస్తున్న ఆశావహుడి ముందు ప్రతిపాదన పెట్టినట్లు సమాచారం. కొందరూ యూట్యూబర్స్ కూడా టికెట్ ఆశించే వారి ఇళ్ల ముందు బారులు తీరుతున్నారు. వారం రోజులుగా తన ఇంటికి వచ్చే యూట్యూబర్స్ పేర్లను తన అనుచరుడి వద్ద నమోదు చేసుకోవాలని ఓ ఆశావహుడు సూచించగా.. 200కు పైగా పేర్లు నమోదైనట్లు తెలిసింది. కాంగ్రెస్ టికెట్ ఆశిస్తున్న నవీన్ యాదవ్, బొంతు రామ్మోహన్, అంజన్‌కుమార్ యాదవ్, గుర్రం మురళీగౌడ్, సీఎన్‌రెడ్డి, కంజర్ల విజయలక్ష్మీ ఫ్లెక్సీలు, బ్యానర్లు పెద్ద ఎత్తున కడుతున్నారు. కొందరు ఆశావహులు వివిధ ప్రాంతాల్లో బతుకమ్మ సంబురాలు నిర్వహించి మహిళలకు బహుమతులు అందజేశారు. జూబ్లీహిల్స్ టికెట్ ఆశిస్తున్న ఓ నేత ఖర్చు ఇప్పటికే కోటి రూపాయలకు పైగా చేరినట్లు తెలిసింది. కాంగ్రెస్ నుంచి టికెట్ ఆశిస్తున్న వారు ఇప్పటి వరకు ఆరుగురు కాగా.. తాజాగా మైనంపల్లి టీమ్ పేరుతో ఫ్లెక్సీలు రావడంతో ఏడుగురికి చేరింది.

ఉదాసీన్ మఠం భూముల రక్షణకు

ఈవో నియామకం సబబే : హైకోర్టు

హైదరాబాద్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి గ్రామ పరిధిలోని వై జంక్షన్ వద్ద 1010 నుంచి 1070 వరకు వివిధ సర్వే నంబర్లలో 540 ఎకరాల భూములు ఉన్న ఉదాసీన్ మఠానికి ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (ఈవో)ను నియమిస్తూ ఎండోమెంట్స్ కమిషనర్ (రాష్ట్ర ప్రభుత్వం) జారీచేసిన ఉత్తర్వులను హైకోర్టు సమర్థించింది. ఈవో నియామకం చెల్లదని పేర్కొంటూ ఉదాసీన్ మఠం మహంత్ అరుణ్‌దాస్ ఉదాసీన్ దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టేసింది. ఈ మఠానికి చెందిన భూములు అన్యాక్రాంతం కాకుండా, నిర్వహణ లోపాలు లేకుండా చూసుకునేందుకు ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఉండాల్సిందేనని హైకోర్టు పేర్కొంది. ఏపీ ఛారిటబుల్ అండ్ హిందూ రిలీజియస్ ఇన్‌స్టిట్యూషన్స్ అండ్ ఎండోమెంట్ యాక్ట్ - 1987 ప్రకారం మఠానికి ఈవోను నియమిస్తూ 2009లో రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ ఉదాసీన్ మఠం మహంత్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ నగేశ్ భీమపాక ధర్మాసనం విచారణ చేపట్టింది. ఉదాసీన్ మఠానికి ఈవోను నియమించాలనే ప్రభుత్వ ఉత్తర్వులను సమర్థిస్తూ తీర్పు వెలువరించింది.

నిమ్స్‌లో ఆధునిక ఫిజియోథెరపీ పరికరాలు

నిమ్స్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): నిమ్స్‌లో రూ. 40 లక్షలతో ఫిజియోథెరపీ విభాగంలో మూడు మిషన్లను అందుబాటులోకి తీసుకొచ్చామని, దీంతో రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించవచ్చని నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ నగరి బీరప్ప అన్నారు. బుధవారం వాటిని ప్రారంభించారు. కార్యక్రమంలో డీన్ ప్రొఫెసర్ లిజా రాజశేఖర్, అదనపు మెడికల్ సూపరింటెండెంట్లు లక్ష్మీ భాస్కర్, కృష్ణారెడ్డి, అసోసియేట్ డీన్ భూషణ్ రాజు, ఫిజియోథెరపీ విభాగాధిపతి డాక్టర్ శ్రవణ్, పీఆర్వో సత్యగౌడ్, డాక్టర్ నవీన్, డాక్టర్ ప్రసాద్, డాక్టర్ ప్రవీణ్, డాక్టర్ సునీత పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్‌లో యాదవ అభ్యర్థిని గెలిపిస్తే

ఏడాదిపాటు కేబుల్ ప్రసారాలు ఉచితం

● కేబుల్ టీవీ నెట్‌వర్క్ ప్రొప్రైటర్ ఎన్. మల్లేష్ యాదవ్

బోరబండ, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో యాదవ సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థిని గెలిపిస్తే ఏడాది పాటు కేబుల్ ప్రసారాలు ఉచితంగా అందిస్తానని కేబుల్ టీవీ నెట్‌వర్క్ ప్రొప్రైటర్ ఎన్. మల్లేష్ యాదవ్ ప్రకటించాడు. ఈ మేరకు కార్మికనగర్ కూడలిలో ఫ్లెక్సీ ఏర్పాటు చేశాడు. యాదవ సామాజిక వర్గం నుంచి మాజీ ఎంపీ ఎం.అంజన్ కుమార్ యాదవ్, నవయువ నిర్మాణ్ సంస్థ వ్యవస్థాపకుడు వి.నవీన్ యాదవ్, మాజీమంత్రి కోడలు కంజర్ల విజయలక్ష్మి యాదవ్ జూబ్లీహిల్స్ టికెట్ ఆశిస్తున్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక జరిగి ఫలితాలు వచ్చిన తర్వాతే ఈ ఆఫర్ మొదలవుతుందని చెప్పాడు.

జూ పార్కుకు మూడు జీబ్రాలు

● గుజరాత్‌లోని వంతారా నుంచి తీసుకొచ్చిన అధికారులు

మదీన, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): జవహర్‌లాల్‌నెహ్రూ జంతు ప్రదర్శనశాల(జూపార్కు)లో జీబ్రాలు సందర్శకులను కనువిందు చేయనున్నాయి. గుజరాత్‌లోని వంతారా జూ నుంచి మూడు జీబ్రాలను అధికారులు తీసుకువచ్చారు. అందులో రెండు ఆడ, ఒక మగ జీబ్రాలు ఉన్నాయి. 35 ఏళ్లుగా జూ పార్కులో జీబ్రాలు లేవు. జంతు మార్పిడిలో భాగంగా వంతారా జూపార్కుకు 20 మూషిక జింకలను ఇచ్చి అక్కడి జూపార్కు నుంచి జీబ్రాలను తీసుకువచ్చారు. ఈనెల 6వ తేదీన జరగనున్న 'జూ డే' సందర్భంగా జీబ్రాలను సందర్శకులు తిలకించడానికి ఎన్‌క్లోజర్‌లోకి విడుదల చేయనున్నట్లు అధికారులు తెలిపారు.


డీసీఎం నుంచి వస్తున్న పొగ

షార్ట్ సర్క్యూట్.. డీసీఎంలో మంటలు

● కాలిపోయిన మద్యం బాటిళ్లు

రామంతాపూర్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): షార్టుసర్క్యూట్‌తో డీసీఎం వ్యాన్‌లో మంటలు చెలరేగాయి. సకాలంలో మంటలు ఆర్పివేయడంతో ప్రమాదం తప్పింది. మద్యం బాటిళ్ల లోడ్‌తో డీసీఎం రామంతాపూర్‌లోని వైన్ మార్ట్‌కు బయలుదేరింది. స్ఫూర్తి కళాశాల వద్దకు వెళ్లగానే డీసీఎం అకస్మాత్తుగా ఆగిపోయింది. స్థానికులు వాహనాన్ని పక్కకు తొలగిస్తుండగా వ్యాన్‌లోని స్టాక్‌కు విద్యుత్ వైర్లు తగలడంతో మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. డీసీఎంలోని మద్యం బాటిళ్లు పాక్షికంగా కాలిపోయాయి. వాహనంలోని మద్యం బాటిళ్లను స్థానికులు తీసుకెళ్లడానికి ప్రయత్నించగా పోలీసులు అక్కడికి చేరుకొని అడ్డుకున్నారు.



హైదరాబాద్ జట్టు జెర్సీని ఆవిష్కరిస్తున్న అభిషేక్

పోచంపల్లి మోడల్‌లో హైదరాబాద్ బ్లాక్ హాక్స్ జెర్సీ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ప్రైమ్ వాలీబాల్ లీగ్ సీజన్-4లో బరిలోకి దిగుతున్న హైదరాబాద్ బ్లాక్ హాక్స్ (హెచ్‌బీహెచ్) జట్టు తన కొత్త జెర్సీని ఆవిష్కరించింది. బుధవారం హెచ్‌బీహెచ్ జట్టు యజమాని కంకణాల అభిషేక్ రెడ్డి, ఆ టీమ్ కెప్టెన్ పాలో లూరీ లామోనియర్ జెర్సీని ఆవిష్కరించారు. తెలంగాణ సంస్కృతికి ప్రాధాన్యత ఇస్తూ పోచంపల్లితో చేనేత వస్త్ర కళాకారులు తయారు చేసే ఇక్కత్ ఫ్యాబ్రిక్ ప్రేరణతో హైదరాబాద్ జట్టు జెర్సీని తయారు చేయడం విశేషం. హైదరాబాద్ బ్లాక్ హాక్స్ జట్టుకు రెండు తెలుగు రాష్ట్రాల్లోని వాలీబాల్ అభిమానులు మద్దతు ఇచ్చి ప్రోత్సహించాలని అభిషేక్ రెడ్డి కోరారు.



కేవలం 9, 10 తరగతులకే ప్రీ-మెట్రిక్ స్కాలర్‌షిప్‌లు

● మజ్లిస్ అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ

హైదరాబాద్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): పాఠశాల స్థాయిలో పేదరికం కారణంగా అర్ధాంతరంగా చదువును ఆపివేసే మైనారిటీ వర్గాల విద్యార్థులను చదవుపట్ల ప్రోత్సహించేందుకు ఉద్దేశించిన ప్రీ-మెట్రిక్ స్కాలర్‌షిప్‌లను మోదీ ప్రభుత్వం కేవలం 9,10 తరగతులకే పరిమితం చేసిందని మజ్లిస్ పార్టీ అధ్యక్షుడు, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఆరోపించారు. ఫలితంగా కేంద్రం మైనారిటీ సంక్షేమం కోసం కేటాయించిన నిధుల్లో 2023 నాటికి రూ.4,500కోట్లు విడుదల కాలేదని విమర్శించారు. 2023-24లో సుమారు రూ.600 కోట్లు కేటాయించగా కేవలం రూ.198.23కోట్లు మాత్రమే ఖర్చు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. మైనారిటీ వర్గాల సంక్షేమం కోసం కేటాయించిన నిధులను ఆ వర్గం అభివృద్ధి కోసం ఖర్చు చేయడం లేదని దీంతో మైనారిటీ సంక్షేమ పథకాలు అమలుకు నోచుకోవడం లేదని ఒవైసీ ఎక్స్ వేదికగా ఆరోపించారు.

ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు తెలిపిన నేతలు

రాజేంద్రనగర్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్ పట్టణ ప్రజలకు ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్ విజయ దశమి శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని దేవి శరన్నవ రాత్రి ఉత్సవాల సందర్భంగా అమ్మవారిని వేడుకున్నామన్నారు. ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు తెలిపిన వారిలో రాజేంద్రనగర్, అత్తాపూర్, మైలార్‌దేవపల్లి డివిజన్‌ల కార్పొరేటర్లు పి.అర్చన జయప్రకాశ్, మోండ్ర సంగీత గౌరీశంకర్, తోకల శ్రీనివాస్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్లు టి.ప్రేందాస్‌గౌడ్, కోరని శ్రీలత మహేత్మా, నాయకులు వై.శ్రీధర్, సందీప్, కొమురయ్య, రామేశ్వర్‌రావు, రాఘవేందర్, తదితరులు ఉన్నారు.

బీసీలకు ప్రాధాన్యం

● మాజీ ఎంపీ వి.హనుమంతరావు

హైదరాబాద్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): రానున్న కాలంలో బీసీలకు మంత ప్రాధాన్యం లభిస్తుందని స్థానిక ఎన్నికల్లోనే కాకుండా విద్యా, ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్లు సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వి.హన్మంతరావు అన్నారు. ఎన్నికలకు ముందుగానే 4500కిమీ పాదయాత్ర చేసి రాహుల్ గాంధీ దేశ వ్యాప్తంగా ఉన్న బడుగు బలహీన వర్గాల సమస్యలు స్వయంగా తెలుసుకున్నారని చెప్పారు. బుధవారం హన్మంతరావు గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ, కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కుల, జనగణన చేసి బీసీలకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. కామారెడ్డి బహిరంగ సభలో 42 శాతం బీసీలకు రిజర్వేషన్లు ఇస్తామని కాంగ్రెస్ చెప్పిందని, సీఎం రేవంత్ రెడ్డి చిత్తశుద్ధితో అమలు చేస్తున్నారన్నారు. బీసీలకు అవకాశాలు దక్కకుండా కొంత మంది నేతలు పిటీషన్లు వేసి అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. అయినప్పటికీ మంత్రి పొన్నం, టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్‌గౌడ్ బీసీలకు ప్రత్యేక కార్యాచరణ తీసుకున్నారన్నారు. అసెంబ్లీలో బీజేపీ, బీఆర్ఎస్ మద్దతు తెలిపి.. బయట ధర్నాలు చేస్తున్నాయని విమర్శించారు. 42 శాతం కోసం బీసీలు ఐక్యంగా పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. రానున్న ఎన్నికల్లో బీసీలకే ఎక్కువ ప్రాధాన్యం ఉంటుందని, దీన్ని బీసీలు సొంతం చేసుకోవాలని సూచించారు.

చైనా మాంజా విక్రయిస్తున్న ఇద్దరి అరెస్ట్

● రూ. 7.20 లక్షల మాంజా స్వాధీనం

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): చైనా మాంజా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసిన టాస్క్‌ఫోర్స్ సిబ్బంది అతడి నుంచి రూ.7.20 లక్షల విలువైన చైనా మాంజాను స్వాధీనం చేసుకున్నారు. మంగళ్‌హాట్‌కు చెందిన సుమిత్ సింగ్(31), రాజేష్‌సింగ్ (52) మంగళ్‌హాట్ ప్రాంతంలో పతంగులు, మాంజా దుకాణం నిర్వహిస్తున్నారు. వీరు నిషేధిత చైనా మాంజాను సేకరించి, విక్రయిస్తున్నారు. వీరి దందాపై సమాచారమందుకున్న ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ మంగళ్ హాట్ పోలీసులు కలిసి దుకాణంపై దాడి చేశారు. వీరి నుంచి రూ.7.20 లక్షల విలువైన చైనా మాంజాను స్వాధీనం చేసుకున్నారు. నిందితులిద్దరిపై గతంలో కూడా చైనా మాంజా విక్రయం కేసులున్నాయని పోలీసులు తెలిపారు.

గోదాంలో బాణాసంచా నిల్వ

● నిందితుడి అరెస్ట్

హైదరాబాద్ సిటీ,(ఆంధ్రజ్యోతి): అక్రమంగా గోదాంలో బాణాసంచా నిల్వ చేసిన వ్యక్తిని సౌత్ ఈస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్, అఫ్జల్‌గంజ్ పోలీసులు కలిసి అరెస్ట్ చేశారు. బేగం బజార్‌కు చెందిన మహిపాల్ సింగ్ (23) డీఆర్ కాంప్లెక్స్‌లో గోదాం నిర్వహిస్తున్నాడు. ఇతడి దందాపై సమాచారమందుకున్న సౌత్ ఈస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్, అఫ్జల్‌గంజ్ పోలీసులు గోదాంపై దాడి చేసి, మహీపాల్ సింగ్‌ను అపులోకి తీసుకొని, రూ.6లక్షల విలువైన బాణాసంచాను స్వాధీనం చేసుకున్నారు.

పేట్ల బురుజు ఆస్పత్రిలో సిబ్బంది కొరత!

● ఇబ్బంది పడుతున్న గర్భిణులు ● దృష్టి సారించని వైద్యాధికారులు





చార్మినార్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోనే పేరుగాంచిన ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి పేట్ల బురుజులో సరిపడ సిబ్బంది లేక రోగులు ఇబ్బంది పడుతున్నా రు. నగరంతో పాటు వివిధ రాష్ట్రాలు, జిల్లాల నుంచి అత్యవసర ప్రసవాలకు ఇక్కడికి వస్తుంటారు. ప్రసవం సమయంలో ప్రాణం మీదికొచ్చి వదిలేసిన వారిని కూడా ఇక్కడ సురక్షితంగా ప్రసవం చేసి తల్లీబిడ్డల ప్రాణాలను కాపాడిన ఘటనలు చాలానే ఉన్నాయి. అంతటి పేరుగాంచిన ఆస్పత్రిలో వివిధ డిపార్టమెంట్లలో సరైన సిబ్బంది లేక రోగులకు ఇబ్బందులు తలెత్తుతున్నా యని గర్భిణిలు, వారి సహాయకులు వాపోతున్నారు. ఆస్పత్రిలో ఉండాల్సిన హెల్త్ ఇన్‌స్పెక్టర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఫార్మసిస్టులు అవసరం ఉండగా సగం మందితో నరిపెడుతున్నారు. ల్యాబ్ టెక్నీషన్ కొరత, ఎంపీ హెచ్ఎస్(ఫిమేల్), పీహెచ్ఎన్ పోస్ట్ సైతం ఖాళీలు ఉన్నా యి. ఆస్పత్రిలో డైటీషన్ పోస్ట్ ఖాళీగా ఉంది. దీంతో ఆయా విభాగాలకు వెళ్లే రోగులకు ఖాళీ కుర్చీలే దర్శమిస్తున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకొని ఆస్పత్రిలోని ఖాళీలను భర్తీ చేయాలని రోగులు, సహాయకులు కోరుతున్నారు.


పేట్ల బురుజు ఆస్పత్రి





నృత్యం చేస్తున్న కళాకారులు

మనోహరంగా దేవీ దర్శనం నృత్య రూపకం

రవీంద్రభారతి, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): కూచిపూడి నృత్యాంశాలతో దేవీ దర్శనం కలిగించిన నర్తకులు ప్రేక్షకుల్ని భక్తిభావం పెంపొందించారు. ఆవాహన, జసాని, సంగీతం, నాటక కథ, భజన, శబ్దం అంశాల సమ్మేళనంతో మనోహరంగా ప్రదర్శించి ఆకట్టుకున్నారు. తెలంగాణ సంగీత నాటక అకాడమీ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు రవీంద్రభారతి వేదికగా జరిగిన సంగీత, నృత్యోత్సవం బుధవారం ముగిశాయి. ముగింపు ఉత్సవంలో హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ నాట్య గురువు డాక్టర్ అరుణా భిక్షు శిష్య బృందం దేవీ దర్శనం కూచిపూడి నృత్యాంశాలను ప్రదర్శించారు. శివుడు పంచభూతాల స్వరూపం అని చాటుతూ సాగిన భో శంభో కీర్తనకు నర్తించి అలరించారు. దివంగత భిక్షు రాసిన శ్లోకంతో ప్రారంభమై విశేషంగా ఆసక్తికరంగా సాగింది. అంతకు ముందు సూర్యప్రకాష్, వడ్డి వరలక్ష్మి, శివశంకరరావు స్మారక సేవా సమితి కళాకారులు వీనులవిందుగా అమ్మవారిని స్తుతిస్తూ జానపద భక్తి సంగీతం సమర్పించి కరతాళ ధ్వనులు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో సంగీత నాటక అకాడమీ చైర్ పర్సన్ ఆచార్య డాక్టర్ అలేఖ్య పుంజాల, నాట్య గురువు కళాకృష్ణ, సాంస్కృతి శాఖ మాజీ డైరెక్టర్ హర్షవర్ధన్ తదితరులు పాల్గొని నృత్య కళాకారులను, గాయకులను సత్కరించి అభినందించారు.


మహిషాసురుడిని అంతమొందించే సన్నివేశం

వెంకటేశ్వర కాలనీని సందర్శించిన కార్తీక్‌రెడ్డి

నార్సింగ్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ రాజేందర్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి బుధవారం మణికొండ పురపాలక సంఘం పరిధిలోని వేంకటేశ్వర కాలనీని సందర్శించారు. అనంతరం కాలనీ సంక్షేమ సంఘం సమావేశంలో జరిగిన తోపుటాలో సంబంధం లేని వారిని ఎఫ్ఐఆర్‌లో చేర్చి ఇబ్బందులకు గురి అయిన కుటుంబాలను కార్తీక్‌రెడ్డి పరామర్శించారు.


మాట్లాడుతున్న పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి


● అక్టోబర్ 2 నుంచి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో జరుగనున్న 53వ రామాయణ్ మేళాలో ముఖ్యఅతిథిగా హాజరు కావాలని మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న రామాయణ్ మేళా కన్వీనర్ గోవింద్ రాఠీ, గిరిధర్‌లాల్
- అఫ్జల్‌గంజ్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి)


● 3వ బాబయ్య రెజ్లింగ్ చాంపియన్‌షిప్ టోర్నమెంట్ టైటిల్ విజేతకు హరియాణా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ వెండి, గదను బహూకరించారు. కార్యక్రమంలో హైదరాబాద్ రెజ్లింగ్ అసోసియేషన్ చైర్మన్ గడ్డం శ్రీనివాస్ యాదవ్, జ్ఞానేశ్వర్, యోగేశ్వర్‌దత్తు, పహిల్వాన్లు సంతోష్, ఆనంద్, అభిమన్యు, గులాబ్‌సింగ్ పాల్గొన్నారు.
- మంగళ్‌హాట్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో దుర్వాసన

పహాడీషరీఫ్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): మల్లాపూర్‌లోని ప్రభుత్వ పాఠశాల ఆవరణంలో దసరా పండుగ జరుపుకొనే ప్రాంతం. పాఠశాల పరిసర ప్రాంతాలు దుర్వాసనతో నిండి కుళ్లిపోయిన పదార్థాలతో ఉండడంతో భక్తులు తీవ్ర అసౌకర్యం కలిగిస్తోందని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బీజేపీ అధ్యక్షుడు రాళ్లగూడెం రామకృష్ణారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. హిందువుల పండుగల సందర్భంగా కార్పొరేషన్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వెంటనే సంబంధిత అధికారులు పరిసరాలను శుభ్రం చేసి భక్తుల సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వరికుప్పల కిరణ్, రాజ్‌పవన్ పటేల్, నవారు రోహిత్ రెడ్డి, వినోద్ తదితరులు పాల్గొన్నారు.


అపరిశుభ్రంగా ఉన్న మల్లాపూర్ ప్రభుత్వ పాఠశాల ప్రాంగణం









కనుల పండువగా శరన్నవరాత్రి ఉత్సవాలు

● ఆయుధ పూజ



విజయదశమి సందర్భంగా కాచిగూడలోని సాయికృష్ణ న్యూరో ఆస్పత్రిలో బుధవారం యాజమాన్యం, వైద్య సిబ్బంది ఆయుధ పూజ, దుర్గామాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆస్పత్రి ఎండీ డాక్టర్ జి.రాంరెడ్డి, డాక్టర్ పి.జి.రెడ్డి, డాక్టర్ విద్యాసాగర్‌రెడ్డి, డాక్టర్ అనిల్, డాక్టర్ చంద్రకాంత్, డాక్టర్ శరత్‌చంద్ర, డైరెక్టర్లు, వైద్యులు పాల్గొన్నారు.

- బర్కత్‌పుర, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి)



మహిషాసుర మర్దని దేవి అలంకరణలో ఉప్పుగూడ మహంకాళి అమ్మవారు

- చాంద్రాయణగుట్ట, (ఆంధ్రజ్యోతి)



గోషామహల్ నియోజకవర్గం ఉస్మాన్‌గంజ్ యూత్ కాంగ్రెస్ నాయకుడు శివ ఆధ్వర్యంలో జరిగిన పూజలో పాల్గొన్న తెలంగాణ ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ సాయికుమార్

- గోషామహల్, (ఆంధ్రజ్యోతి)



బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ సభ్యుడు పెరిక సురేశ్ గృహంలో జరిగిన పూజలో పాల్గొన్న రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్

- అఫ్జల్‌గంజ్, (ఆంధ్రజ్యోతి)



శివరాంపల్లిలో అమ్మవారిని దర్శించుకున్న రాజేంద్రనగర్ కార్పొరేటర్ అర్చన జయప్రకాశ్



మహిషాసుర మర్దని రూపంలో దర్శనం ఇస్తున్న జమ్మిచెట్టు దుర్గామాత



చార్మినార్ భాగ్యలక్ష్మి ఆలయం వద్ద అమ్మవారి పల్లకిసేవ ఊరేగింపు దృశ్యం

● అన్నదానం



దసరా నవరాత్రుల సందర్భంగా మల్లాపూర్‌లో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న పీసీసీ కార్యదర్శి ఏలిమేటి అమరేందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ బొర్ర జగన్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ పోరెడ్డి వెంకట్ రెడ్డి, వరికుప్పల వెంకటేష్, వంగేటి మధుసూదన్ రెడ్డి, తదితరులు

- పహాడిషరీఫ్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి)



విజయదశమి సందర్భంగా పేదలకు నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న టీపీసీసీ కార్య నిర్వాహక కార్యదర్శి పర్వతాల రాజేందర్

ఎక్సైజ్ కార్యాలయంలో...

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయంలోని శ్రీలలితా త్రిపుర సుందరి ఆలయంలో తొమ్మిది రోజులపాటు శరత్ నవరాత్రుల ఉత్సవాలు ఘనంగా జరిగాయి. చివరి రోజు ఆలయ ప్రాంగణంలో గణపతి హోమం పూర్ణాహుతి నిర్వహించి అమ్మవారికి ప్రత్యేక అలంకరణ పూజలు నిర్వహించారు. అనంతరం కార్యాలయం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు, అసిస్టెంట్ కమిషనర్ ప్రణవి, శంషాబాద్ ఎక్సైజ్ ఈఎస్ కృష్ణప్రియ, సరూర్ నగర్ ఈఎస్. ఉజ్వలరెడ్డి, అడిషనల్ కమిషనర్ సయ్యద్ యాసిన్ ఖురేషి, జాయింట్ కమిషనర్ రాథోడ్ సురేష్, రంగారెడ్డి డీసీ దశరథ్ పాల్గొన్నారు.

మహిషాసుర మర్ధినిదేవీగా దర్శనం

రాజేంద్రనగర్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో దేవీ దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు కనుల పండువగా జరిగాయి. ఆలయాలు, బస్తీల్లో అమ్మవారిని భక్తిశ్రద్ధలతో పూజిస్తున్నారు. రాజేంద్రనగర్ హరిహర క్షేత్రంలో బుధవారం అమ్మవారు మహిషాసుర మర్ధినిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ పుజారి అనంతాచార్యులు ఆధ్వర్యంలో సామూహిక లలితా సహస్రపారాయణం నిర్వహించారు. గురువారం రాజరాజేశ్వరీ దేవీ అలంకరణ, దసరా వేడుకలను నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.



హరిహర క్షేత్రంలో మహిషాసుర మర్దినిదేవిగా భక్తులకు దర్శనమిచ్చిన అమ్మవారు

భాగ్యలక్ష్మి అమ్మవారి పల్లకీ సేవ

చార్మినార్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): దసరా శరన్న నవరాత్రుల్లో భాగంగా బుధవారం చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారి పల్లకీ సేవ ఘనంగా నిర్వహించారు. అమ్మవారి పల్లకీ సేవ భాగ్యలక్ష్మి ఆలయం నుంచి ప్రారంభమై చౌక్ మైదాన్, పంజెష, గుల్జర్ హౌస్, ఘన్సీ బజార్, హైకోర్టు, మదీనా, గుండా భాగ్యలక్ష్మి ఆలయానికి చేరుకొంది. వివిధ దేవతా మూర్తుల వేశధారణ ఎంతో అక్కట్టుకుంది. భాగ్యలక్ష్మి ఆలయం నిర్వాహకులు భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేశారు. చార్మినార్ పోలీసులు భారీ బందోబస్త్ ఏర్పాట్లు చేశారు.

'బాస్' ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు



చంద్రశేఖర్ శర్మ సిద్ధాంతిని సన్మానిస్తున్న బాస్ సంస్థ ప్రతినిదులు

అఫ్జల్‌గంజ్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): భాగ్యనగర్ అయ్యప్ప సేవా సమితి (బాస్) నూతన కార్యవర్గం ఇటీవల నియమితులైన సందర్భంగా మంగళవారం వర్గల్ శ్రీవిద్యా సరస్వతి ఆలయంలో సరస్వతి దేవి అమ్మవారికి దేవీ శరన్నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రధానపూజారి చంద్రశేఖర్ శర్మ సిద్ధాంతిని సన్మానించారు. కార్యక్రమంలో బాస్ అధ్యక్షుడు మేడిశెట్టి రాకేశ్, ప్రధాన కార్యదర్శి భద్రేశ్వర్, సీఏ అనిల్ నాయర్, బాస్ సంస్థ ప్రతినిధులు జగదీష్, నర్సింగ్‌రావు, శ్రీహరి, కె.సంతోష్, ఎ.అశోక్, రోహిత్, దుర్గాప్రసాద్, నరేశ్‌కుమార్, వై.సంతోష్ పాల్గొన్నారు.

పత్తికుంట కొలన్‌ను శుభ్రం చేయని కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి : బీజేపీ



నరేందర్ గౌడ్‌కు సమస్యను వివరిస్తున్న బీజేపీ నాయకులు శ్రీధర్, మల్లేశ్ యాదవ్

రాజేంద్రనగర్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్ హనుమాన్‌నగర్ పత్తికుంట వద్ద ఉన్న కొలన్‌ను శుభ్రం చేయకపోవడంతో బతుకమ్మలు వేయడానికి మహిళలు తీవ్ర ఇబ్బంది పడ్డారని బీజేపీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీదర్, ఆ పార్టీ రాజేంద్రనగర్ నియోజకవర్గ కన్వీనర్ పి.మల్లేశ్ యాదవ్, ఆపార్టీ రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షుడు పసుపుల సందీప్ ముదిరాజ్ అన్నారు. వినాయక నిమజ్జనాల సందర్భంగా పత్తికుంట కొలన్‌ను శుభ్రం చేసే పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్ సరిగ్గా పనులు చేయకపోవడంతో ఈ సమస్య ఏర్పడిందని గుర్తు చేశారు. ఇదే విషయమై రాజేంద్రనగర్ సర్కిల్ ఇంజనీరింగ్ విభాగం ఈఈ నరేందర్ గౌడ్‌ను కలిసి విన్నవించామని, డిప్యూటీ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశామన్నారు. వినాయక నిమజ్జనాల సందర్భంగా కొలన్‌ను శుభ్రం చేసే కాంట్రాక్టు పొందిన వ్యక్తి వినాయక విగ్రహాలను తీయకుండానే పనులు వదిలివేశాడని, దాంతో కొలనులో మట్టి, సీకులు అలానే ఉన్నాయన్నారు. వాటిని పూర్తిగా తీసివేసి బతుకమ్మలను నిమజ్జనం చేయడానికి మంచినీటితో నింపాలని అధికారులను కోరినా, వారు పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. పత్తికుంట కొలనువద్ద కాంట్రాక్టు పొంది పనిచేయని వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని దక్షిణ మండలం జోనల్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్, ఈఈలను కోరారు. అధికారులను కలిసిన వారిలో బీజేపీ నాయకులు కోరని సదానంద్, బండారి బాలక్రిష్ణ, పి.రవీందర్, వేణుగోపాల్ తదితరులు ఉన్నారు.

అనుమానాస్పద స్థితిలో యువతి ఆత్మహత్య



బండారు యశిక

రాజేంద్రనగర్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్ సర్కిల్ హైదర్‌గూడ బస్తీలో బుధవారం యువతి తన గదిలో ఫ్యానుకు చున్నీతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కారణాలు తెలియరాలేదు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. హైదర్‌గూడకు చెందిన బండారు రమేశ్ కూతురు బండారి యశిక(29) విదేశాలలో ఉన్నత విద్యనభ్యసించారు. ప్రస్తుతం నగరంలో సాఫ్ట్‌వేర్‌గా మంచి ప్యాకేజీలో ఉద్యోగం చేస్తున్నారు. బుధవారం మధ్యాహ్నం హైదర్‌గూడలోని తమ నివాసంలో తన గదిలో ఫ్యాన్‌కు చున్నీతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు ధృవీకరించారు. కేసు నమోదు చేసుకున్న రాజేంద్రనగర్ పోలీసులు మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

సంపులో పడి మహిళ మృతి



మృతి చెందిన అనిత

రాజేంద్రనగర్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): నీటి సంపులో పడి మహిళ మృతి చెందింది. ఈ సంఘటన బుధవారం సాయంత్రం లక్ష్మీగూడ వాంబే కాలనీలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. లక్ష్మీగూడ వాంబే కాలనీకి చెందిన రాములు భార్య అనిత(48) ప్రమాదవశాత్తు నీటి సంపులో పడి మృతి చెందింది. మైలార్‌దేవుపల్లి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. అనిత మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తలరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దుండిగల్ ఎయిర్‌ఫోర్స్ అకాడమీ పేరుతో ఆర్డర్ ఇచ్చి..

● వ్యాపారవేత్త నుంచి రూ.2.26 లక్షలు కాజేసిన సైబర్ నేరగాళ్లు

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎయిర్‌ఫోర్స్ అకాడమీ అధికారినంటూ వ్యాపారవేత్తను సంప్రదించిన సైబర్ నేరగాడు ఆర్డర్ పేరు చెప్పి రూ.2.26 లక్షలు కాజేశాడు. నగరానికి చెందిన కంపోస్టబుల్ మ్లచ్ షీట్స్ (నేలలో తేమ నిలుపుతూ, గడ్డి పెరగకుండా నిరోధించే) తయారీ సంస్థ ఎండీని సైబర్ నేరగాడు సెప్టెంబరు 18న ఫోన్‌లో సంప్రదించాడు. తనపేరు కునాల్ అని దుండిగల్ ఎయిర్‌ఫోర్స్ అకాడమీలో అధికారినని పరిచయం చేసుకున్నాడు. తమకు ఒక టన్ను కంపోస్టబుల్ మ్లచ్ షీట్స్ సరఫరా చేయాలని కోరాడు. దానికి సంబంధించి నకిలీ జీఎస్‌టీ, ఇతర పత్రాలను వాట్సప్ ద్వారా పంపాడు. తర్వాత ఆర్డర్ డెలివరీ చేయకముందు వెండర్ రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు పంపాలని కోరాడు. తర్వాత వివిధ పన్నులు, రీఫండ్ పేరుతో రూ.2.26 లక్షలు వేర్వేరు ఖాతాలకు బదిలీ చేయించుకున్నాడు. ఇంకా డబ్బు డిమాండ్ చేయడంతో మోసపోయానని గ్రహించిన బాధితుడు సైబర్‌క్రైం పోలీసులకు పిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న సైబర్ క్రైం అధికారులు దర్యాప్తు ప్రారంభించారు.



బతుకమ్మ వేడుకల్లో పాల్గొని రంగురంగుల పూలతో బతుకమ్మలు పేర్చి ఆడి పాడిన సామాజిక కార్యవర్గ ఆర్.సంతోషి, ఆర్.వైష్ణవి

- హిమాయత్‌నగర్, ఆంధ్రజ్యోతి



శివరాంపల్లిలో బతుకమ్మ ఆడుతున్న కార్పొరేటర్ అర్చన



సద్దుల బతుకమ్మను పురస్కరించుకొని గోషామహల్ డివిజన్‌లో చాక్నావాడి బస్తీలో బీఆర్ఎస్ నాయకులు సురేశ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొని ఆడిపాడారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు దత్తు తదితరులు పాల్గొన్నారు.

- గోషామహల్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి)



హైదర్‌గూడ వద్ద బతుకమ్మలతో మహిళలు



పెద్ద తాళ్లకుంట వద్ద బతుకమ్మ ఆడుతున్న మహిళలు

రాజేంద్రనగర్, అక్టోబరు 2(ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్ సర్కిల్ హైదర్‌గూడ ప్రణవ భక్త సమాజం ఆధ్వర్యంలో రంగురంగు పూలతో అలంకరించిన సద్దుల బతుకమ్మలను మహిళలు పెద్ద తాళ్లకుంటలో వదిలారు. అత్తాపూర్ కార్పొరేటర్ మోండ్ర సంగీత గౌరీశంకర్, బీజేపీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి ఎం.కొమురయ్య మహిళలకు బతుకమ్మ, దసరా శుభాకాంక్షలు తెలియజేశారు.



సద్దుల బతుకమ్మ సందర్భంగా హైదర్‌గూడలో బతుకమ్మతో మహిళ

వాడవాడలా సద్దుల బతుకమ్మ సంబురం

పహాడిషరీఫ్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): తొమ్మిది రోజుల ఉత్సవాలు సద్దుల బతుకమ్మతో ముగిశాయి. ఎంగిలిపూల బతుకమ్మతో ప్రారంభమైన బతుకమ్మ ఉత్సవాలు సోమవారం రాత్రి, మంగళవారం సద్దుల బతుకమ్మతో ముగిశాయి. మామిడిపల్లి, పహాడిషరీఫ్, జల్‌పల్లిలో మహిళలు బతుకమ్మ సంబురాలను ఘనంగా జరుపుకొన్నారు. ప్రకృతిని ఆరాధిస్తూ పూలను పూజించే ఏకైక పండుగ బతుకమ్మ. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మ పండుగ ఉత్సవాలు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా తీరొక్క పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలను మహిళలు ఒక చోట చేర్చి ఆటపాటలతో ఉత్సాహంగా గడిపాడు. 'చిత్తూ చిత్తుల బొమ్మ శివుని ముద్దుల గువ్వ' 'ఏక్కేసి పువ్వేసి చందమామ.. ఒక్క జాములాయే చందమామ' అంటూ బతుకమ్మల చుట్టూ మహిళలు ఆడుతూ పాడిన పాటలు శివారు గ్రామాల్లో మారుమోగాయి. ఈసందర్భంగా ఆయా గ్రామాల్లో జల్‌పల్లి బడంగ్‌పేట్ నగరపాలక సంస్థ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ముఖ్యమైన చౌరస్తాల్లో ఏర్పాటు చేసిన విద్యుత్ కాంతులు బతుకమ్మ ఉత్సవాలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ప్రధాన కూడళ్లలో జరిగిన బతుకమ్మ ఉత్సవాల్లో స్థానిక మాజీ ప్రజా ప్రతినిధులు పాల్గొని మహిళలకు బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు. చెరువులు కుంటలు, పలుచోట్ల ఏర్పాటు చేసిన నీటి తొట్టెలో బతుకమ్మలను వదిలి ప్రసాదాలు పంపిణీ చేసుకున్నారు.



మామిడిపల్లిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన మహిళలకు బహుమతులు అందజేసిన నిర్వాహకులు

మామిడిపల్లిలో మహిళలకు బహుమతులు

మామిడిపల్లిలో బతుకమ్మలతో వచ్చిన మహిళకు బహుమతులు అందజేశారు. అందంగా అలంకరించిన బతుకమ్మలను ఎంపిక చేసి మొదటి బహుమతి రూ.3వేలు, 2వ బహుమతి రూ2వేలు, మూడో బహుమతి రూ.1000, ఇద్దరు చిన్నారులకు సైతం బహుమతులను నిర్వాహకులు, లాల్ సతీష్ గౌడ్, కళ్లెం నరేష్‌గౌడ్, జి గణేష్ గౌడ్ అందజేశారు.



మామిడిపల్లిలో హనుమాన్ ఆలయం వద్ద బతుకమ్మ ఆడుతున్న మహిళలు



పహాడిషరీఫ్ హనుమాన్ ఆలయం వద్ద బతుకమ్మ ఆడుతున్న మహిళలు

వర్షం పడితే వరదే!

- పాతబస్తీలోని లోతట్టు ప్రాంతాలకు భారీగా వరద నీరు
- తీవ్ర ఇబ్బందుల్లో స్థానికులు

చాంద్రాయణగుట్ట, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): వర్షం వచ్చిందంటే చాలు లోతట్టు ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సిందే. రాజన్నబావి, శివగంగానగర్, ఛత్రినాక చౌరస్తా, హనుమాన్‌నగర్, అయోధ్యానగర్లలో వరద నీటి సమస్య పరిష్కారానికి రాజన్నబావి నుంచి చేపట్టిన ఎస్ఎన్‌డీపీ పనులు సగం వరకే చేపట్టారు. దీంతో దిగువ బస్తీల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 35 సంవత్సరాల క్రితం అప్పటి జనాభాకు అనుగుణంగా నాలుగు ఫీట్ల వెడల్పు, నాలుగు ఫీట్ల పొడవుతో రాతి కట్టడంతో నిర్మించిన ఈ నాలా ప్రస్తుతం ఏ మాత్రం సరిపోవడం లేదు. వర్షాలు కురిసిన సమయంలో వర్షం నీరు మాత్రమే వెళ్లేలా నిర్మితమైన ఈ నాలాలోకి కాలక్రమేణ పూర్తిగా డ్రైనేజీ లైన్లను కలిపేశారు. దీంతో నాలా పూడుకుపోయి వర్షపు నీరు పూర్తిగా రోడ్లపై పారుతోంది. వట్టెపల్లి, ఫలక్‌నుమా, గాంధీనగర్, రాజన్నబావి ప్రాంతాల నుంచి వచ్చే వరదనీరు మొరంబావి, శివగంగానగర్ మీదుగా ఛత్రినాక వరకు పెద్దఎత్తున పారుతోంది. ఈ వరద ధాటిలో వాహనాలు సైతం కొట్టుకుపోతున్నాయంటే సమస్య తీవ్రత ఏ స్థాయిలో ఉందో తెలుసుకోవచ్చు. స్థానికులు పలుమార్లు అధికారులను కలిసి విన్నవించడంతో రాజన్నబావి నుంచి మొరంబావి వరకు నాలా విస్తరించి బాక్స్ డ్రెయిన్‌ను నిర్మించారు. ఈ పనులు పూర్తయి ఏళ్లు గడుస్తున్నా, మొరంభావి నుంచి ఛత్రినాక వరకు పనులను ప్రారంభించలేదు.



ఛత్రినాక ప్రధాన చౌరస్తాలో కొట్టుకుపోయిన బీటీ రోడ్డు



శివగంగానగర్‌లో పారుతున్న వరద నీరు (ఫైల్)

నాలాను విస్తరించాలి



ఛత్రినాక నుంచి లలితా బాగ్ వరకు నాలాను విస్తరించాలి. నాలుగు ఫీట్ల నాలా మాత్రమే ఉండటంతో ఈ పరిస్థితి నెలకొంది. లలితాబాగ్ వద్ద నీరు వెళ్లడానికి ఔట్ లెట్ సరిగ్గా లేదు. దాని సరిచేయాలి. నాలా పూడికతీత పనులు చేపట్టాలి.

- శివ చంద్రగిరి, హనుమాన్‌నగర్

వర్షం పడినప్పుడు గ్రేటర్ కమిషనర్ ఛత్రినాకలో పర్యటించాలి



చిన్నపాటి వర్షానికే చాంద్రాయణగుట్ట నియోజకవర్గం శివగంగానగర్ చెరువుగా మారుతోంది. నాలాను విస్తరించాల్సిన అవసరం ఉంది. ఈ విషయమై గ్రేటర్ కమిషనర్, జోనల్ కమిషనర్ కు ఫిర్యాదు చేశాం. వర్షం పడినప్పుడు గ్రేటర్ కమిషనర్ పాత బస్తీలో పర్యటిస్తే సమస్య అర్థమవుతుంది.

- పొన్న వెంకటరమణ, బీజేపీ నాయకుడు

క్షేత్రస్థాయిలో పారిశుధ్య పర్యవేక్షణను బలోపేతం చేయాలి

● జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): క్షేత్రస్థాయిలో పారిశుధ్య కార్యక్రమాలు ప్రభావవంతంగా జరిగేలా పర్యవేక్షణను బలోపేతం చేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్ అధికారులను ఆదేశించారు. ఖైరతాబాద్ జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో పారిశుధ్య కార్యక్రమాల అమలుపై కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్, ఏసీ శానిటేషన్ రఘు ప్రసాద్‌తో సమీక్ష నిర్వహించారు.

ప్రైమరీ కలెక్షన్‌లో ఉన్న లోటుపాట్లు, జీవీపీ క్లియరెన్స్, అదనపు బిన్ల ఏర్పాటు, చెత్త సేకరణలో ఉన్న సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో శానిటేషన్ కార్యక్రమాలు ప్రభావవంతంగా చేపట్టేందుకు అధికారులు పర్యవేక్షణ పెంచాలన్నారు. చెత్త సేకరణ వాహనాలపై పర్యవేక్షణ ఉండాలని, దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి చేసిన పనులను పరిశీలించి, ప్రతిపాదిత నిర్మాణాత్మక పరిష్కారాలను కమిషనర్ సమీక్షించారు. నగరంలో స్వచ్ఛత కార్యక్రమాలు మరింత మెరుగుపడాలని, జవాబుదారీతనం, సమయానుకూల చర్యలు, పర్యవేక్షణ పెంచాలని అధికారులను ఆదేశించారు.

నేడు విజయ దశమి

దుర్గా నవరాత్రులు

నేటి అలంకారం
శ్రీ రాజరాజేశ్వరీదేవి

ఆశ్వయుజ శుద్ధ దశమి (విజయదశమి) గురువారం

విజయవాడ ఇంద్రకీలాద్రిపై వెలసిన కనకదుర్గమ్మ వారు శరన్నవరాత్రి మహోత్సవాల్లో చివరి రోజైన విజయదశమి నాడు శ్రీ రాజరాజేశ్వరీదేవిగా దర్శనమిస్తారు. సకల భువన బ్రహ్మాండాలకు అధిదేవత ఆమె. షోడశ మహామంత్ర స్వరూపిణి అయిన అమ్మను మహాత్రిపుర సుందరిగా, అపరాజితాదేవిగా భక్తులు ఆరాధిస్తారు. అపరాజితాదేవి పేరు మీద 'విజయదశమి' ఏర్పడింది. విజయాన్ని సాధించింది కాబట్టి 'విజయ' అని అంటారు. పరమ శాంత స్వరూపంతో, చిరునవ్వులు



చిందిస్తూ, చెరుకుగడ చేతితో పట్టుకుని ఆమె దర్శనమిస్తుంది. మణిద్వీపంలో శ్రీపురంలో నివాసం ఉండే ఆమెను 'చింతామణి'గా పిలుస్తారని ప్రతీతి. పరమేశ్వరుడి అంకం ఆసనంగా... ఇచ్ఛా, జ్ఞాన, క్రియా శక్తులను భక్తులకు అనుగ్రహిస్తుంది. యోగమూర్తిగా మాయామోహిత మానవ చైతన్యాన్ని ఉద్దీపనం చేస్తుంది. అనంత శక్తి స్వరూపమైన శ్రీ చక్రానికి ఈ తల్లి అధిష్ఠాన దేవత. ఆమెను కొలిస్తే సమస్త శక్తులూ సమకూరుతాయనీ, ఆ అమ్మ భక్తుల కోరికలను నెరవేరుస్తుందనీ, మనసారా కొలిస్తే బ్రహ్మజ్ఞానం కలుగజేస్తుందనీ నమ్మిక. అమ్మవారిని ఎరుపు రంగు గాజులతో అలంకరించి, కుంకుమార్చన చేయడం శ్రేష్ఠం.

నైవేద్యం : పరమాన్నం, ఆరు రుచులతో కూడిన (షడ్రసోపేత) పదార్థాలు

అలంకరించే చీర రంగు : ఆకుపచ్చ, తెలుపు

అర్చించే పూల రంగు : ఎరుపు

పారాయణ చెయ్యాల్సింది : లలితా సహస్రనామం

అర్చన: ఎర్రటి గాజులతో అలంకరించి, కుంకుమార్చన

పర్వదినం

నమామి దుర్గా...



ఈ జగత్తును నడిపించేది కంటికి కనిపించని ఒక మహా శక్తి. ఆ మహా శక్తికి వెయ్యికి పైగా నామాలు ఉన్నాయి. చైతన్య స్వరూపిణి అయిన ఆమె అంతటా ఉంది, అందరిలోనూ ఉంది. ఆమె నిర్గుణ, నిరాకార, నిరంజన పరమేశ్వరి. ప్రకృతి మాతగా తన సంతానాన్ని, రక్షిస్తోంది, పోషిస్తోంది. ఆమె... సరస్వతి, మహాలక్ష్మి మహాదుర్గ... ముగ్గురమ్మల మూలపుటమ్మ. బ్రహ్మ విష్ణు శివాత్మిక. సృష్టి, స్థితి, లయకారిణి. ఇచ్ఛా, జ్ఞాన, క్రియా శక్తుల కలబోత. ఆమెను దుర్గాదేవిగా శరత్కాలంలో పూజించడం దేశమంతటా ఉన్న సంప్రదాయం. ఈ ఆరాధనోత్సవాలు తొమ్మిదిరోజుల పాటు జరుగుతాయి. ఈ నవరాత్రులు శరత్కాలంలో జరుగుతాయి కాబట్టి శరన్నవరాత్రులనీ, దుర్గా దేవికి సంబంధించినవి కాబట్టి దుర్గా నవరాత్రులని, దేవి నవరాత్రులనీ పిలుస్తారు. 'నవ' అంటే తొమ్మిది అని ఒక అర్థం. అది పూర్ణ సంఖ్య. జగన్మాత పూర్ణస్వరూపం అని చెప్పే సంకేతం ఇది. మరొక అర్థంలో 'శరత్' అంటే సంవత్సరం. ఏడాదంతా దేవిని పూజించలేకపోయినా శరన్నవరాత్రులలో ఆరాధిస్తే, సంవత్సరమంతా పూజించిన ఫలం దక్కుతుందంటారు.

'దయ, తృప్తి, శ్రద్ధ, క్షమ, ధ్రుతి, పుష్టి, శాంతి, లజ్జ తదితర గుణాలన్నీ పరాశక్తివే' అని 'చండీ సప్తశతి' పేర్కొంది. మరొక ప్రత్యేకమైన సాత్విక గుణం లలిత. అంటే అతి సుందరమైనది. త్రిభువనాలలో సుందరమైనది. అందుకని ఆమెను 'లలితా త్రిపురసుందరి'గా పూజిస్తారు. సర్వాభీష్ట సిద్ధి ఆశించే దేవతలకు, మానవులకు ఆరాధ్య దేవత లలితా త్రిపుర సుందరి. శరన్నవరాత్రులలో దుర్గను రోజుకొక్క రూపంలో, తొమ్మిది రోజుల పాటు తొమ్మిది నామాలతో అర్చిస్తారు. వారిని 'నవదుర్గలు'గా పూర్వులు పేర్కొన్నారు.

ప్రథమం శైల పుత్రీం ద్వితీయా బ్రహ్మచారిణీ తృతీయా
చంద్రఘంటేతి, కూష్మాండేతి చతుర్థకీ, పంచమాం
స్కందమాతేతి, షష్ఠ్యా కాత్యాయనీతిచ, సప్తమా
కాళరాత్రీతి, మహాగౌరీతిచాష్టమీ,
నవమా సిద్ధిధాత్రీతి, నవదుర్గాః ప్రకీర్తితా...

ఇది దుర్గకు గల నామ, రూపాలను తెలిపే శ్లోకం. శరన్నవరాత్రులలో ఈ రూపాలతో దుర్గాదేవిని పూజిస్తారు. ఈ రూపాల విశిష్టతలను తెలుసుకుందాం.

శైలపుత్రి: హిమవంతుని కూతురు కాబట్టి అమ్మవారికి శైలపుత్రి, హైమవతి, పార్వతి (పర్వత పుత్రిక) అనే నామాంతరాలు ఉన్నాయి. ఆమె వృషభ వాహిని. కోరిన కోర్కెలు తీర్చే తల్లి.

బ్రహ్మచారిణి: దక్షుని కుమార్తె సతీదేవి. తండ్రి చేసిన అవమానం భరించలేక యోగాగ్నిలో తనువు చాలించింది. నారదుని ఉపదేశంతో గత జన్మ వృత్తాంతాన్ని తెలుసుకొని, శివుణ్ణే పతిగా పొందాలనే కోరికతో తపస్సు చేయడానికి ఉపక్రమించిన రూపమే బ్రహ్మచారిణి. శివుని కోసం తపస్సు చేయడానికి బ్రహ్మచర్యం అవలంబించింది కాబట్టి 'బ్రహ్మచారిణి' అని పిలుస్తారు. ఆమెను ఆరాధిస్తే చేపట్టిన కార్యాల్లో విజయం చేకూరుతుంది.

చంద్రఘంట: పది చేతుల్లో ఆయుధాలు ధరించి, యుద్ధ సన్నద్ధురాలైన ఈమెను పూజిస్తే ధైర్యంతో పాటు శత్రు జయం లభిస్తుంది.

కూష్మాండ: కూష్మాండ అంటే భూమికి సంకేతం. ఈ విశ్వాన్ని సృష్టించినది అనే అర్థంతో... ఆ పేరుతో పూజలు అందుకుంటోంది. ఆమెకు ఎనిమిది భుజాలు. ఆమెను ఆరాధించడం వల్ల రోగాలు నాశనమై, ఆయురారోగ్యాలు చేకూరుతాయి.

స్కందమాత: స్కందుడికి (కుమారస్వామికి) తల్లి కాబట్టి ఆమెకు 'స్కందమాత' అని పేరు. స్కందమాత శాంతస్వరూపిణి. ఆమెను పూజించడం వల్ల శాంతి, సౌఖ్యం, జ్ఞాన విజ్ఞానాలు లభిస్తాయంటారు.

కాత్యాయని: త్రిమూర్తుల తేజంతో మహిషాసురుణ్ణి మర్దించడం కోసం... కాత్యాయన ముని ఆశ్రమంలో జన్మించి, ఆయనతో పూజలందుకుంది కాబట్టి ఆమెకు 'కాత్యాయని' అనే పేరు వచ్చింది. నాలుగు భుజాలు కలిగిన ఆమెను ఆరాధిస్తే జీవితంలో దుఃఖాలు, బాధలు, కష్టాలు ఉండవని విశ్వాసం.

కాళరాత్రి: నాలుగు భుజాలతో, నల్లని దేహంతో... గార్దభ వాహనాన్ని అధిరోహించి, వరద, అభయ ముద్రలతో భక్తులను ఆమె అనుగ్రహిస్తుంది. ఆమె దుష్టులకు భయంకరి, శిష్టులకు అభయంకరి. కాళరాత్రి అమ్మవారిని పూజిస్తే గ్రహదోషాలు నశించి, జీవన సౌఖ్యం లభిస్తుంది.

మహాగౌరి: నాలుగు భుజాలు కలిగిన ఆమె వరద, అభయ హస్తాలతో భక్తులను కటాక్షిస్తుంది. శ్వేతవర్ణంలో ఉండే ఈ మాతను పూజిస్తే, పాపాలు తొలగిపోతాయి, శుభాలు సమకూరుతాయి.

సిద్ధిధాత్రి: నాలుగు చేతుల్లో శంఖ, చక్ర, గదా, పద్మాలను ధరించి భక్తులను రక్షిస్తుంది. సర్వసిద్ధులను ప్రసాదించే తల్లి కాబట్టి ఆమెను 'సిద్ధిధాత్రి' అంటారు. ఆమెను పూజిస్తే జీవితంలో సుఖ సంతోషాలు నెలకొంటాయి.

ఇలా తొమ్మిది రూపాలతో అర్చనలు అందుకుంటున్న దుర్గాదేవి ఎందరో అసురులను నిర్జించింది. నవరాత్రుల తరువాత... దశమి తిథినాడు దుర్గాదేవిని అపరాజితగా, రాజరాజేశ్వరిగా నుతిస్తూ ఉత్సవాలు జరుపుకొంటారు. ఆ రోజును 'విజయదశమి'గా వ్యవహరిస్తారు.

● ఆయపిళ్ళ రాజపాప

పాలపిట్ట దర్శనం...

దసరా పండుగలో శమీ వృక్షంతో పాటు పాల పిట్టకు ఉన్న ప్రాధాన్యం కూడా ఎక్కువే. పాలపిట్టను పవిత్రంగా భావించడం వెనుక ఉన్న జానపద గాథ ప్రకారం... పాండవులు అరణ్యవాసం, అజ్ఞాతవాసం పూర్తి చేసి తిరిగి వస్తూ ఉండగా, వారికి పాలపిట్ట కనిపించింది. వారు దాన్ని చూసినప్పటి నుంచీ వరుసగా అన్నీ విజయాలే కలిగాయట! పాల పిట్ట దర్శనం వల్ల చేసే ప్రతి పనిలోనూ గెలుపు తప్పకుండా లభిస్తుందన్న విశ్వాసం ఉంది. అందుకే విజయ దశమి రోజున పాలపిట్టను దర్శించడం శుభప్రదంగా భావిస్తారు.



శమీ పూజ...

విజయదశమి రోజున అపరాజితాదేవిని శమీవృక్షం వద్ద పూజించే సంప్రదాయం ఉంది. శమీ వృక్షం (జమ్మి చెట్టు)లో అపరాజితా దేవి కొలువై ఉంటుందని విశ్వాసం. అమ్మవారి సహస్ర నామాల్లో 'అపరాజిత' ఒకటి. అంటే 'పరాజయం లేనిది' అని అర్థం. విజయానికి ఆమె అధిదేవత. 'యా దేవీ సర్వభూతేషు శక్తిరూపేణ సంస్థితా' అని 'అపరాజితా స్తోత్రం' వర్ణించింది. అపరాజితా దేవి సర్వ జీవుల్లో శక్తి రూపంలో ఉంటుందని భావం. దానవీయ గుణాలపై గెలుపు సాధించడానికి మనలో ఉన్న శక్తిని ప్రేరేపించాలని అమ్మవారిని ప్రార్థించాలి. దేవ దానవులు క్షీరసాగర మథనం చేసినప్పుడు ఉద్భవించిన పవిత్రమైన దేవతా వృక్షాల్లో జమ్మి చెట్టు ఒకటి.. అందుకే యాగాల కోసం నిప్పు రాజెయ్యడానికి జమ్మి చెట్టు కలపనే వినియోగించేవారు. రావణ సంహారానికి ముందు శ్రీరాముడు శమీ వృక్షానికీ, అపరాజితా దేవికీ పూజలు ఆచరించాడని పురాణాలు పేర్కొంటున్నాయి. పాండవులు అజ్ఞాతవాసం మొదలుపెట్టడానికి ముందు తమ ఆయుధాలను శమీ వృక్షం మీద దాచారనీ, అజ్ఞాతవాసం ముగిసిన తరువాత వాటిని తిరిగి తీసుకున్నారనీ మహాభారతంలోని విరాటపర్వంలో కథ ఉంది. విజయదశమి రోజున...

శమీ శమయతే పాపం
శమీ శత్రువినాశిని
అర్జునస్య ధనుర్ధారి
రామస్య ప్రియదర్శిని...

అనే శ్లోకం పఠించి, జమ్మి చెట్టు చుట్టూ ప్రదక్షిణలు చేస్తే... అపరాజితాదేవి కటాక్షంతో శత్రు భయం తొలగి విజయం చేకూరుతుందనీ, దోషాలు తొలగిపోయి సకల కార్యసిద్ధి కలుగుతుందనీ పెద్దలు చెబుతారు.

పిల్లలతో ప్రేమగా ఇలా...

పిల్లలను బాధ్యతాయుతంగా తీర్చిదిద్దే క్రమంలో తల్లిదండ్రులు ఎన్నో సవాళ్లను ఎదుర్కోవాల్సి ఉంటుంది. అలాంటప్పుడు తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రేమతో ఎలా దారికి తెచ్చుకోవాలో తెలుసుకుందాం...



- చిన్న పిల్లలు సాధారణంగా పాఠశాలకు వెళ్లకుండా, హోంవర్క్ చేయకుండా మారాం చేస్తూ ఉంటారు. ఆ సమయంలో వాళ్లని కోప్పడకుండా మెల్లగా నచ్చచెప్పాలి. ప్రేమగా బుజ్జగిస్తూ చెపితే పిల్లలు తప్పకుండా మాట వింటారు.
- ఎంత బిజీ షెడ్యూల్ ఉన్నప్పటికీ రోజూ పిల్లలను దగ్గర కూర్చోపెట్టుకుని వాళ్లతో మాట్లాడాలి. బడిలో లేదంటే హోంవర్క్‌కు సంబంధించి ఏమైనా సమస్యలు ఉన్నాయేమో అడిగి తెలుసుకోవాలి.
- పిల్లలు మంచి పని చేసినప్పుడు అది ఎంత చిన్నదైనప్పటికీ మనస్ఫూర్తిగా అభినందించాలి. పరీక్షల్లో మంచి మార్కులు తెచ్చుకున్నప్పుడు, ఆటపాటల్లో బహుమతులు సాధించినప్పుడు ఆనందాన్ని వ్యక్తం చేస్తూ వాళ్లని ప్రోత్సహించాలి.
- వీలైనప్పుడల్లా పిల్లలతో సమయం గడుపుతూ ఉండాలి. వాళ్లతో కలిసి బొమ్మలు గీయడం, ఆటలు ఆడడం లాంటివి చేస్తూ ఉండాలి. అప్పుడే పిల్లల అభిరుచులు, ఆసక్తుల గురించి తెలుసుకునే వీలుంటుంది.
- పిల్లలతో స్నేహంగా ఉండాలి. చీటికి మాటికి కోపాన్ని, అసహనాన్ని ప్రదర్శించకుండా మంచి, చెడు వివరిస్తూ ఉంటే పిల్లలు చక్కని వ్యక్తిత్వాన్ని అలవరచుకుంటారు.
- పిల్లలకు క్రమశిక్షణ, సమయపాలన, వ్యాయామం అలవాటు చేయాలి. తోటివారికి సహాయం చేయడం, పెద్దలను గౌరవించడం, నైతిక విలువల గురించి వాళ్లకి అర్థమయ్యేలా తెలియజేయాలి.
- పిల్లలు ఏ విషయం గురించి అయినా చెబుతుంటే ఓపికగా వినడం అలవాటు చేసుకోవాలి. అప్పుడే వాళ్లు కూడా వినడం, ఆలోచించడం, ఆచరించడం నేర్చుకుంటారు.

అందంగా ఉండాలంటే...

అందంగా కనిపించాలంటే శిరోజాలు, చర్మం, కళ్లు, పెదాలు ఆరోగ్యంగా ఉండాలి. అందుకోసం రోజూ పాటించాల్సిన ఇంటి చిట్కాల గురించి తెలుసుకుందాం...

- రోజూ ఉదయాన్నే అవకాడో ముక్కలు చేర్చిన సలాడ్ తినాలి. సాయంత్రం పూట అవకాడో గుజ్జులో కొద్దిగా తేనె, నిమ్మరసం, బాదం నూనె కలిపిన మిశ్రమాన్ని ప్యాక్‌లా వేసుకుంటే ముఖం కాంతివంతంగా మారుతుంది. స్నానానికి ముందు అవకాడో నూనెతో ఒళ్లంతా మర్దన చేసుకుంటే చర్మం నిగారిస్తుంది.
- కీర దోస రసంలో కాస్త తేనె కలిపిన మిశ్రమాన్ని ముఖానికి పట్టించి వేళ్లతో సున్నితంగా రుద్దాలి. పావుగంట తరవాత మంచినీళ్లతో కడిగేసుకుంటే ముఖానికి మంచి ఛాయ వస్తుంది. చర్మం తేమతో నిండి చక్కగా మెరుస్తూ ఉంటుంది.



- కోడిగుడ్డులోని తెల్ల సొనను నుదుటిమీద, చెంపలకు పట్టించి బాగా ఆరిన తరవాత గోరువెచ్చని నీళ్లతో శుభ్రం చేసుకుంటే చర్మం బిగుతుగా మారుతుంది. ముడుతలు, గీతలు మాయమై ముఖం ప్రకాశవంతంగా కనిపిస్తుంది. ఒక గిన్నెలో కోడిగుడ్డు సొనలు, కొద్దిగా కొబ్బరినూనె, కాస్త నువ్వుల నూనె వేసి బాగా గిలక్కొట్టి తలకు పట్టించాలి. అరగంట తరవాత గోరువెచ్చని నీళ్లతో తలస్నానం చేయాలి. ఇలా రెండు రోజులకు ఓసారి చేస్తూ ఉంటే కుదుళ్లు బలపడి శిరోజాలు నల్లగా ఒత్తుగా పెరుగుతాయి.
- రోజూ పెరుగు లేదా మజ్జిగను ఆహారంలో చేర్చుకోవాలి. దీనివల్ల చర్మం పొడిబారకుండా ఉంటుంది. తరచూ శిరోజాలకు, ముఖానికి పెరుగుతో ప్యాక్ వేసుకుంటూ ఉంటే మంచి ప్రయోజనం కనిపిస్తుంది
- ఒక గిన్నెలో రెండు చెంచాల కలబంద గుజ్జు, చిటికెడు పసుపు, ఒక చెంచా ఆలివ్ లేదా బాదం నూనె వేసి బాగా కలిపి ముఖానికి పట్టిస్తే మొటిమలు, నల్ల మచ్చలు, వైట్ హెడ్స్ బ్లాక్ హెడ్స్ రాకుండా ఉంటాయి.
- బీట్‌రూట్ రసంలో కొద్దిగా తేనె కలిపి రాస్తే పెదాల నలుపుదనం తగ్గుతుంది. కొద్దిగా ఆముదాన్ని తీసుకుని రోజూ కనుబొమ్మలకు రాస్తూ ఉంటే అవి ఒత్తుగా పెరుగుతాయి. పోషకాహారం తీసుకుంటూ సమయానుసారం నిద్రిస్తే కళ్లు ప్రకాశవంతంగా ఉంటాయి.

సంకల్పం



చిన్న వయసులోనే పెళ్లి... అంతలోనే వైధవ్యం... ఒంటరి తల్లిగా చంటి బిడ్డను సాకుతూ... అత్తింటి ఆరళ్లు భరిస్తూ... నిత్యం ఇంటి పనుల్లో మునిగిన ఆమె... ఇప్పుడు డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్. సామాజిక కట్టుబాట్లు... అడుగడుగునా అవమానాలు... గడప దాటనివ్వని అవరోధాలు... కలలు కనే సాహసం కూడా చేయని ఆమె... నేడు తనలాంటి ఎందరికో ఆదర్శంగా నిలిచింది. సాధారణ గృహిణి నుంచి అసాధారణ మహిళగా ఎదిగిన అంజూ యాదవ్ కథ ఇది.

స్వేచ్ఛ కోసం సమరం

"వెనక్కి తిరిగి చూసుకొంటే కష్టాలే కానీ సంతోషమనేది తెలియని జీవితం నాది. హరియాణాలోని చిన్న గ్రామంలో పుట్టిన నేను... ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్నాను. కాలేజీకి వెళ్లి చదువుకొంటానంటే ఇంట్లోవాళ్లు వద్దన్నారు. దాంతో దూరవిద్య ద్వారా డిగ్రీ పూర్తి చేశాను. మాది పేద రైతు కుటుంబం. నాకు పెళ్లి చేసేసి తన బాధ్యత నెరవేర్చుకోవాలని నాన్న అనుకున్నారు. అంతేకానీ నా అభిప్రాయం ఇంట్లో ఎవరూ అడగలేదు. పెద్దల మాట కాదనే ధైర్యం నాకూ లేదు. ఇరవై ఒక్క ఏళ్లకు నా పెళ్లి చేశారు. అత్తింట్లో అడుగుపెట్టింది మొదలు క్షణం తీరిక లేదు. అందరి కంటే ముందుగా నిద్ర లేచేది.. రాత్రి చివరగా నిద్ర పోయేది నేనే. ఈ మధ్యలో నాకంటూ ఓ గంట సమయం దొరికేది కాదు. మరుసటి రోజు సూర్యోదయం కోసం వేచి చూడం తప్ప కలలు కనే స్వేచ్ఛ, సాహసం కూడా చేయలేదు. పడుకొనేముందు అద్దంలో చూసుకొంటే... బాధతో నిండిన కళ్లు, అలసి నిస్సత్తువగా మారిన శరీరం, కట్టుబాట్ల పేరుతో వేసిన బంధనాలు... ఇవే కనిపించేవి. అన్నిటినీ మౌనంగా భరించడం మినహా వేరే దారి లేదు. చుట్టూ అందరూ ఉన్నా... బాధను పంచుకొనేవారు, ఓదార్చేవారు కనిపించరు. పొరపాటున పొద్దున కాస్త ఆలస్యంగా లేచామా... ఎక్కడి పని అక్కడే! ఆ రోజంతా అస్తవ్యస్తమైపోయేది.

ఆ స్వేచ్ఛ లేదు...

ఒకవేళ 'నేను ఫలానా కావాలని అనుకొంటున్నా' అని చెబితే... ఇంట్లో పని భారం రెట్టింపు అయ్యేది. ఆ భయంతో కలలు కనే ధైర్యం చేయలేదు. నేనే కాదు... ముఖ్యంగా గ్రామాల్లో నాలాంటి పేదింటి పిల్లల పరిస్థితి ఇదే. వాళ్లకు అసలు కలలు కనే హక్కు లేదు. కాదని లక్ష్యం దిశగా అడుగులు వేస్తానంటే... అవమానాలు, అవహేళనలే కాదు, గృహ హింసను ఎదుర్కోవడానికి కూడా సిద్ధంగా ఉండాలి. మహాపాపం చేసినట్టు పుట్టింటికి తరిమేస్తారు. ఇవన్నీ ఇక్కడ సాధారణం. నాకు పెళ్లయిన మూడేళ్లకి పిల్లాడు పుట్టాడు. నాలుగేళ్ల కిందట మావారు అనారోగ్యంతో చనిపోయారు.

ఒంటరి తల్లిగా...

ఆయన మరణంతో నేను ఒంటరి అయిపోయాను. నన్ను, నా పిల్లాడిని పోషించేవారు లేరు. ఇంటెడు చాకిరీ చేస్తూ, అవమానాలు భరిస్తూ అత్తింట్లో ఉండదలుచుకోలేదు. ఆ సమయంలోనే నిర్ణయించుకున్నా... ఎలాగైనా నా కాళ్లపై నేను నిలబడి, నా బిడ్డను పెంచి పెద్ద చేయాలని. కానీ అన్ని వైపుల నుంచి అడ్డంకులు ఎదురయ్యాయి. గడప దాటాలంటే ఎన్నో ఇబ్బందులు. బెదిరింపులు. నా లక్ష్యం, నా బిడ్డ భవితవ్యం... వీటి ముందు నాకు ఏవీ పెద్ద సమస్యలుగా అనిపించలేదు. అందుకే అందరినీ ఎదిరించి అడుగు బయటకు పెట్టాను. ఆ సమయంలో నాకు నాన్న అండగా నిలిచారు. చంటి పిల్లాడిని చూసుకొంటూనే చదువు కొనసాగించాను. తరువాత పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యాను.



ఉపాధ్యాయురాలిగా...

అదే సమయంలో ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా ఉద్యోగం వచ్చింది. కానీ పోలీస్ అధికారి కావాలన్నది నా కల. దాని కోసం ఉద్యోగం చేస్తూనే ప్రయత్నించాను. రాత్రి పగలు తేడా లేదు... ఏకైక లక్ష్యంతో కఠోరంగా శ్రమించాను. నా ఆశయం ఒక్కటే... స్వేచ్ఛగా, గౌరవప్రదంగా జీవించడం. అది సిద్ధించడానికి కొన్నేళ్లు పట్టింది. కానీ ఆలస్యమైనా చివరకు కల నెరవేరింది. రాజస్థాన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీసెస్ ఎగ్జామ్స్‌లో విజయం సాధించాను. గత నెలలో రాజస్థాన్ పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (డీఎస్పీ)గా బాధ్యతలు చేపట్టాను. నాడు... ఆశలు, ఆశయాలు, ఆలోచనలను చిదిమేస్తే నిస్సహాయంగా చూస్తూ కూర్చున్న ఒక మహిళను నేను. నేడు... పరిస్థితులను ఎదిరించి, కలల వెంట పరుగెత్తి, సాధించి, ధైర్యంగా నిలబడిన వనితను. నా కథ నాలాంటి మహిళా లోకాన్ని నిద్ర లేపాలి. వారి ఆశయ సాధనకు నేను స్ఫూర్తి కావాలి. అందుకే నా ఈ ప్రయాణాన్ని మీ అందరితో పంచుకొంటున్నా."

కౌన్సెలింగ్

గర్భాశయం జారితే?

డాక్టర్, కొందరికి గర్భాశయం కిందకు జారుతుందని అంటూ ఉంటారు. ఈ పరిస్థితి ఎందుకు తలెత్తుతుంది? మహిళలందరూ ఈ సమస్యను ఎదుర్కొంటారా? దీనికి పరిష్కార మార్గాలు సూచిస్తారా?

\- ఓ సోదరి, హైదరాబాద్

కటి కండరాలు, గర్భాశయానికి దన్నుగా ఉండే లిగమెంట్లు బలహీనపడినప్పుడు ఈ పరిస్థితి తలెత్తుతుంది. సాధారణంగా ప్రసవం కష్టమైనప్పుడు, పురిటినొప్పులు ఎక్కువ సమయం పాటు కొనసాగినప్పుడు, ప్రసవ సమయంలో ఫోర్‌సెప్స్ ఉపయోగించినప్పుడు, బరువు ఎక్కువగా ఉండే పిల్లలు పుట్టినప్పుడు గర్భాశయ లిగమెంట్లు, కటి కండరాలు బలహీనపడతాయి. అయితే ఆ ప్రభావం వల్ల మహిళలు మెనోపాజ్ దశకు చేరుకున్నప్పుడు, కటి కండరాలు, లిగమెంట్లు మరింత బలహీనపడి, గర్భాశయం కిందకు జారే పరిస్థితి తలెత్తుతుంది. వీటని దగ్గు, తుమ్ములు, లేదా మలబద్ధకం, పొత్తికడుపులో కణుతులు ఈ సమస్యను మరింత తీవ్రతరం చేస్తాయి. కొందరు మహిళల్లో స్వతహాగానే కణజాలాలు బలహీనంగా ఉండి, ప్రొల్యాప్స్‌కు దారి తీస్తాయి.

నివారణ ఇలా...

- ప్రసవానంతరం కోర్ కండరాలను వ్యాయామాలతో బలపరుచుకోవాలి
- కష్టతరమైన ప్రసవాలను నివారించుకోవాలి



- దగ్గు, తుమ్ములు, మలబద్ధకాలకు సత్వర చికిత్స తీసుకోవాలి
- అధిక బరువులు లేపకూడదు

చికిత్స ఇలా...

రోగి ప్రధాన లక్షణాలు, వయసుల మీదే చికిత్స ఆధారపడుతుంది. కటి కండరాలను బలపరిచే వ్యాయామాలు చేయడం ద్వారా కొంతమేరకు పరిస్థితిని సరిదిద్దవచ్చు. కొందరికి రింగ్ పెసారీ పరికరం అమర్చవలసి వస్తుంది. కొందరికి సర్జరీతో గర్భాశయాన్ని దాని స్థానంలోకి చేర్చవలసి వస్తుంది. పెద్ద వయస్కుల్లో ల్యాప్రోస్కోపిక్ స్లింగ్ సర్జరీ ద్వారా, వెజైనల్ హిస్టరెక్టమీతో పాటు కటి కండరాలను మరమ్మతు చేయవలసి వస్తుంది.

డాక్టర్ శ్రుతి రెడ్డి పొద్దుటూరు
కన్సల్టెంట్ అబ్‌స్టెట్రీషియన్, గైనకాలజిస్ట్ అండ్ ల్యాప్రోస్కోపిక్ సర్జన్, బర్త్‌రైట్ బై రెయిన్‌బో, హైదరాబాద్.

ప్రభుత్వ ఉద్యోగులకు ఆన్‌లైన్లో 'పే స్లిప్'

హైదరాబాద్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులు తమ నెల జీతానికి సంబంధించిన పే స్లిప్‌లను ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకునే విధానాన్ని రాష్ట్ర ఆర్థిక శాఖ బుధవారం నుంచి అందుబాటులోకి తీసుకొచ్చింది. కొత్త విధానంలో.. జీతం బ్యాంకు ఖాతాలో జమ అయిన వెంటనే ఉద్యోగి మొబైల్ ఫోన్‌కు ఆర్థిక శాఖ నుంచి ఓ మెసేజ్ వస్తుంది. అలాగే, ప్రభుత్వ అధికారిక వెబ్‌సైట్ నుంచి ఉద్యోగి తన పేస్లిప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఈ కొత్త విధానాన్ని అక్టోబరు 1 నుంచి అందుబాటులోకి తెచ్చామని ఆర్థిక శాఖ వర్గాలు వెల్లడించాయి

రాంరెడ్డి దామోదర్‌రెడ్డి కన్నుమూత

అనారోగ్యంతో ఏఐజీలో చికిత్స పొందుతూ మృతి.. ఐదు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన దామోదర్‌రెడ్డి

- తుంగతుర్తి, సూర్యాపేట నియోజకవర్గాలకు ప్రాతినిధ్యం
- ఉమ్మడి రాష్ట్రంలో రెండుసార్లు మంత్రిగా బాధ్యతలు
- 4న తుంగతుర్తిలో అంత్యక్రియలు



హైదరాబాద్/సూర్యాపేట(కలెక్టరేట్), అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి(73) కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న దామోదర్‌రెడ్డి కొంతకాలంగా రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు. ఆరోగ్యం మరింత ఇబ్బందికరంగా మారడంతో కుటుంబసభ్యులు ఆయనను గచ్చిబౌలిలోని ఏఐజీ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ బుధవారం రాత్రి 10 గంటలకు దామోదర్‌రెడ్డి తుదిశ్వాస విడిచారు. ఆయన భౌతిక కాయాన్ని గురువారం కిమ్స్ ఆస్పత్రికి తరలించనున్నారు. అనంతరం శుక్రవారం (ఈ నెల 3న) హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని ఆయన నివాసానికి తరలిస్తారు. అక్కడి నుంచి అదే రోజు సాయంత్రం కార్యకర్తలు, ప్రజల సందర్శనార్థం సూర్యాపేటకు తీసుకెళ్తారు. ఈ నెల 4న సూర్యాపేట జిల్లా తుంగతుర్తిలో అంత్యక్రియలు నిర్వహిస్తారు. కాగా, దామోదర్‌రెడ్డి 1952 సెప్టెంబరు 14న జన్మించారు. వరంగల్‌లోని కాకతీయ యూనివర్సిటీలో బీఎస్సీ విద్యను పూర్తి చేశారు. వ్యవసాయం చేయడానికి ఎక్కువగా ఆసక్తి చూపేవారు. దామోదర్‌రెడ్డికి మాజీ మంత్రి దివంగత రాంరెడ్డి వెంకటరెడ్డి, గోపాల్‌రెడ్డి, క్రిష్ణారెడ్డి సోదరులున్నారు. ఆయన స్వస్థలం ఖమ్మం జిల్లా పాతలింగాల గ్రామం. ఆయనకు కుమారుడు సర్వోత్తమ్‌రెడ్డి ఉన్నారు. దామోదర్‌రెడ్డి భార్య వరూధినీ దేవి కొన్నేళ్ల క్రితం మరణించారు. తన సుదీర్ఘ రాజకీయ జీవితంలో దామోదర్‌రెడ్డి ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. 1985, 1989, 1994, 2004 ఎన్నికల్లో తుంగతుర్తి నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన దామోదర్‌రెడ్డి.. ఆ తరువాత నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణతో సూర్యాపేటకు మారారు. 2009 ఎన్నికల్లో సూర్యాపేట నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక కూడా వరుసగా 2014, 2018, 2023 ఎన్నికల్లో సూర్యాపేట నుంచి దామోదర్‌రెడ్డి పోటీ చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రెండు సార్లు మంత్రిగా పని చేశారు. 1991 నుంచి 1992 వరకు రాష్ట్ర భూగర్భజలవనరుల శాఖ మంత్రిగా పని చేశారు. అనంతరం 2008 నుంచి 2009 వరకు వైఎస్ఆర్ మంత్రివర్గంలో ఐటీ శాఖ మంత్రిగా పని చేశారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా రాజకీయాల్లో దామోదర్‌రెడ్డి చెరగని ముద్ర వేశారు. నల్లగొండ జిల్లా కాంగ్రెస్ పార్టీలో దామోదర్‌రెడ్డి మాటకు చాలా విలువనిచ్చేవారు. అన్ని పార్టీల నాయకులు, ప్రజలు ఆయనను 'టైగర్ దామన్న' అని పిలిచేవారు. దామోదర్‌రెడ్డి మృతి పట్ల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. దామోదర్‌రెడ్డి మరణం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు అని పేర్కొన్నారు. మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు సంతాపం వ్యక్తం చేశారు.

కాంగ్రెస్ ప్రభుత్వానికి పోయేకాలం వచ్చింది!

- దసరాకు సర్కారు ఉద్యోగులకు నిరాశే మిగిలింది
- 5 పెండింగ్ డీఏలను తక్షణమే ఇవ్వాలి : హరీశ్‌రావు



సిద్దిపేట, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): అన్ని వర్గాల పట్ల సీఎం రేవంత్‌రెడ్డి అనుసరిస్తున్న తీరు అన్యాయమని.. కాంగ్రెస్ ప్రభుత్వానికి పోయే కాలం దగ్గర పడిందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ధ్వజమెత్తారు. దసరా పండుగ నేపథ్యంలో కేంద్ర ఉద్యోగులకు 3 శాతం డీఏ పెంచితే, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు మాత్రం నిరాశే మిగిలిందన్నారు. కాంగ్రెస్‌ది అభయ హస్తం కాదని భస్మాసుర హస్తమని మరోసారి నిరూపితమైందని విమర్శించారు. బుధవారం సిద్దిపేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్‌తో కలిసి మీడియాతో హరీశ్ మాట్లాడారు. ప్రభుత్వ ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న 5 డీఏలను తక్షణమే విడుదల చేయాలన్నారు. 15 నెలల నుంచి ఉద్యోగుల వేతనాల నుంచి పెన్షన్ కోసం కట్ చేసిన కాంట్రిబ్యూటరీ ఫండ్‌ను ప్రభుత్వం వాడుకుందని, రూ.5,500 కోట్ల కాంట్రిబ్యూటర్ పెన్షన్ డబ్బులను రాష్ట్ర ప్రభుత్వం మళ్లించిందని ఆరోపించారు. బతుకమ్మకు ఆడబిడ్డలకు చీరల్లేవని, రైతులకు యూరియా, సన్న వడ్లకు బోనస్, నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతి, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, విద్య భరోసా కార్డు ఎక్కడని నిలదీశారు. గోధుమల మద్దతు ధరను పెంచిన కేంద్రం.. దక్షిణాదిలో ఎక్కువగా పండించే వరికి అన్యాయం చేసిందని మండిపడ్డారు. తెలంగాణ నుంచి ఇద్దరు కేంద్ర మంత్రులు, 8 మంది బీజేపీ ఎంపీలు కేంద్రంపై ఒత్తిడి తెచ్చి వరికి మద్దతు ధర పెంచేలా చూడాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ నేతలకు చెంపపెట్టు..

తెలంగాణలో 2014లో 1,347 రైతు ఆత్మహత్యలు నమోదవ్వగా, 2023 నాటికి 56కు పరిమితమయ్యాయని జాతీయ నేర గణాంక నివేదిక స్పష్టం చేస్తోందని హరీశ్ తెలిపారు. కేసీఆర్‌పై నోరు పారేసుకునే కాంగ్రెస్ నేతలకు ఇది చెంపపెట్టు లాంటిదని.. బీఆర్ఎస్ పాలనలో రికార్డు స్థాయిలో అన్నదాతల ఆత్మహత్యల్లో 95.84% తగ్గుదల నమోదైందని 'ఎక్స్'లో పేర్కొన్నారు.

బీఆర్ఎస్‌తో నాకు సంబంధం లేదు

- గ్రామాల్లో తప్పుడు రిజర్వేషన్లతో బీసీలకు అన్యాయం: కవిత

హైదరాబాద్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్‌తో తనకు ఎటువంటి సంబంధం లేదని.. ఇచ్చి పుచ్చుకోవడాల్లాంటివి కూడా లేవని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. బంజారాహిల్స్ జాగృతి కార్యాలయంలో ఆమె మీడియాతో బుధవారం మాట్లాడుతూ.. బాకీకార్డు అనేది ఆ పార్టీ తీసుకున్న రాజకీయ అంశమని.. దానిపై స్పందించాల్సిన అవసరం లేదన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లంటూ జీవో ఇచ్చిన మరుసటి రోజే సీఎం రేవంత్‌రెడ్డి తనకు దగ్గరి వ్యక్తులతో కోర్టులో కేసులు వేయించారని ప్రచారం జరుగుతోందన్నారు. ఇక రాష్ట్రపతి వద్ద బిల్లు పాస్ చేయించాల్సిన బీజేపీవాళ్లు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారన్నారు. ఎన్నికలకు వెళ్లొద్దు, ఖర్చు పెట్టిన డబ్బులు వృథా అవుతాయని, ఫలితాలు వచ్చాక కోర్టుకు వెళ్లి రద్దు చేయిస్తామని ఈటల రాజేందర్ వ్యాఖ్యానించడం ద్రోహపూరిత చర్య అన్నారు. ఈ ఎన్నికలకు ప్రభుత్వం నిర్ణయించిన రిజర్వేషన్లు తప్పుల తడకగా ఉన్నాయన్నారు. ఎస్సీ వర్గీకరణ పూర్తిచేశామని చెప్పిన రేవంత్‌రెడ్డి ఈ రిజర్వేషన్లలో వర్గీకరణను చూపకుండా వారిని కూడా మోసగించారన్నారు. ఎన్‌డీఎస్‌ఏ నివేదిక ఆధారంగా మేడిగడ్డను బాగు చేసేందుకు ముందుకు వచ్చిన ప్రభుత్వం ఇప్పటికైనా రాజకీయం చేయకుండా.. నాణ్యమైన పద్ధతిలో బాగు చేయించాలన్నారు.

నాగార్జున అనుమతి లేకుండా పేరు, ఫొటోలు వాడొద్దు

- అశ్లీల చిత్రాలు తొలగించాలని 10 వెబ్‌సైట్లకు ఢిల్లీ హైకోర్టు ఆదేశం



న్యూఢిల్లీ, అక్టోబరు 1: సినీ హీరో అక్కినేని నాగార్జున వ్యక్తిత్వ హక్కులు (పర్సనాలిటీ రైట్స్)కు ఢిల్లీ హైకోర్టు రక్షణ కల్పించింది. పేరు, చిత్రాలు, ప్రత్యేకంగా గుర్తించదగ్గ హావభావాలు వంటి వ్యక్తిగత లక్షణాలు కేవలం ఆయన సొంతమని, అనుమతి లేకుండా ఇతరులు ఉపయోగించకూడదని స్పష్టం చేసింది. ఆయన పేరు, చిత్రాలను ఎలాంటి సమ్మతి లేకుండా వినియోగించే వారిపై ఆంక్షలు విధిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన ఫొటోలను వాడుకుంటూ వ్యక్తిత్వ, నైతిక హక్కులకు భంగం కలిగిస్తున్న 10 వెబ్‌సైట్లపై ప్రత్యేకంగా ఆంక్షలు పెట్టింది. ఎలాంటి అనుమతులు లేకుండానే ఆయన పేరును, చిత్రాలను, వ్యక్తిత్వానికి సంబంధించిన ఇతర ప్రత్యేక లక్షణాలను ఆ వెబ్‌సైట్లు దుర్వినియోగం చేస్తున్నట్టు కనిపిస్తోందని తెలిపింది. ఒకరి వ్యక్తిత్వ హక్కులను దోపిడీ చేయడం అంటే వారి ఆర్థిక ప్రయోజనాలను దెబ్బతీయడంతో పాటు, గౌరవప్రదంగా జీవించే హక్కును ప్రమాదంలోకి నెట్టడమేనని పేర్కొంది. అలాంటి చర్యలు కారణంగా ఆయన పేరు ప్రఖ్యాతులు పలచనవుతాయని అభిప్రాయపడింది. పోర్నోగ్రాఫిక్ కంటెంట్‌లో చిత్రాలు, వీడియోలను ఉపయోగించి తన పేరును దుర్వినియోగం చేశారని పేర్కొంటూ నాగార్జున 10 వెబ్‌సైట్లపై ఫిర్యాదు చేశారు. విచారణ జరిపిన హైకోర్టు ఆ సమాచారం మొత్తాన్ని 72 గంటల్లోగా తొలగించాలని సంబంధిత యూఆర్ఎల్‌లను ఆదేశించింది. కొన్ని యూఆర్ఎల్‌లను 7 రోజుల్లోగా బ్లాక్ చేయాలంటూ కేంద్ర ఐటీ, టెలికాం శాఖకు సూచనలు ఇచ్చింది.

రాష్ట్రంలో 1.40 లక్షల మెగావాట్ల సోలార్ విద్యుదుత్పాదనకు అవకాశం

- కేంద్ర ప్రభుత్వం నివేదిక

హైదరాబాద్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 1.40 లక్షల మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పాదనకు అనుకూలత ఉందని కేంద్రం వెల్లడించింది. సోలార్ పీవీ పొటెన్షియల్ ఆఫ్ ఇండియా, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోలార్ ఎనర్జీ(ఎన్ఐఎస్ఈ)లతో కలిసి పునరుత్పాదక ఇంధన మంత్రిత్వశాఖ(ఎంఎన్ఆర్ఈ) బుధవారం ఈ నివేదికను విడుదల చేసింది. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో సోలార్ ప్లాంట్లు పెట్టడానికి విస్తారమైన అవకాశాలున్నాయని వెల్లడించింది. రాష్ట్రంలో 8.88 శాతం బంజరు/వ్యవసాయ యోగ్యత లేని భూములు ఉన్నాయని, ఈ నిరుపయోగ ప్రాంతాలు సోలార్ ప్లాంట్లు పెట్టుకోవడానికి అనువైనవని ఈ నివేదిక పేర్కొంది. రంగారెడ్డి జిల్లాలో ఏకంగా 16 వేల మెగావాట్ల సామర్థ్యం కలిగిన ప్లాంట్లు పెట్టడానికి అవకాశం ఉందని తెలిపింది. ఆ తర్వాతి స్థానాల్లో నల్గొండ, యాదాద్రి భువనగిరి జిల్లాలుండగా, అత్యల్పంగా హైదరాబాద్‌లో 4.95 మెగావాట్ల ప్లాంటు పెట్టడానికి అవకాశం ఉందని నివేదిక స్పష్టం చేసింది.

ఆ బడాబాబుల భరతం పట్టండి

- వారి చెరలోని గాజులరామారం ప్రభుత్వ భూములను రక్షించండి
- 'హైడ్రా'కు బీఆర్ఎస్ నేతలు మాధవరం, దాసోజు ఫిర్యాదు
- 317 ఎకరాలను అరికెపూడి కబ్జా చేశారని ఆరోపణ
- అన్నీ నిరాధారమైన ఆరోపణలే.. కొట్టిపారేసిన అరికెపూడి

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): గాజులరామారంలోని 307 సర్వేనంబర్‌లో 317 ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జాదారుల చెర నుంచి కాపాడాలంటూ.. బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు బుధవారం హైడ్రా కార్యాలయానికి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ వెళ్లి కమిషనర్ ఏవీ రంగనాథ్‌ను కలిశారు. గాజులరామారంలో రూ.కోట్ల విలువైన ప్రభుత్వ భూములు కబ్జా అవుతున్నాయని, బడాబాబుల్లో కొందరు అక్కడి ప్రభుత్వ భూముల్లో వెంచర్లు వేసి ప్లాట్లు విక్రయిస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను కోరారు. అనంతరం మాధవరం, దాసోజు మాట్లాడారు. స్థానిక తహసీల్దార్ మొదలుకొని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వరకు, విజిలెన్స్ నుంచి హైడ్రా వరకు అన్ని సంస్థలకూ, గాజులరామారం ప్రభుత్వ భూములను రక్షించాలని కోరుతూ వినతిపత్రాలు అందజేసినట్లు బీఆర్ఎస్ నేతలు వెల్లడించారు. 307 సర్వేనంబరు ప్రభుత్వ భూముల్లో అక్రమాలను వెలికి తీయడమే కాకుండా, ఆ భూముల్లో భవన నిర్మాణాలకు అనుమతులు జారీ చేయొద్దని జీహెచ్ఎంసీ కమిషనర్‌కు కూడా వినతి పత్రం సమర్పించినట్లు వెల్లడించారు. అక్కడి వెంచర్లలోని ప్లాట్లను ఎవ్వరూ కొనవద్దని విజ్ఞప్తి చేశారు. కాగా గాజులరామారంలో రూ.వేలకోట్ల విలువైన 320 ఎకరాల ప్రభుత్వ భూమిని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ కబ్జా చేశారని ఎమ్మెల్సీ శ్రవణ్ ఆరోపించారు. ఆయనతో పాటు అనేకమంది పెద్దలు ఇక్కడి భూముల్లో వెంచర్లు వేశారని, ప్రభుత్వ భూములను కబ్జా చేసి క్రమబద్ధీకరించుకునేందుకే కొందరు ఎమ్మెల్యేలు అధికార పార్టీలోకి వెళ్లారని, వారిని సీఎం కాపాడుతున్నారని ఆరోపించారు.

అన్నీ నిరాధారమైన ఆరోపణలే: అరికెపూడి

ప్రభుత్వ భూమిని ఆక్రమించుకున్నట్లుగా తనపైన, తన కుటుంబ సభ్యులపైనా కొందరు ఆరోపణలు చేస్తున్నారని, అవన్నీ నిరాధారమైనవి, రాజకీయ ప్రేరేపితమైనవి అంటూ శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ కొట్టిపారేశారు. గాజులరామారం సర్వే నంబర్ 307 (పార్ట్)లోని భూమి, ల్యాండ్ రికార్డ్ చట్టం ప్రకారం అమ్మకందారులకు "రిటైనబుల్ ల్యాండ్"గా వచ్చినదాన్ని తాము కొనుగోలు చేశామని చెప్పారు. 1991 నుంచీ రెవెన్యూ రికార్డుల్లో ఈ భూమి "పట్టా భూమి"గానే ఉందన్నారు. 1991లో పట్టా భూమి రెవెన్యూ రికార్డుల ప్రకారం మ్యూటేషన్ అయిన 11 ఎకరాలను తాను రాజకీయ జీవితం ప్రారంభించకముందే 2006లో చట్టబద్ధంగా కొనుగోలు చేసినట్లు తెలిపారు. 2008లో అమ్మకందారుల్లో ఒకరు ఏపీఎస్ఎఫ్‌సీ నుంచి జోక్యం ఉంటుందనే ఉద్దేశంతో హైకోర్టును ఆశ్రయించారని, ఏపీఎస్ఎఫ్‌సీ తన కౌంటర్ అఫిడవిట్‌లో ఈ భూమి వారిది కాదని స్పష్టం చేసిందని, వేరొక పిటిషన్‌లో ఆ భూములు ఇనాం భూములు కాదని న్యాయబద్ధంగా నిర్ధారించినట్లు ఆయన వివరించారు. సెప్టెంబరు 21న హైడ్రా అధికారులు తమకు ఎటువంటి నోటీసు ఇవ్వకుండా, తమ భూమిలోకి ప్రవేశించి ఫెన్సింగ్‌ను కూల్చివేశారని, దీంతో తాము హైకోర్టును ఆశ్రయించగా, దానిపై హైడ్రా ప్రవేశం లేకుండా ఉత్తర్వులు వచ్చాయని, ప్రస్తుతం. ఈ విషయం కోర్టు పరిధిలో ఉందని వివరించారు. కొంతమంది రాజకీయ సహచరులు తప్పుడు ఆరోపణలతో రిట్ పిటిషన్లు దాఖలు చేశారని, వాటిలో ఒకటి డిస్మిస్ అయిందని, మరొకటి తన అప్పీల్‌తో కలిసి కొనసాగుతోందని చెప్పారు. ఇప్పటి వరకు హైడ్రా నుంచి గానీ, రాజకీయ సహచరుల నుంచి గానీ ఎటువంటి కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయలేదని, సహేతుకమైన ఆరోపణలు చేసిన వారికి.. తమ అధీనంలోని భూమిని ప్రైవేట్ పట్టా భూమి అని నిరూపించేందుకు తాను సిద్ధమని స్పష్టం చేశారు.

ఫిరాయింపులకు బీజేపీ వ్యతిరేకం

పార్టీ మారాలంటే పదవి వదులుకోవాల్సిందే.. స్థానిక ఎన్నికలకు అభ్యర్థుల ఎంపిక మొదలైంది

ప్రభుత్వానికి ఎన్నికలు నిర్వహించాలని లేదు.. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు వ్యాఖ్యలు

కరీంనగర్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ప్రజా ప్రతినిధుల పార్టీ ఫిరాయింపులకు బీజేపీ వ్యతిరేకమని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు అన్నారు. ఎవరైనా పార్టీ మారాల్సి వస్తే.. పదవికి రాజీనామా చేయాలన్నదే బీజేపీ అభిమతమన్నారు. బుధవారం కరీంనగర్‌లోని ఎంపీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికలకు అభ్యర్థుల ఎంపిక మొదలైందని, వార్డు సభ్యుడు మొదలుకొని జడ్పీటీసీ వరకు అన్ని స్థానాల్లో బీజేపీ పోటీ చేస్తుందని చెప్పారు. అత్యధిక స్థానాలను తామే గెలుచుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు ఓట్లు అడిగే అర్హత లేదన్నారు. స్థానిక సంస్థలను బీఆర్ఎస్ నిర్వీర్యం చేసిందని, కేంద్ర నిధులను దారి మళ్లించి గ్రామాల్లో అభివృద్ధి లేకుండా చేసిందని ఆరోపించారు. నాడు సర్పంచులు ఆత్మహత్యలు చేసుకునే దుస్థితి కల్పించిందని మండిపడ్డారు. బీఆర్ఎస్ దోపిడీ చేస్తే.. కాంగ్రెస్ మోసాలు చేస్తోందని ధ్వజమెత్తారు. బీజేపీ మాత్రం అభివృద్ధిపైనే మాట్లాడుతోందని తెలిపారు. గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి అంతా కేంద్ర నిధులతోనే అన్నారు. స్థానిక ఎన్నికలు నిర్వహించాలనే చిత్తశుద్ధి కాంగ్రెస్‌కు లేదని, హైకోర్టు ఆదేశించినందునే తప్పనిసరి పరిస్థితుల్లో ఎన్నికలు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. బీసీ రిజర్వేషన్లకు బీజేపీ కట్టుబడి ఉందని, ఎన్నికలు జరగాలన్నదే తమ అభిమతమని చెప్పారు. 42 శాతం రిజర్వేషన్ల సవరణ అప్పుడే చేస్తే.. ఈ సమస్య వచ్చేది కాదన్నారు. కోర్టుకు కాంగ్రెస్ నేతలే వెళ్లి ఉంటారని రాంచందర్‌రావు అనుమానం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో బీసీ-ఈ క్యాటగిరీ ముస్లింలకు సంబంధించినదేనని, ఒకప్పుడు విద్య, ఉద్యోగాలకు మాత్రమే పరిమితం చేస్తే.. ఇప్పుడు రాజకీయాల్లోనూ వారికి రిజర్వేషన్లు కల్పిస్తున్నారని మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో బీఆర్ఎస్ అవినీతి పాల్పడిందని, విచారణను మేడిగడ్డ, సుందిళ్లకే పరిమితం చేయకుండా ప్రాజెక్టుపై పూర్తిగా విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు.



కరీంనగర్‌లో విలేకరులతో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు

సోషల్ మీడియాపై నిఘా!

మహిళలను కించపరిస్తే కఠిన చర్యలు.. రౌడీషీట్లు తెరిచేందుకూ వెనుకాడబోము

- స్థానిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చూడటమే మా ముందున్న మొదటి సవాల్
- రెడ్ బుక్, పింక్ బుక్ లాంటివి ఉండవు
- మాకు ఉన్నది ఒక్కటే బుక్.. ఖాకీ బుక్
- మావోయిస్టులు లొంగిపోవాలి: శివధర్
- రాష్ట్ర నూతన డీజీపీగా బాధ్యతల స్వీకరణ



డీజీపీ కార్యాలయంలో నూతన డీజీపీగా బాధ్యతలు చేపట్టిన అనంతరం మీడియాతో శివధర్‌రెడ్డి, ఉన్నతాధికారులు

హైదరాబాద్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంతంగా, శాంతియుతంగా జరిగేలా చూడటం తమ ముందున్న మొదటి సవాలు అని డీజీపీ బత్తుల శివధర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఉదయం శివధర్‌రెడ్డి డీజీపీగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత మీడియాతో మాట్లాడుతూ పలు విషయాలపై తన అభిప్రాయాలు వెల్లడించారు. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఇప్పటికే వివిధ స్థాయిల్లో పలు సమావేశాలు నిర్వహించామని, బలమైన జట్టు తనకు ఉందని చెప్పారు. సమర్థవంతంగా పోలీసు విధులు నిర్వహించడానికి శాయశక్తులా ప్రయత్నిస్తామన్నారు. తెలంగాణ పోలీసు శాఖలో దాదాపు 17 వేలకు పైగా వివిధ స్థాయి పోలీసు పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. వీటిని భర్తీ చేయడానికి ఇప్పటికే ప్రభుత్వం ప్రయత్నాలు ప్రారంభించిందని, త్వరలో పోలీసు నియామకాలకు సంబంధించిన శుభవార్త వింటారని అన్నారు. సోషల్ మీడియాలో మహిళలను కించపరిచేలా, వ్యక్తిత్వ హననానికి పాల్పడేలా నకిలీ వార్తలు ప్రచారం చేసేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. వారిపై రౌడీషీట్లు కూడా తెరుస్తామని హెచ్చరించారు. తమకు పింక్‌బుక్, రెడ్‌బుక్ అంటూ ఉండవని, ఉండేదీ ఒక్కటే ఖాకీ బుక్ అని స్పష్టం చేశారు. చట్టం ప్రకారం చర్యలుంటాయన్నారు. సైబర్ క్రైం విభాగంలో సిబ్బంది కొరత ఉందన్నది వాస్తవం కాదని, దాదాపు అన్ని మండలాల్లో సైబర్ క్రైం పోలీసు స్టేషన్లను అందుబాటులోకి తెచ్చామని పేర్కొన్నారు. ఈ విభాగాల్లో పనిచేస్తున్న పోలీసులకు ఆధునిక శిక్షణ ఇవ్వడం ద్వారా వారి శక్తి సామర్థ్యాలను పెంచడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. మరోవైపు సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపట్టనున్నట్లు చెప్పారు.

మాదక ద్రవ్యాలపై ఉక్కుపాదం..

డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపుతామని డీజీపీ శివధర్ రెడ్డి అన్నారు. ఈగల్ బృందాలకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తామని, కొత్త వాహనాలు సమకూరుస్తామని, వారి నైపుణ్యాలు పెంచే చర్యలు చేపడతామని తెలిపారు. మత్తుమందు తీసుకున్న వారిని స్పాట్‌లోనే గుర్తించే విధంగా మొబైల్ కిట్స్ ఎక్కువగా వినియోగిస్తామని చెప్పారు. బేసిక్ పోలీసింగ్‌లో భాగమైన విజిబుల్ పోలీసింగ్ ద్వారా చాలావరకు నేరాలను అరికట్టవచ్చునన్నారు. ఫుట్ పెట్రోలింగ్, బీట్ పెట్రోలింగ్, బ్లూకోల్ట్స్ వాహనాలతో పెట్రోలింగ్‌ను పెంచడం ద్వారా ప్రజలకు ఎల్లప్పుడూ పోలీసులు కనిపించేలా చర్యలు తీసుకుంటామని వివరించారు. ఇంటెలిజెన్స్ సమాచార సేకరణలో సాంకేతికతకు పెద్దపీట వేస్తామని డీజీపీ తెలిపారు. నిఘా సమాచారం పోలీసులకు అత్యవసరమైనదని పేర్కొన్నారు. లొంగిపోయేందుకు ముందుకొచ్చే మావోయిస్టుల పట్ల సానుభూతితో వ్యవహరిస్తామన్నారు. మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు మల్లోజుల వేణుగోపాల్ అలియాస్ సోనూ ఇటీవల స్వయంగా రాసిన లేఖలోని అనేక విషయాలు ఆ పార్టీ ప్రస్తుత పరిస్థితికి అద్దం పడుతున్నాయని వ్యాఖ్యానించారు. ఇటీవల ఎన్‌కౌంటర్‌లో మరణించిన మావోయిస్టు పార్టీ సెక్రటరీ బసవరాజ్ బతికి ఉన్నపుడే శాంతి చర్చలు, ఆయుధాలు వీడటంపై చర్చ జరిగిందన్న విషయాన్ని సోనూ లేఖలు స్పష్టం చేస్తున్నాయని పేర్కొన్నారు. అడవుల్లో ఉన్న మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలవాలని తాము కోరుకుంటునట్లు చెప్పారు. ప్రభుత్వం కోరుకుంటున్న ఆర్థిక అభివృద్ధికి రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితి మెరుగ్గా ఉండటం అవసరమన్నారు. అందుకు తగ్గట్లుగా, ప్రభుత్వ లక్ష్యాలకు అనుగణంగా పనిచేస్తామని అన్నారు. తనను డీజీపీగా నియమించిన ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు.. శివధర్‌రెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

ఏసీబీ డీజీగా చారుసిన్హా, ఇంటెలిజెన్స్ చీఫ్‌గా విజయకుమార్

బాధ్యతల స్వీకరణ

అవినీతి నిరోధక శాఖ డైరెక్టర్ జనరల్‌గా 1996 బ్యాచ్ ఐపీఎస్ అధికారిణి చారుసిన్హా బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం సీఐడీ అదనపు డీజీగా ఉన్న చారు సిన్హాకు ఏసీబీ డీజీగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఇటీవలే ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఏసీబీ చరిత్రలోనే తొలిసారిగా ఒక మహిళాపోలీసు అధికారికి ప్రభుత్వం ఈ బాధ్యతలు అప్పగించింది. వాస్తవానికి చారుసిన్హా గతంలో ఏసీబీలో వివిధ హోదాల్లో పనిచేశారు. ఈ క్రమంలోనే చారుసిన్హాను ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. మరోవైపు ఇంటెలిజెన్స్ చీఫ్‌గా నియమితులైన అదనపు డీజీ విజయకుమార్ బుధవారం లక్డీకాపూల్‌లోని ఇంటెలిజెన్స్ ప్రధాన కార్యాలయంలో పదవీ బాధ్యతలు స్వీకరించారు.

గవర్నర్‌ను కలిసిన నూతన పోలీస్ బాసులు..

నూతన డీజీపీ శివధర్ రెడ్డి, హైదరాబాద్ పోలీస్ నూతన కమిషనర్ వీసీ సజ్జనార్, ఇంటెలిజెన్స్ చీఫ్ విజయకుమార్ బుధవారం రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను రాజ్‌భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. పోలీసుశాఖలో ఇటీవల జరిగిన మార్పులు, స్థానిక సంస్థల ఎన్నికలు, శాంతిభద్రతలపై ఈ సందర్భంగా గవర్నర్ ఆరా తీసినట్లు తెలిసింది. అనంతరం డీజీపీ శివధర్ రెడ్డి.. సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.

పండుగకి ఊరెళ్లిపోదాం!

దసరా ప్రయాణాలతో బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు కిటకిట

హైదరాబాద్- విజయవాడ హైవే సహా రహదారులన్నీ బిజీబిజీ

తిరుగు ప్రయాణాలకు 5, 6 తేదీల్లో టీజీఎస్ ఆర్టీసీ ప్రత్యేక బస్సులు



హైదరాబాద్ సిటీ, చౌటుప్పల్ టౌన్/ బీబీనగర్/ కేతేపల్లి, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): దసరా పండుగను జరుపుకునేందుకు హైదరాబాద్ వాసులు చాలామంది సొంతూరి బాటపట్టారు. గురువారం నుంచి ఆదివారం వరకు వరుసగా సెలవులు ఉండడంతో హైదరాబాద్ నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు తమ సొంతూళ్లు బయలుదేరారు. దీంతో హైదరాబాద్ నుంచి రాష్ట్రంలోని ఇతర జిల్లాలకు వెళ్లే రహదారులు, ఏపీకి వెళ్లే రహదారులు బుధవారం ఉదయం నుంచే రద్దీగా మారాయి. హైదరాబాద్‌లోని ఆర్టీసీ బస్టాండ్‌లు, రైల్వే స్టేషన్లు ప్రయాణికులతో కిటకిటలాడాయి. హైదరాబాద్‌లోని ఎంజీబీఎస్ నుంచి బుధవారం రాత్రి తొమ్మిది గంటల వరకు 2,600 రెగ్యులర్ సర్వీసులతోపాటు మహబూబ్‌నగర్ సెక్టార్, విజయవాడ, ఖమ్మం, రాయచూర్‌తోపాటు తెలంగాణలోని పలు జిల్లాలకు 300కు పైగా ప్రత్యేక బస్సులు వెళ్లాయి. జూబ్లీ బస్టాండ్ నుంచి గత రెండ్రోజుల్లో 500 ప్రత్యేక బస్సులు నడిపారు. పండగ రద్దీ దృష్ట్యా హైదరాబాద్ నుంచి 800కు పైగా సిటీ బస్సులను సమీప జిల్లాలకు ఆర్టీసీ అధికారులు తరలించారు. అలాగే, పండగ అనంతరం జిల్లాల నుంచి హైదరాబాద్‌కు తిరిగి వచ్చే వారి కోసం అక్టోబరు 5, 6 తేదీల్లో టీజీఎస్‌ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడిపేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. మరోపక్క, దసరా ప్రయాణాలతో హైదరాబాద్ - విజయవాడ జాతీయ రహదారిపై వాహనాల రద్దీ పెరిగింది. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్‌లో బుధవారం ట్రాఫిక్ విపరీతంగా ఉంది. వాహనాల సంఖ్య అధికంగా ఉండడంతో నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలంలోని కొర్లపహాడ్ శివారులోని టోల్ ప్లాజా వద్ద ట్రాఫిక్ నెమ్మదించింది. విజయవాడ రూట్‌లో టోల్ ప్లాజాలో అదనపు కౌంటర్లు కూడా ఏర్పాటు చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండల పరిధిలోని ఎన్‌హెచ్-163రహదారి(హైద్రాబాద్-భూపాపల్లి) గూడూరు టోల్‌ప్లాజా వద్ద వాహనాల రద్దీ కనిపించింది. ఈ టోల్ ప్లాజా నుంచి సాధారణ రోజుల్లో 19వేల వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. బుధవారం మరో నాలుగు వేల వాహనాలు అదనంగా రాకపోకలు సాగించినట్టు టోల్‌ప్లాజా సిబ్బంది తెలిపారు.



చౌటుప్పల్‌లో హైదరాబాద్ -విజయవాడ జాతీయ రహదారిపై వాహనాలు



మందు బాబుల ముందుచూపు!

- దసరా రోజే గాంధీ జయంతితో మద్యం, మాంసం దుకాణాల బంద్
- దీంతో బుధవారం వైన్‌షాపుల వద్ద పోటెత్తిన మద్యం ప్రియులు
- 4 రోజులుగా రెట్టింపు అమ్మకాలు
- బుధవారం ఒక్క రోజే ఎక్సైజ్ శాఖకు 340 కోట్ల ఆదాయం
- కిక్కిరిసిపోయిన మాంసం షాపులు

హైదరాబాద్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): పండుగ ఏదైనా.. మద్యం ఉంటే ఆ కిక్కే వేరు. అది లేకుంటే మందుబాబులకు నిస్తేజమే. ఈసారి విజయదశమి, గాంధీ జయంతి ఒకేరోజు (గురువారం) వచ్చాయి. దీంతో ప్రభుత్వం గురువారం రాష్ట్రంలో జంతు బలులు, మద్యం విక్రయాలపై నిషేధం విధించింది. ఈ ఉత్వర్వు మందు బాబులకు షాకిచ్చింది. దీంతో వారు ముందు జాగ్రత్త పడ్డారు. నాలుగు రోజులుగా వారంతా మద్యం షాపులకు క్యూ కట్టారు. విచ్చలవిడిగా కావాల్సినంత మద్యాన్ని కొనుగోలు చేసుకుని నిల్వ పెట్టుకున్నారు. రాష్ట్రంలో సాధారణ రోజుల్లో ఎక్సైజ్ శాఖకు రోజుకు సగటున రూ.100 నుంచి రూ.150 కోట్ల ఆదాయం వస్తుండగా.. విజయ దశమి కంటే ముందు నాలుగైదు రోజులుగా మద్యం విక్రయాలు భారీగా పెరిగాయి. ఆబ్కారీ శాఖకు వస్తున్న ఆదాయమే అందుకు కారణంగా చెప్పవచ్చు. ఆది, సోమ, మంగళ వారాల్లో వరుసగా 280-290-300 కోట్ల రూపాయల ఆదాయం రాగా.. దసరా ముందు రోజు బుధవారం మాత్రం ఎక్సైజ్ ఆదాయం ఏకంగా రూ.340 కోట్లకు దాటింది. అంటే.. ఈ లెక్కలను చూస్తే.. గాంధీ జయంతిని దృష్టిలో పెట్టుకుని మందు బాబులు విజయదశమికి ముందే భారీగా మద్యం కొనుగోలు చేసుకున్నారని స్పష్టమవుతోంది. కొనుగోలు చేసిన మద్యాన్ని వివిధ ప్రాంతాల్లో నిల్వ చేసుకుని .. దసరా పండుగను జోరుగా జరుపుకోవడానికి ముమ్మరంగా ఏర్పాట్లు చేసుకున్నారు. దసరా సందర్భంగా పలు ప్రాంతాల్లో జాతరలు కూడా ఉండటంతో మద్యాన్ని ముందస్తుగానే కొనుగోలు చేసుకున్నారు. దసరాకు ఒక్క రోజు ముందు బుధవారం నాడు ఉద్యోగులకు జీతాలు కూడా పటడంతో మద్యం షాపులు, మాంసం కొట్లు వద్ద జనం కిక్కిరిసిపోయారు. అక్టోబరు 2న మాంసం దుకాణాలు మూసి ఉంటాయని ముందు రోజు అంటే బుధవారం నాడే తీసుకెళ్లాలని విక్రయదారులు షాపు ల ముందు బ్యానర్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేసుకున్నారు. దీంతో చాలా ప్రాంతాల్లో విజయ దశమి కంటే ఒక రోజు ముందే మాంసం కొనుగోలు చేసి నిల్వ చేసుకున్నారు.

అప్పుడు హెచ్చరించారు.. ఇప్పుడు దొరికిపోయారు!

- పోలీసుల అదుపులో 'ఐబొమ్మ' పైరసీ నిందితులు
- నలుగురిని అరెస్టు చేసిన సైబర్ క్రైమ్ పోలీసులు
- 2023లో 'ఐబొమ్మ' పెట్టిన పోస్ట్ ఇప్పుడు వైరల్

హైదరాబాద్, అక్టోబరు 1: దేశవ్యాప్తంగా అన్ని భాషల సినిమాలనూ పైరసీ చేస్తున్న అంతర్రాష్ట్ర ముఠా ఆట కట్టించిన హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు తాజాగా ఓటీటీ కంటెంట్ లక్ష్యంగా పైరసీకి పాల్పడుతున్న ఐబొమ్మ వెబ్‌సైట్‌పైనా దృష్టి పెట్టారు. ఆ వెబ్‌సైట్ కోసం పనిచేస్తున్న నలుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. బిహార్, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రాల్లో ఐ బొమ్మ కోసం కొందరు ఏజెంట్లు పని చేస్తున్నట్లు గుర్తించారు. ఈ కేసులో దర్యాప్తును వేగవంతం చేశామని.. త్వరలోనే ఐబొమ్మ ప్రధాన నిర్వాహకుడిని పట్టుకుంటామని మాజీ సీపీ సీవీ ఆనంద్ రెండు రోజుల క్రితం మీడియా సమావేశంలో చెప్పిన సంగతి తెలిసిందే. ఆయన ప్రకటన నేపథ్యంలో.. ఐబొమ్మ నిర్వాహకులు 2023లో పోలీసులు తమ సైట్‌ను బ్లాక్ చేసిన సందర్భంలో హెచ్చరిస్తూ పెట్టిన పాత పోస్టు ఒకటి తాజాగా వైరల్ అయ్యింది! అది పాతదా కొత్తదా అనే విషయాన్ని నిర్ధారించుకోకుండా.. పలు మీడియా సంస్థలు దానికి విస్తృతంగా ప్రచారం కల్పించాయి. 'పోలీసులకు ఐబొమ్మ వార్నింగ్' అంటూ డిజిటల్ మీడియా, టీవీ చానళ్లలో ఆ పాత పోస్టునే ప్రచారం చేయడం మొదలుపెట్టాయి. "మాపైన (ఐ బొమ్మ) ఫోకస్ ఆపండి, లేదంటే మీ పైన మేం ఫోకస్ పెట్టాల్సి వస్తుంది. ఐ బొమ్మ మీద మీరు ఫోకస్ చేస్తే మేము ఎక్కడ ఫోకస్ చేయాలో అక్కడ చేస్తాం. మాతో పెట్టుకోవద్దు' అంటూ పోలీసు వ్యవస్థనే హెచ్చరిస్తూ పెట్టిన పోస్టు అది. 'కెమెరాల సాయంతో థియేటర్లలో సినిమాలను రికార్డ్ చేసి ప్రింట్స్ విడుదల చేస్తున్న వారిపై మీరు దృష్టి పెట్టండి. మేం ఏ దేశంలో ఉన్నా, భారతదేశం, అందునా తెలుగు వారి కోసం ఆలోచిస్తాం. సినిమాలకు అనవసరంగా భారీ బడ్జెట్ పెట్టి రికవరీ కోసం అధిక ధరలకు ప్రేక్షకులపై రుద్దుతున్నారు. దీనివల్ల మామూలు ప్రేక్షకులు, మధ్య తరగతి ఇబ్బందులు పడుతున్నారు. సినీ కార్మికులకు మీరు ఇచ్చే పారితోషికాలు బయట ఏ కూలీ పనిచేసుకున్నా వస్తాయి. కానీ హీరో హీరోయిన్లకు వస్తాయా? ప్రొడక్షన్ బాయ్స్, లైట్ బాయ్స్‌కు ఎంత ఖర్చవుతుంది?, విదేశాల్లో చిత్రీకరణల కోసం ఎంత ఖర్చు పెడుతున్నారు? ఇండియాలో షూట్ చేస్తే బడ్జెట్ తగ్గడంతో పాటు స్థానికంగా ఉపాధి కలుగుతుంది. మా వెబ్‌సైట్‌ను బ్లాక్ చేస్తే, మీ ఫోన్ నంబర్లు బయటపెడతాం. ఐదు కోట్ల మంది యూజర్ల సమాచారం మా దగ్గర ఉంది. వెనక్కు తగ్గం. ఇండియా మొత్తం మాకు మద్దతుగా ఉంది. మా సర్వర్లు ఎక్కడున్నాయో పోలీసులకు కనపడవు. మమ్మల్ని వెతకలేరు, ఆపలేరు" అని ఆ ప్రకటనలో ఐ బొమ్మ పేర్కొంది.

బకాయిలు అడిగితే.. అవమానిస్తున్నారు

దసరాలోపు 600 కోట్లు ఇస్తామన్నారు.. ఇచ్చింది 200 కోట్లే.. ఈ నెల 12లోగా 1000 కోట్లు ఇవ్వకుంటే సమ్మెకు దిగుతాం

- మంత్రులు మాట నిలబెట్టుకోలేదు.. ఇకపై చర్చలు ముఖ్యమంత్రితోనే
- ప్రైవేటు కాలేజీల యాజమాన్యాల సంఘాల సమాఖ్య వ్యాఖ్యలు



మీడియా సమావేశంలో ఫాతీ ప్రతినిధులు

హైదరాబాద్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): విద్యారంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్య రంగంగా గుర్తించట్లేదని.. ఉన్నత విద్యా రంగం ఎదుర్కొంటున్న జీవన్మరణ సమస్య తీవ్రతను సర్కారు అర్థం చేసుకోవట్లేదని ప్రైవేటు కాలేజీల యాజమాన్యాల సంఘాల సమాఖ్య (ఫాతీ) పేర్కొంది. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని కోరితే.. తమను అవహేళన చేస్తున్నారని, అవమానిస్తున్నారని సమాఖ్య చైర్మన్ నిమ్మగడ్డ రమేశ్ బాబు ఆవేదన వెలిబుచ్చారు. బకాయిలు చెల్లించడానికి డబ్బుల్లేవని సర్కారు చేతులెత్తేసిన నేపథ్యంలో.. ఫాతీ అత్యవసర సర్వసభ్య సమావేశం బుధవారం నగరంలోని బోట్స్‌క్లబ్‌లో నిర్వహించారు. సర్కారు హామీ మేరకు నిధులు విడుదల కాకపోవడంపై సమావేశంలో సభ్యులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. దసరాలోపు రూ.600 కోట్లు, దీపావళిలోపు రూ. 600 కోట్లు ఇస్తామని మీడియా సమావేశంలో ప్రకటించిన మంత్రులు.. బుధవారం నాటికి రూ.200 కోట్లు మాత్రమే విడుదల చేశారని రమేష్ బాబు తెలిపారు. సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర భవిష్యత్తుకు సంబంధించి అత్యంత కీలకమైన ఉన్నత విద్యారంగంలో కీలకపాత్ర పోషిస్తున్న ప్రైవేటు కాలేజీలు.. ఇప్పుడు సిబ్బందికి జీతాలు ఇచ్చుకోలేని దుస్థితిలో కొనసాగుతున్నాయని ఆందోళన వెలిబుచ్చారు. తమ సమస్యను ప్రభుత్వం అర్థం చేసుకోవట్లేదని వాపోయారు. సీఎం ఆఫీసు నుంచి తమకు ఆదేశాలు రానందున మొత్తం నిధులు ఇవ్వలేదని ఆర్థిక శాఖ అధికారులు అంటున్నారని.. కానీ సీఎంవో నుంచి స్పష్టమైన ఆదేశాలు వచ్చినా ఆర్థిక శాఖ ఉద్దేశపూర్వకంగా సమస్యను పరిష్కరించట్లేదని లేదని ఆయన ఆరోపించారు. ఇకపై తాము ఈ విషయమై.. విద్యాశాఖ బాధ్యతలు చూస్తున్న ముఖ్యమంత్రితోనే చర్చిస్తామన్నారు. దసరాలోపు ఇవ్వాల్సిన రూ.400 కోట్లతోపాటు దీపావళిలోపు ఇస్తామన్న రూ.600 కోట్లు కలిపి.. మొత్తం రూ.వెయ్యి కోట్లూ ఈ నెల 12లోపు చెల్లించాలని రమేశ్‌బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఈ నెల 13 నుంచి సమ్మెకు సిద్ధమని, ఆ రోజు నుంచి తరగతులు బహిష్కరిస్తామని ప్రకటించారు. అక్టోబర్ 13 నుంచి 18 వరకూ రాష్ట్రవ్యాప్తంగా వారం రోజులపాటు నిరసన, సత్యాగ్రహ దీక్షలు నిర్వహిస్తామన్నారు. టోకెన్ల బకాయిలన్నీ చెల్లించడంతోపాటు.. మూడేళ్లుగా పెండింగులో ఉన్న మొత్తం బకాయిల విడుదలపై ప్రభుత్వం రోడ్‌మ్యాప్ ప్రకటించాలని రమేశ్ బాబు డిమాండ్ చేశారు.

మేం పార్టీ మారలేదు

- స్పీకర్ సమక్షంలో ఇద్దరు ఎమ్మెల్యేల విచారణ పూర్తి

హైదరాబాద్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేలు ప్రకాశ్ గౌడ్, కాలె యాదయ్యల విచారణ (స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ సమక్షంలో) పూర్తయింది. నలుగురు ఎమ్మెల్యేలను విచారిస్తామని స్పీకర్ ప్రకటించినప్పటికీ, సమయాభావం వల్ల ఇద్దరినే విచారించారు. మిగిలిన ఇద్దరు ఎమ్మెల్యేలు గూడెం మహిపాల్‌రెడ్డి, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డికి సంబంధించిన విచారణను స్పీకర్ 4వతేదీకి వాయిదా వేశారు. క్రాస్ ఎగ్జామినేషన్ సమయంలో పిటిషనర్ల తరఫున న్యాయవాదులు పలు ప్రశ్నలు సంధించారు. బీఆర్ఎస్ టికెట్‌పై గెలిచి కాంగ్రెస్‌లో చేరారా?, కాంగ్రెస్ కండువా కప్పుకొన్నారా?, అని ప్రశ్నించారు. ఎమ్మెల్యేలు సమాధానం చెబుతూ తాము పార్టీ మారలేదని, బీఆర్ఎస్‌లోనే ఉన్నామని, తమకు కప్పిన కండువా పార్టీకి సంబంధించింది కాదన్నారు. నియోజకవర్గ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని ముఖ్యమంత్రిని కలిశామని ఎమ్మెల్యేలు సమాధానమిచ్చారు.

చెడుపై మంచి సాధించిన
విజయమే విజయదశమి

- ప్రజలకు సీఎం, గవర్నర్ దసరా శుభాకాంక్షలు
- సొంతూరులో దసరా వేడుకల్లో పాల్గొననున్న సీఎం

హైదరాబాద్, కొడంగల్, అక్టోబరు1(ఆంధ్రజ్యోతి): విజయదశమి సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి, గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ సాంస్కృతిక జీవన విధానంలో దసరాకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. చెడుపై మంచి సాధించిన విజయానికి చిహ్నంగా దసరా సంబరాలు చేసుకుంటున్నామని తెలిపారు. తెలంగాణ సబ్బండ వర్గాల ఐక్యతకు నిదర్శనంగా ఈ పండుగ నిలుస్తుందని రేవంత్ తెలిపారు. మరోవైపు గురువారం ఉదయం ముఖ్యమంత్రి బాపూ ఘాట్‌ను సందర్శించి గాంధీజీకి నివాళి అర్పించనున్నారు.

సీఎం కొడంగల్ పర్యటనకు ముమ్మర ఏర్పాట్లు

విజయదశమి సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలంలోని సొంత గ్రామం కొండారెడ్డిపల్లిలో నిర్వహించే దసరా ఉత్సవాల్లో పాల్గొంటారు. అక్కడి నుంచి గురువారం రాత్రి కొడంగల్‌కు బయలుదేరి తన నివాసంలో బస చేయనున్నారు. సీఎం పర్యటన నేపథ్యంలో అధికారులు భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, అడిషనల్ కలెక్టర్ అమరేందర్ కొండారెడ్డిపల్లి గ్రామాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు.

రాష్ట్ర ప్రజలకు కేసీఆర్ దసరా శుభాకాంక్షలు

హైదరాబాద్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రజలకు బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు బుధవారం ఒక ప్రకటనలో దసరా శుభాకాంక్షలు తెలిపారు. కార్యదక్షులను అపజయాల నుంచి విజయాల దిశగా నడిపిస్తూ, ధర్మానిదే విజయమనే స్ఫూర్తిని దసరా పండుగ మనకు అందిస్తుందని ఆయన పేర్కొన్నారు. ప్రజలు తాము ఎంచుకున్న లక్ష్యాలను చేరుకోవాలని, వారి జీవితాల్లో సుఖసంతోషాలు నిండేలా దీవించాలని దుర్గామాతను కేసీఆర్ ప్రార్థించారు.

ఏజెన్సీ ప్రాంత జెడ్పీ ఛైర్మన్లు ఎస్టీలకే ఇవ్వాలి

స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనేతరులకు రిజర్వేషన్లు అమలు చేయవద్దనే నిబంధనలు ఉన్నాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ చెప్పారు. గిరిజన జనాభా ఎక్కువగా ఉన్న జిల్లాల్లో జెడ్పీ ఛైర్మన్ పదవులు ఎస్టీ రిజర్వేషన్ ఉండేలా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆదివాసీలు అధికంగా ఉన్న భద్రాద్రి కొత్తగూడెం, ఆదిలాబాద్, కొమరం భీం ఆసిఫాబాద్, మహబూబాబాద్ జిల్లా పరిషత్ ఛైర్మన్ స్థానాలను జనరల్ స్థానాలుగా ప్రకటించడం సరికాదన్నారు. ఎన్నికల పొత్తు, కార్యాచరణపై 4వ తేదీన నిర్వహించే పార్టీ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు.

తెలంగాణలో విద్యాభివృద్ధిపై
కేంద్రం ప్రత్యేక శ్రద్ధ: కిషన్‌రెడ్డి

న్యూఢిల్లీ, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి):తెలంగాణపై కేంద్రం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి చెప్పారు. తెలంగాణకు నాలుగు కేవీలు మంజూరు చేయడం పట్ల కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో ఇప్పటికే 35 కేవీలు ఉండగా తాజాగా మరో నాలుగు మంజూరయ్యాయి. కొత్తగూడెం, ములుగు జిల్లా కేంద్రాలతోపాటు జగిత్యాల రూరల్ మండలంలోని చెల్గల్, వనపర్తి జిల్లాలోని నాగవరంలో కేవీలు మంజూరయ్యాయని తెలిపారు. అలాగే, గత రెండేళ్లలో తెలంగాణకు రూ.400 కోట్లతో 832 పీఎంశ్రీ స్కూళ్లను మంజురు చేశామన్నారు. దేశంలో అత్యధిక పీఎంశ్రీ స్కూళ్లు తెలంగాణకే కేటాయించారని తెలిపారు. సమగ్రశిక్షా అభియాన్ కింద గత రెండేళ్లలో తెలంగాణకు దాదాపు రూ.2 వేల కోట్లను కేటాయించినట్టు తెలిపారు.

ఈ నెల 10 నుంచి సెట్ పరీక్ష దరఖాస్తుల స్వీకరణ

హైదరాబాద్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలు, డిగ్రీ కళాశాలల్లో లెక్చరర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా ఉద్యోగాలకు అర్హత కల్పించే ..సెట్(రాష్ట్ర అర్హత పరీక్ష) పరీక్ష డిసెంబరు రెండోవారంలో జరగనుంది. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్‌ను ఉస్మానియా విశ్వవిద్యాలయం బుధవారం విడుదల చేసింది. మూడు గంటల వ్యవధి గల పరీక్షలో రెండు పేపర్లు ఉంటాయని వర్సిటీ టీజీ సెట్ కార్యదర్శి ఆచార్య బి.శ్రీనివాస్ తెలిపారు. పరీక్ష సీబీటీ(కంప్యూటర్ ఆధారిత పరీక్ష) పద్ధతిలో ఉంటుందని, ఈనెల 10 నుంచి ఆన్‌లైన్లో దరఖాస్తులను స్వీకరిస్తామని పేర్కొన్నారు

కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణకు..
డిజైన్లు, సమగ్ర ప్రణాళికలు ఇవ్వండి

15 ఏళ్ల అనుభవం కలిగిన సంస్థల నుంచి కోరిన నీటిపారుదల శాఖ

హైదరాబాద్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణకు డిజైన్లతో పాటు సమగ్ర పునరుద్ధరణ ప్రణాళికను అందించడానికి ప్రతిష్ఠాత్మక సంస్థల నుంచి ఆసక్తి వ్యక్తీకరణ (ఈవోఐ)ను ఆహ్వానిస్తూ నీటిపారుదల శాఖ బుధవారం నోటీసు జారీ చేసింది. కాళేశ్వరం ప్రాజెక్టు బ్యారేజీల పునరుద్ధరణ విషయంలో జాతీయ ఆనకట్టల భద్రత సంస్థ (ఎన్డీఎస్ఏ) నిపుణుల కమిటీ తుది నివేదికలో చేసిన సిఫారసులకు అనుగుణంగా డిజైన్లు అందించాలని అందులో కోరింది. బ్యారేజీల ప్రస్తుత డిజైన్లతోపాటు ఎన్డీఎస్ఏ నివేదికల్లోని సిఫారసులను పునఃసమీక్షించాలని కోరింది. అవసరమైతే క్షేత్రస్థాయిలో పర్యటించి జియోటెక్నికల్, జియోఫిజికల్ పరీక్షలు జరిపి బ్యారేజీలలో లోపాలను గుర్తించాలని పేర్కొంది. ఎన్డీఎస్ఏ సిఫారసు మేరకు మేడిగడ్డ బ్యారేజీలోని 7వ బ్లాకును పటిష్ఠం చేయడం లేదా సురక్షితంగా తొలగించే అంశంపై అధ్యయనం జరిపి తగిన పరిష్కారాలను సూచించాలని తెలిపింది. పక్కనే ఉన్న బ్లాక్‌లకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా 7వ బ్లాక్‌ను తొలగించే విధంగా ఈ పరిష్కారాలు ఉండాలని షరతు విధించింది. ఎంపికైన సంస్థ అందించే డిజైన్లు, డ్రాయింగ్స్‌కి కేంద్ర జలవనరుల సంఘం (సీడబ్ల్యూసీ) ఆమోదం పొందాల్సి ఉంటుందని తెలిపింది. ఆసక్తి గల సంస్థ/జాయింట్ వెంచర్ కంపెనీ గత 15 ఏళ్లలో కనీసం ఒకటి రెండు ప్రాజెక్టుల పునరుద్ధరణ పనులు చేసి ఉండాలని నిర్దేశించింది. పర్మియబుల్ ఫౌండేషన్‌తో కూడిన బ్యారేజీల డిజైన్లతో పాటు పునరుద్ధరణ పనుల్లో, అందులోనూ సీకెంట్ పైల్స్ కటాఫ్‌ల పనుల్లో అనుభవం ఉండాలని పేర్కొంది. సంస్థ వార్షిక టర్నోవర్ కనీసం రూ.10 కోట్ల దాకా ఉండాలని.. ఐదేళ్లకాలానికి సంబంధించిన బ్యాలెన్స్ షీట్‌లు సమర్పించాలని షరతు విధించింది. ఆసక్తిగల సంస్థలు 15వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు ఆసక్తి వ్యక్తపరుస్తూ టెండర్ దాఖలు చేయాలని కోరింది.

హైదరాబాద్ సీఈగా
ఏఎస్ఎన్‌రెడ్డికి పూర్తి అదనపు బాధ్యతలు

హైదరాబాద్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : నీటిపారుదల శాఖలో రెండు బాధ్యతలు చూస్తున్న ఒక చీఫ్ ఇంజనీర్(సీఈ) పదవీ విరమణ చేయడంతో ఆ బాధ్యతలను ఇద్దరు సీఈలకు అప్పగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. మహబూబ్‌నగర్ చీఫ్ ఇంజనీర్(సీఈ)గా పనిచేస్తున్న ఎ.సత్యనారాయణరెడ్డికి హైదరాబాద్ సీఈగా, వరంగల్ సీఈగా పనిచేస్తున్న ఆర్.సుధీర్‌కు కొత్తగూడెం సీఈగా పూర్తి అదనపు బాధ్యతలు కట్టబెట్టారు. ఈమేరకు నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా ఉత్తర్వులు ఇచ్చారు. కొత్తగూడెం సీఈగా పనిచేస్తూ... హైదరాబాద్ సీఈగా పూర్తి అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఎ.శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం పదవీ విరమణ చేయడంతో ఈ మార్పులు చోటు చేసుకున్నాయి. కాగా ఈయన సర్వీసు కాలాన్ని పొడిగించాలని తాజాగా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఒక మంత్రికి అత్యంత ఆప్తుడిగా ఆయనకు పేరుంది. కీలక దశలో ఉన్న ప్రాజెక్టుల్లో పనిచేస్తున్న ఆయన లేకుంటే.. దాని పనులు ఆగిపోయే అవకాశం ఉందని ప్రభుత్వం ఆందోళనతో ఉంది. దాంతో శ్రీనివాస్ రెడ్డి పదవీ కాలాన్ని పొడిగించాలని నిర్ణయం తీసుకుంది. ఈ ఫైలు బుధవారం ఆర్థిక శాఖకు చేరగా.. ఆ శాఖ ఆమోదం అనంతరం సీఎం కార్యాలయం కూడా ఆమోదం తెలపాల్సి ఉంది. దాంతో ఈలోగా ఇతరులకు తాత్కాలికంగా బాధ్యతలు కట్టబెట్టారు. ఇక గజ్వేల్ పరిధిలోని దౌలతాబాద్ డీఈఈగా పనిచేస్తున్న కె.బాలకృష్ణ పదవీ విరమణ చేయడంతో ఆ స్థానంలో తాత్కాలిక ఏర్పాట్లు చేసుకోవాలని ప్రభుత్వం నిర్దేశించింది.

సికింద్రాబాద్‌లో స్టీల్ బ్రిడ్జి

- దేశంలోనే అతిపెద్ద ఉక్కు వంతెన నిర్మాణం
- సికింద్రాబాద్ ప్యారడైజ్ నుంచి శామీర్‌పేట మార్గంలో 11.65 కిలోమీటర్ల పొడవుతో నిర్మాణానికి గ్రీన్‌సిగ్నల్
- మరో 6.52 కిలోమీటర్లు రోడ్డుతో పాటు కొంత టన్నెల్

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్‌లో దేశంలోనే అతిపెద్ద ఉక్కు వంతెన ఏర్పాటు కానుంది. రాజీవ్ రహదారిపై సికింద్రాబాద్ ప్యారడైజ్ నుంచి శామీర్‌పేట మార్గంలో ప్రతిపాదించిన ఎలివేటెడ్ కారిడార్‌లో 11.65 కిలోమీటర్ల మేర ఈ వంతెన నిర్మాణం చేపట్టనున్నారు. మన్నికైన, పటిష్ఠమైన నిర్మాణం, తక్కువ సమయంలో ప్రాజెక్టు పూర్తవడం లాంటి ఎన్నో లాభాలు కలిగిన ఈ స్టీల్ బ్రిడ్జి ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో నిర్మాణానికి హెచ్ఎండీఏ టెండర్లను ఆహ్వానించింది. నగరవాసులతోపాటు ఉత్తర తెలంగాణ ప్రజలకు ఎంతగానో ఉపయోగపడే 18.170 కిలోమీటర్ల ఎలివేటెడ్ ప్రాజెక్టుకు రూ.2,232 కోట్ల వరకు వ్యయం అవుతుందని హెచ్ఎండీఏ అంచనా వేస్తోంది. ఇంజనీరింగ్ ప్రొక్యూర్‌మెంట్ అండ్ కన్‌స్ట్రక్షన్ (ఈపీసీ) విధానంలో టెండర్లను ఆహ్వానించడంతో హెచ్ఎండీఏ నిర్ణయించిన వ్యయానికి ఏ స్థాయిలో అధికంగా టెండర్ కోట్ చేస్తారోననే ఆసక్తి నెలకొంది. హైదరాబాద్-కరీంనగర్ మార్గంలోని రాజీవ్ రహదారిపై సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్ నుంచి శామీర్‌పేట వరకు వెస్ట్ మారేడుపల్లి, కార్ఖానా, తిరుమలగిరి, బొల్లారం, అల్వాల్, హకీంపేట, తూంకుంట మీదుగా 18.170 కిలోమీటర్ల మేర ఎలివేటెడ్ కారిడార్‌ను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన విషయం విషయం తెలిసిందే. దీనిని రూ.2232 కోట్లతో నిర్మించేందుకు ఇప్పటికే ప్రభుత్వపరమైన పాలన అనుమతులు వచ్చాయి. అయితే 18.170 కిలోమీటర్ల మార్గంలో 11.65 కిలోమీటర్ల మేర ఎలివేటెడ్ కారిడార్ రానుండగా.. దీనిని పూర్తిగా ఉక్కుతోనే నిర్మించనున్నారు. పునాదులు మాత్రమే కాంక్రీట్‌తో నిర్మించి.. వంతెనను పూర్తిగా స్టీల్‌తో నిర్మించేలా హెచ్ఎండీఏ అధికారులు డిజైన్ చేశారు. సికింద్రాబాద్ ప్యారడైజ్ నుంచి హకీంపేట వరకు ఈ ఎలివేటెడ్ కారిడార్ రానుండగా.. ఆ తర్వాత హకీంపేట ఆర్మీ ఎయిర్‌పోర్టు వద్ద 450 మీటర్ల మేర అండర్ గ్రౌండ్ టన్నెల్ నిర్మాణం చేయనున్నారు. ఆ తర్వాత ఆరు కిలోమీటర్లకు పైగా రోడ్డు మార్గాన్ని ఆరు లైన్లతో విస్తరించే విధంగా చర్యలు చేపట్టనున్నారు.

ఎన్నికల కాలం!



వచ్చే నాలుగు నెలలూ స్థానిక సంగ్రామమే

- నవంబరు 11 వరకు పరిషత్, పంచాయితీ ఎన్నికలు
- డిసెంబరులో మునిసిపల్.. ఆ వెంటనే జీహెచ్ఎంసీ ఎన్నికలు
- నవంబరులో జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక !
- బీసీ రిజర్వేషన్లపై 8న కోర్టు విచారణపైనే ఉత్కంఠ
- 50 శాతం మించొద్దని కోర్టు చెబితే.. కాంగ్రెస్ పార్టీ పరంగా ఇచ్చే యోచన
- సంక్రాంతి తర్వాతే 'విస్తరణ'.. నామినేటెడ్ పదవుల భర్తీ
- క్షేత్ర స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పదవుల పండుగ



హైదరాబాద్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఈనెల 9వ తేదీ నుంచి నాలుగు నెలల పాటు ఎన్నికల సీజనే. నవంబరు 11 వరకు పరిషత్, పంచాయతీ ఎన్నికలు.. అవి ముగియగానే మునిసిపల్ ఎన్నికలు, అదే ఊపులో జీహెచ్ఎంసీ ఎన్నికలనూ వెంట వెంటనే నిర్వహించేందుకు సర్కారు కసరత్తు చేస్తోంది. స్థానిక ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లపై 8న హైకోర్టు ఎలాంటి తీర్పు ఇచ్చినా ఎన్నికలపై ముందుకే వెళ్లాలని సర్కారు భావిస్తోంది. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవోపై హైకోర్టు 8న విచారణ చేపట్టనున్న నేపథ్యంలో కోర్టు స్పందన ఎలా ఉంటుందన్న ఉత్కంఠ నెలకొంది. రిజర్వేషన్లు 50 శాతానికి మించకూడదని హైకోర్టు స్పష్టం చేస్తే గనక.. కాంగ్రెస్ పార్టీ పరంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇస్తామని ప్రకటించి షెడ్యూల్ ప్రకారం ఎన్నికలకు వెళ్లాలన్న ఆలోచనలో ప్రభుత్వ పెద్దలు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే సీఎం రేవంత్‌రెడ్డి మంగళవారం జూమ్ ద్వారా టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షీ నటరాజన్, మంత్రులతో నిర్వహించిన సమావేశంలో ఈ నెల 5 వరకు జెడ్పీటీసీ సీట్లకు ఆశావహుల జాబితాలు పంపాలని సూచించినట్లు చెబుతున్నారు.

వరుస ఎన్నికలు

రాష్ట్ర ఎన్నికల కమిషన్ ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఈనెల 9న నోటిఫికేషన్ విడుదల మొదలుకుని, నవంబరు 11 వరకూ పరిషత్, పంచాయతీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో 80శాతానికి పైగా జెడ్పీ స్థానాలను వశం చేసుకునేందుకు అధికార కాంగ్రెస్ ఎన్నికల వ్యూహాన్ని సిద్ధం చేసింది. పరిషత్, పంచాయితీ ఎన్నికలు ప్రక్రియ పూర్తి కాగానే మునిసిపల్ ఎన్నికలను నిర్వహించేందుకు సర్కారు సమాయత్తమవుతోంది. పరిషత్ ఎన్నికలు పూర్తి కాగానే మునిసిపాలిటీ ఎన్నికల షెడ్యూల్ విడుదలైతే.. డిసెంబరు నెల మొత్తం మునిసిపల్ ఎన్నికల ప్రక్రియే కొనసాగుతుంది. జీహెచ్ఎంసీ పాలక మండలి పదవీకాలం వచ్చే ఏడాది ఫిబ్రవరితో పూర్తి కానుంది. పరిషత్, పంచాయతీ.. మునిసిపల్ ఎన్నికల వేడిలోనే జీహెచ్ఎంసీ ఎన్నికలనూ నిర్వహించాలన్న యోచనలో ప్రభుత్వం ఉంది. జనవరి - ఫిబ్రవరి నెలల్లో జీహెచ్ఎంసీ ఎన్నికలు నిర్వహించేందుకు అవకాశం ఉంది. ఈ నెల చివర్లోగానీ.. నవంబరు మొదట్లో గానీ జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక జరిగే అవకాశం ఉంది.

సంక్రాంతి తర్వాతే.. మంత్రివర్గ విస్తరణ

వచ్చే నాలుగు నెలల పాటు వరుసగా ఎన్నికల నేపథ్యంలో.. రాష్ట్రంలో అప్పటిదాకా ఎన్నికల కోడ్ కొనసాగనుంది. దీంతో సంక్రాంతి తర్వాతే మంత్రివర్గ విస్తరణ, నామినేటెడ్ పదవుల భర్తీ ఉంటుందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. స్థానిక ఎన్నికల్లో మంత్రులు, ఎమ్మెల్యేల పనితీరును పరిగణనలోకి తీసుకుని మంత్రివర్గ పునర్‌వ్యవస్థీకరణను చేపట్టేందుకు అవకాశం ఉందని చెబుతున్నారు. నామినేటెడ్ పదవుల భర్తీలోనూ ఆయా నాయకులు స్థానిక ఎన్నికల్లో కనపరిచిన పనితీరును పరిగణనలోకి తీసుకోనున్నారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. కాగా స్థానిక ఎన్నికల ప్రక్రియ పూర్తయితే వార్డు మెంబర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, జెడ్పీ ఛైర్మన్‌లు.. మునిసిపల్.. కార్పొరేషన్ ఛైర్మన్లు ఇలా వేల సంఖ్యలో నేతలు పదవులు పొందనున్నారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. స్థానిక ఎన్నికల్లో పదవులు దక్కని ముఖ్యనాయకులను వడపోసి కార్పొరేషన్ పదవులు కట్ట బెట్టడం రాష్ట్ర నాయకత్వానికీ తేలికవుతుందని చెబుతున్నారు. క్షేత్రస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు వందలాది నామినేటెడ్ పోస్టుల భర్తీకీ లైన్ క్లియర్ అవుతుందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.



జూబ్లీహిల్స్ టికెట్ ఎవరికిద్దాం?

(మొదటిపేజీ తరువాయి)

నేతలకు ఉన్న గెలుపు అవకాశాలు, స్థానికంగా వారికి ప్రజల్లో ఉన్న మద్దతు వంటి వివరాలతో రెండు రోజుల్లో నివేదిక ఇవ్వాలని అన్నారు. ఈ మేరకు బుధవారం టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామితో సీఎం రేవంత్‌రెడ్డి సమావేశమయ్యారు. జిల్లా పర్యటనలో ఉన్న మరో మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు.. వర్చువల్‌గా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో ప్రస్తుతం నెలకొన్న రాజకీయ పరిస్థితులు, నేతల పనితీరుపై సీఎం సమీక్షించారు. స్థానిక పరిస్థితులకు అనుగుణంగా సరైన నాయకుల పేర్లను అభ్యర్థిత్వానికి సిఫారసు చేస్తూ రెండు రోజుల్లో నివేదిక సమర్పించాలని సూచించారు. ఆ నివేదికను సీఎం రేవంత్, టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ సమీక్షించి.. మూడు పేర్లతో కూడిన ప్రతిపాదనను అధిష్ఠానానికి పంపనున్నారు. అనంతరం స్థానికంగా ఇప్పటికే సేకరించిన అభిప్రాయాలు, నిర్వహించిన సర్వేలు, సీఎం రేవంత్, టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ పంపిన ప్రతిపాదనల్ని పరిగణనలోకి తీసుకుని అభ్యర్థిని అధిష్ఠానం ఎంపిక చేయనుంది. కాగా, టికెట్ రేసులో ప్రధానంగా నవీన్ యాదవ్, సీఎన్ రెడ్డి, బొంతు రామ్మోహన్, అంజన్‌కుమార్ యాదవ్ ఉన్నట్లు తెలుస్తోంది. అయితే స్థానిక నేతనే బరిలోకి దించాలన్న ప్రతిపాదనకే సీఎం రేవంత్‌రెడ్డి మొగ్గు చూపుతున్నట్లు సమాచారం. ఈ ఉప ఎన్నిక రాష్ట్ర ప్రభుత్వ పనితీరుకు గీటురాయి కావడంతో సహజంగానే ఈ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి అభిప్రాయాన్ని అధిష్ఠానం గౌరవిస్తుందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీల్లో
తెలంగాణ ఎంపీలు


కే లక్ష్మణ్, ఈటల, గడ్డం వంశీకృష్ణ, డీకే అరుణ, చామల సహా పలువురికి సభ్యులుగా చోటు

- రైల్వే కమిటీ ఛైర్మన్‌గా సీఎం రమేష్
- గృహ నిర్మాణం, పట్టణ వ్యవహారాల కమిటీ ఛైర్మన్‌గా మాగుంట

న్యూఢిల్లీ, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ సెక్రటేరియట్ పలు పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీలను బుధవారం ప్రకటించింది. తెలుగు రాష్ట్రాలకు చెందిన ఎంపీలు ఈ కమిటీల్లో చోటు దక్కించుకున్నారు. తెలంగాణ నుంచి ఈటల రాజేందర్, రఘునందన్‌రావు, కే లక్ష్మణ్, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, గడ్డం వంశీకృష్ణ, డీకే అరుణ సహా పలువురు వేర్వేరు కమిటీల్లో సభ్యులుగా నియమితులయ్యారు. ఇక, ఏపీ నుంచి రాజ్యసభకు ప్రాతినిధ్యం వహిస్తున్న సీఎం రమేష్ రైల్వే పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఛైర్మన్‌గా నియమితులయ్యారు. ఈ కమిటీలో కే లక్ష్మణ్, మేడా రఘునాథ రెడ్డి ఈ కమిటీలో సభ్యులుగా నియమితులయ్యారు. గృహ నిర్మాణం, పట్టణ వ్యవహారాల పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఛైర్మన్‌గా ఏపీ ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి నియమితులయ్యారు. గుమ్మ తనూజ రాణి, చామల కిరణ్‌కుమార్ రెడ్డికి ఈ కమిటీలో సభ్యులుగా స్థానం దక్కింది. వాణిజ్య పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సభ్యులుగా రేణుకా చౌదరి, సానా సతీష్ బాబు, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిటీ సభ్యురాలిగా కడియం కావ్య, పరిశ్రమల కమిటీలో మల్లు రవి, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, బీద మస్తాన్ రావు, అభిషేక్ మను సింఘ్వి చోటు దక్కించుకున్నారు. పర్సనల్, పబ్లిక్ గ్రీవెన్స్, లా అండ్ జస్టిస్ కమిటీ సభ్యుడిగా మాధవనేని రఘునందన్ రావు, సైన్స్ అండ్ టెక్నాలజీ, పర్యావరణం, అడవులు, వాతావరణ మార్పుల కమిటీ సభ్యులుగా కేఆర్ సురేశ్ రెడ్డి, పాకా వెంకట సత్యనారాయణ, గడ్డం వంశీకృష్ణ, రవాణా, పర్యాటకం, సాంస్కృతికం కమిటీ సభ్యుడిగా గొల్ల బాబూరావు నియమితులయ్యారు. రసాయనాలు, ఎరువుల కమిటీ సభ్యులుగా బలరాం నాయక్, ఈటల రాజేందర్, దగ్గుమళ్ల ప్రసాదరావు, బొగ్గు, గనులు, ఉక్కు కమిటీ సభ్యులుగా మందాడి అనిల్ కుమార్ యాదవ్ నియమితులయ్యారు. కమ్యూనికేషన్స్, ఐటీ కమిటీ సభ్యులుగా ఎస్ నిరంజన్ రెడ్డి, కలిశెట్టి అప్పల నాయుడు, రామసహాయం రఘురామి రెడ్డి నియమితులయ్యారు. వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, ప్రజా పంపిణీ కమిటీ సభ్యురాలిగా ఇన్ఫోసిస్ సుధామూర్తి నియామకం పొందారు. రక్షణ శాఖకు చెందిన కమిటీలో ధీవకొండ దామోదర్ రావు, కేశినేని శివనాథ్, విదేశీ వ్యవహారాల కమిటీలో అయోధ్య రామిరెడ్డి, కే లక్ష్మణ్, డీకే అరుణ, వైఎస్ అవినాష్ రెడ్డికి సభ్యులుగా చోటు లభించింది. అలాగే, ఆర్థిక వ్యవహారాల కమిటీ సభ్యులుగా వైవీ సుబ్బారెడ్డి, లావు శ్రీకృష్ణ దేవరాయలు, సీఎం రమేష్, పీవీ మిథున్ రెడ్డి, బాలశౌరి వల్లభనేని, ప్రభాకర్ రెడ్డి వేమిరెడ్డి, కార్మిక, వస్త్ర మరియు నైపుణ్యాభివృద్ధి కమిటీ సభ్యుడిగా జీ లక్ష్మీనారాయణ నియమితులయ్యారు. ఇక, పెట్రోలియం, సహజ వాయువుల కమిటీ సభ్యులుగా వద్దిరాజు రవిచంద్ర, పుట్టా మహేష్‌కుమార్ యాదవ్, బాలశౌరి వల్లభనేని, సామాజిక న్యాయం, సాధికారత కమిటీ సభ్యుడిగా విజయేంద్ర ప్రసాద్ నియమితులయ్యారు.

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

ఓ ఇంటివాడవుతున్న
అల్లు శిరీష్



నటుడు అల్లు శిరీష్ తన అభిమానులకు ఓ తీపి కబురు చెప్పారు. నయనిక అనే యువతితో వివాహబంధంలోకి అడుగుపెట్టనున్నట్లు, ఈ నెల 31న తమ నిశ్చితార్థం జరగనున్నట్లు సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. 'మా తాత అల్లు రామలింగయ్య జయంతి సందర్భంగా... నా మనసుకు బాగా దగ్గరైన విషయాన్ని మీతో పంచుకుంటున్నా. నేను, నయనిక ఈ నెల 31న నిశ్చితార్థం చేసుకోబోతున్నాం. నేను పెళ్లి చేసుకోవాలని మా నానమ్మ ఎప్పుడూ కోరుతుండేది. ఆవిడ ప్రస్తుతం మా మధ్య లేకపోయినా తన ఆశీస్సులు మాకు ఉంటాయి' అని పేర్కొన్నారు ఈఫిల్ టవర్ దగ్గర కాబోయే భార్య చేతిలో చేయి వేసి దిగిన ఫొటోను శిరీష్ షేర్ చేశారు. నయనిక హైదరాబాద్‌కు చెందిన ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి కుమార్తె అని సమాచారం.

శంకరవరప్రసాద్ కోసం శశిరేఖ వచ్చింది



మెగాస్టార్ చిరంజీవి, నయనతార జంటగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో 'మన శంకర వరప్రసాద్‌గారు' చిత్రం శరవేగంతో రూపుదిద్దుకుంటోంది. సాహు గారపాటి, సుస్మిత ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఇంతకుముందు చిరంజీవి స్టయిలిష్ ఫస్ట్‌లుక్ విడుదల చేసి సినిమా మీద అంచనాలు భారీగా పెంచారు దర్శకనిర్మాతలు. ఇప్పుడు విజయదశమి సందర్భంగా హీరోయిన్ నయనతార పోషిస్తున్న శశిరేఖ లుక్‌ను రిలీజ్ చేశారు. పసుపురంగు చీరలో మెరిసిపోతున్న నయనతార అందరినీ ఆకట్టుకుంటున్నారు. మరో ఆసక్తికరమైన విషయం ఏమిటంటే సాధారణంగా సినిమా ప్రమోషన్స్‌కు దూరంగా ఉండే నయనతార 'మన శంకరవరప్రసాద్ గారు' చిత్ర ప్రచార కార్యక్రమాల్లో మొదటి నుంచీ చురుకుగా పాల్గొంటున్నారు. పండగ సందర్భంగా గురువారం ఓ స్పెషల్ సర్‌ప్రైజ్ ను అనౌన్స్ చేస్తున్నట్లు మేకర్స్ వెల్లడించారు.

అంచనాలను మించి అలరిస్తుంది



రిషబ్‌శెట్టి

గతంలో తెలుగు ప్రేక్షకులు 'కాంతార' చిత్రానికి అఖండ విజయాన్ని అందించారు. ఇప్పుడు 'కాంతార చాప్టర్ 1' చిత్రంతో మీ ముందుకు వస్తున్నాం. మీరంతా ఈ చిత్రాన్ని గొప్పగా ఆదరించాలి' అని రిషబ్‌శెట్టి కోరారు. ఆయన కథానాయకుడిగా నటిస్తూ దర్శకత్వం వహించిన చిత్రమిది. దసరా సందర్భంగా నేడు ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా బుధవారం విజయవాడలో చిత్రబృందం ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించింది. ఈ సందర్భంగా రిషబ్‌శెట్టి మాట్లాడుతూ చిత్రబృందం ఎన్నో వ్యయప్రయాసల కోర్చి తెరకెక్కించిన చిత్రమిది. ప్రేక్షకుల అంచనాలకు మించి సినిమా ఉంటుంది. తప్పకుండా అభిమానులకు కొత్త అనుభూతిని పంచుతుందనే నమ్మకం ఉంది' అన్నారు.

డ్రగ్స్‌తో పట్టుబడిన
బాలీవుడ్ నటుడు



'స్టూడెంట్ ఆఫ్ ద ఇయర్ 2' (2019) హిందీ చిత్రంలో సమ్రాట్ పాత్రతో అందరినీ ఆకట్టుకున్న నటుడు విశాల్ బ్రహ్మ(32) ఇప్పుడు డ్రగ్స్ తో పట్టుబడి పోలీసుల అదుపులో ఉన్నారు. చెన్నై ఎయిర్‌పోర్ట్‌లో ఆయన దగ్గర నుంచి రూ. 40 కోట్ల విలువైన మాదక ద్రవ్యాలను స్వాధీనం చేసుకున్నారు. అస్సాంకు చెందిన విశాల్ బ్రహ్మ చిత్ర పరిశ్రమలో అవకాశాలు లేక ఆర్థిక ఇబ్బందుల్ని ఎదుర్కొంటున్నారు. 2024లో ఆయన 'బిహు అటాక్' చిత్రంలో నటించినా ఆ చిత్ర నిర్మాత పారితోషికం ఇవ్వకపోవడంతో ఆ విషయం గురించి ఎవరికీ చెప్పినా ఫలితం లేకపోవడంతో ఆర్థిక ఇబ్బందుల్ని తట్టుకోలేక స్నేహితుల ద్వారా డ్రగ్స్ దందా చేసే నైజీరియా ముఠాకు దగ్గరయ్యాడని అంటున్నారు. కంబోడియా వెళ్లమనీ, అన్నీ ఖర్చులు తామే భరిస్తామనీ, భారత్‌కు డ్రగ్స్ తీసుకువస్తే అదనంగా డబ్బు ఇస్తామనీ నైజీరియా ముఠా ఆశ చూపించినట్టు తెలుస్తోంది. దాంతో రెండు వారాల క్రితం ఢిల్లీ నుంచి కాంబోడియా వెళ్లారు విశాల్ బ్రహ్మ. అక్కడనుంచి తిరిగి వచ్చేటప్పుడు ఓ నైజీరియన్ అతనికి ట్రాలీ బ్యాగ్ ఇచ్చాడనీ, అందులోనే డ్రగ్స్ ఉన్నట్లు సమాచారం.

విభిన్నంగా విలయతాండవం



కార్తీక్‌రాజు, పార్వతీ అరుణ్ జంటగా రూపుదిద్దుకుంటున్న 'విలయతాండవం' చిత్రం టైటిల్ పోస్టర్‌ను బుధవారం విడుదల చేశారు. వీఎస్ వాసు దర్శకత్వంలో మందల ధర్మారావు, గుంపు భాస్కరరావు నిర్మిస్తున్నారు. ప్రసాద్ ప్రీవ్యూ థియేటర్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి ఆకాశ్ పూరి, దర్శకుడు భీమనేని శ్రీనివాసరావు ముఖ్య అతిథులుగా హాజరై సినిమా మంచి విజయం సాధించాలని కోరారు. హీరో కార్తీక్ రాజు మాట్లాడుతూ 'ప్రస్తుతం కంటెంట్ ఉన్న చిత్రాలను జనం ఆదరిస్తున్నారు. దర్శకుడు వాసు కొత్త పాయింట్‌తో ఈ సినిమాను రూపొందించారు. టీజర్, ట్రైలర్ వచ్చాక అందరూ ఆశ్చర్యపోతారు. సినిమాలో నేను, పార్వతి, జగదీశ్ ముఖ్య పాత్రలు పోషించాం. మా అందరికీ పెద్ద విజయం అందించాలని ప్రేక్షకుల్ని అభ్యర్థిస్తున్నాం' అన్నారు. అద్భుతమైన కథతో 'విలయతాండవం' చిత్రాన్ని ఎక్కడా రాజీ పడకుండా తీశామని నిర్మాతలు చెప్పారు. తన ప్రయాణంలో సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలుపుతూ త్వరలోనే ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు వస్తుందని దర్శకుడు వాసు తెలిపారు.

క.రా.బీ.ని. ESIC

కార్మిక రాజ్య బీమా సంస్థ

(కార్మిక మరియు ఉపాధి మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం)

ప్రాంతీయ కార్యాలయం, 5-9-23, హిల్‌ఫోర్ట్ రోడ్, ఆదర్శ్‌నగర్, హైదరాబాద్, తెలంగాణ - 500063

ఫోన్: 040-23232356/57/58/59, ఇ-మెయిల్ ఐడి: ins5.ts@esic.gov.in

सत्यमेव जयते

ప్రకటన

కార్మిక రాజ్య బీమా చట్టం, 1948లోని సెక్షన్ 45-A క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకుని, జారీచేయబడిన C-18 నోటీసులకు సంబంధించి ప్రతీ కేసులో దిగువ తెలిపిన జాబితాలోని యజమాని(లు) సంబంధిత అధీకృత అధికారి సమక్షంలో హాజరు కావాలని ఇందుమూలముగా నోటీసు ఇవ్వడమైనది.

క్ర. సం.	యజమాని కోడ్	ఫ్యాక్టరీ/సంస్థ పేరు మరియు చిరునామా	యజమాని పేరు మరియు చిరునామా	ప్రకటన తేది	చందాలు చెల్లించబడని వ్యవధి	చందాల క్లెయిమ్ మొత్తం(రూ)	వ్యక్తిగత విచారణ తుది తేదీ	వ్యక్తిగత విచారణ కొరకు ఆదేశించిన అధికారి
1.	52000720460000604	మెస్సర్స్ శ్రీ అయ్యప్ప ప్రాజెక్ట్స్ 2-4-123/ఏ/64, స్వరూప నగర్, ఉప్పల్, హైదరాబాద్ 500039 టిఎస్	శ్రీ ఏ శ్రీనివాస్/కె వెంకట రెడ్డి 2-4-123/ఏ/64, స్వరూప నగర్, ఉప్పల్, హైదరాబాద్ 500039 టిఎస్ సంప్ర: 9948972800	సి18-అడ్‌హాక్ తేది:01-01-2021	2019 జూన్-2020 సెప్టెంబర్	122892	ప్రచురణ తేది నుండి 30 రోజులు	అధీకృత అధికారి ఇన్సూరెన్స్ - V శాఖ
2	52000720630001019	మెస్సర్స్ అర్.ఎస్ ఇన్‌ఫ్రా, ఫ్లాట్ నెం 407, కల్కి అపార్ట్‌మెంట్స్, బ్లాక్ ఎ, ప్రాణం హాస్పిటల్, చందానగర్ హైదరాబాద్ 500050, టిఎస్	శ్రీ కంచర్ల రామ సురా రెడ్డి C/o అర్ ఎస్ ఇన్‌ఫ్రా, ఫ్లాట్ నం.407, కల్కి అపార్ట్‌మెంట్స్ బ్లాక్ ఎ, ప్రాణం హాస్పిటల్, చందానగర్, హైదరాబాద్ - 500050, టిఎస్	సి18-అడ్‌హాక్ తేది 01-03-2023	2018 డిసెంబర్-2022 డిసెంబర్	236869	ప్రచురణ తేది నుండి 30 రోజులు	అధీకృత అధికారి ఇన్సూరెన్స్ - V శాఖ
3	52000720650001001	మెస్సర్స్ ఎస్.వి.ఫార్మ్స్ & నర్సరీ ప్లాట్ నం.85, E W S H, న్యూ సంతోష్ నగర్ కాలనీ, సంతోష్ నగర్, సైదాబాద్ హైదరాబాద్ 500059, టిఎస్	శ్రీమతి ఎల్.సత్యవేణి, ప్రొప్రైటర్ ప్లాట్ నం.85, E W S H, న్యూ సంతోష్ నగర్ కాలనీ, సంతోష్ నగర్, హైదరాబాద్ 500059, టిఎస్	సి18-అడ్‌హాక్ తేది 01-04-2021	2018 జూన్-2020 సెప్టెంబర్	166898	ప్రచురణ తేది నుండి 30 రోజులు	అధీకృత అధికారి ఇన్సూరెన్స్ - V శాఖ
4	52000720930000999	మెస్సర్స్ తేజశ్వీ కన్‌స్ట్రక్షన్స్ ఇ.నం.2-7-252/4, ముకరామ్‌పుర, కరీంనగర్ - 505 001	శ్రీ ఎస్ అంజనీ కుమార్ ఇ.నం.2-7-252/4, ముకరామ్‌పుర, కరీంనగర్ - 505 001 టిఎస్	సి18-అడ్‌హాక్ తేది 01-04-2021	2019 ఏప్రిల్-2020 సెప్టెంబర్	183645	ప్రచురణ తేది నుండి 30 రోజులు	అధీకృత అధికారి ఇన్సూరెన్స్ - V శాఖ
